తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం
epaper.vaartha.com WWW.VAARTHA.COM
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
24-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 174 పేజీలు: 8+4 వెల: 6.50








# నేడే మెగా పీటీయం 4.0




ఈరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్న భోజన సమయం వరకు
ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో జరిగే
## మెగా పేరెంట్ టీచర్ సమావేశం 4.0కు
## విద్యార్థుల తల్లితండ్రులందరికీ ఆహ్వానం

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ
వరుసగా రెండో ఏడాదీ
తల్లికి వందనం సకాలంలో విడుదల



67,47,190 విద్యార్థుల కోసం
42,70,802 తల్లుల/ సంరక్షకుల
ఖాతాల్లో రూ.10,120.78 కోట్ల
తల్లికి వందనం నిధులు జమ

Mega PTM 4.0కు వచ్చి
మీ పిల్లల హోలిస్టిక్
ప్రోగ్రెస్ కార్డులను అందుకోండి





డొక్కా సీతమ్మ
మధ్యాహ్న భోజన పథకం కింద
మీ పిల్లలకు అందిస్తున్న శ్రేష్ఠమైన
పౌష్టికాహారాన్ని ఆస్వాదించండి




LEAP యాప్‌ను డౌన్‌లోడ్
చేసుకుని... మీ పిల్లల పురోగతిని
నిరంతరం పర్యవేక్షించండి



Donor పోర్టల్ ద్వారా
మీకు నచ్చిన పాఠశాలల
అభివృద్ధిలో భాగస్వాములవ్వండి



ఆటల్లో పాల్గొనండి...
బహుమతులు గెలుచుకోండి

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

విద్యావ్యవస్థను తీర్చిదిద్దడంలో మనందరం భాగస్వాములవుదాం-మన పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును ఇద్దాం

వార్త, రాజమహేంద్రవరం, శుక్రవారం 24, జులై 2026



గురువారం సిఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఎంఒయు దృశ్యం

# క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

>> విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఒకే వేదికపైకి తెచ్చేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ పని చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించేలా ఈ హబ్ పని చేయనుంది..

**డిజిటల్ లిటరసీపై ప్రత్యేక కార్యాచరణ..**

అమరావతిని క్వాంటం సహా డీప్ టెక్నాలజీలకు కేంద్రంగా మార్చాలని సంకల్పించామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏక్యూవీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్వాంటం ఏఐ ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయటం మరో కీలకమైన మైలు రాయి అవుతుందని సీఎం అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే వినియోగదారులతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ పెంచే దిశగా కృషి చేయాలని ముఖ్యమంత్రి పీఎన్‌బీ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వాలు బ్యాంకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయటంలో టెక్నాలజీ మరింత విస్తృతమవ్వాలని సీఎం సూచించారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు భద్రతను అత్యుత్తమ స్థాయిలో అందించాలని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ ను మరింత పటిష్టంగా, సులభతరంగా సేవలు అందించేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సిఇఒ ఎండీ అశోక్ చంద్ర ముఖ్యమంత్రికి వివరించారు.

# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

>> పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు.నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యుపిఎస్‌సి, ఎస్ఎస్‌సి, ఆర్ఆర్‌బి, ఐబిపిఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

# రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులు

>> కోవడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ లో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధనం అవసరం, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. నిర్ణీత సమయంలో గ్రౌండ్ చేసిన ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించేలా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఇ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**రంపచోడవరంలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం**

పోలవరం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు రంపచోడవరం ఘన స్వాగతం లభించింది.ఐ పోలవరం జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, మఠం విజయభాస్కర్ లోకేష్కు జ్ఞాపిక అందజేసి ఘనస్వాగతం పలికారు. రాత్రి 10.30 గంటలు దాటినా లోకేష్ కోసం కార్యకర్తలు వేచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మంత్రిని కలిసేందుకు వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను వివరిస్తూ అర్జీలు సమర్పించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించి పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా పోలవరం జంక్షన్ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రికి స్వాగతం పలికారు.



నవీ ముంబయిలో ఘోడ్‌బందర్ పాటలీపాడ వంతెన మీద అదుపు తప్పి బోల్తా పడిన ట్రక్కును క్రేన్‌తో తరలిస్తున్న దృశ్యం

# 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

>> ఇందుకోసం బడ్జెట్ లో రూ.250 కోట్లు కేటాయించామని, ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్బంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్రం చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో శుభవార్త చెప్పిందన్నారు. నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఈ మేరకు కేబినెట్‌లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. చేనేతలకు ఆర్థిక దన్ను కలిగించేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టిన సిఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

**నేతన్న కుటుంబానికి భారీ ఆర్థిక లబ్ధి**

50యేళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. 51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, యేడాదికి రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు నెలకు రూ.1800 చొప్పున యేడాదికి రూ. 21,600లు లబ్ధి కలుగుతోందన్నారు. మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో రూ.25 వేలు, పెన్షన్ రూ.4 వేల చొప్పున రూ.48 వేలు, ఉచిత్ విద్యుత్‌తో రూ.8,640లు మొత్తం ఏడాదికి రూ. 81,640లు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. మర మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో పథకం కింద రూ.25 వేలు, పెన్షన్ రూపంలో రూ.48 వేలు, ఉచిత విద్యుత్ కింద రూ.21,600లు కలిపి మొత్తం రూ.94,000 లబ్ధి కలుగుతోందన్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టెక్స్‌టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు గౌరవప్రద జీవనమే సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. యేటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామని తెలిపారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని, ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టిటిడితో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి సవిత కొనియాడారు.

# మాఫియా మూలాలను తుడిచేయండి

>> నాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి, ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గతప్రభుత్వ హయాంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించ లేదని పేర్కొన్నారు. అలాగే, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో కన్విక్షన్ రేటు 3 శాతం కంటే తక్కువగా ఉండేదని, 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలువిధించే స్థాయికి కన్విక్షన్ రేటు పెరిగిందని వివరించారు. గతంలో స్మగ్లర్లపై పిడి చట్టం అమలు చేయని పరిస్థితి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 12 మంది స్మగ్లర్లపై పిడి చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**సమన్వయం తక్షణ అవసరం**

ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకించిన అటవీ సంపద... ఎర్రచందనం. కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్ర చందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలి. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో సమన్వయం తక్షణ అవసరం. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్స్, ఫైనాన్షియర్స్‌పైనా దృష్టి సారించాలి. బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను రక్షించేందుకు అత్యాధునిక సాంకేతికత, డ్రోన్ల పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటూ నిఘాను మరింత విస్తృతంగా వినియోగించాలి. అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలి" అని పేర్కొన్నారు.

# సవాల్‌గా తీసుకోండి!

>> చొరవ తీసుకోవాలని సిఎం చంద్రబాబు సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు ఇన్చార్జ్ మంత్రులదే బాధ్యత అని స్పష్టం చేశారు. భోగాపురం ప్రధాని పర్యటన వివరాలు మంత్రులకు సిఎం వివరించారు. ఉత్తరాంధ్ర 6 జిల్లాల్లో ఫించన్లు ఒకరోజు ముందే ఇచ్చేసి ఆగస్టు 1న పూర్తి స్థాయిలో ప్రధానమంత్రి కార్యక్రమంలో నిమగ్నం కావాలని చంద్రబాబు ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయార్ను అని చెప్పుకొచ్చారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సిసిటివి కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డిఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో మంత్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సిఎం పేర్కొన్నారు. పోలవరం ప్రారంభోత్సవం, గోదావరి పుష్కరాల ప్రారంభ కార్యక్రమాలను విడివిడిగా నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశంలో చెప్పినట్లు సమాచారం.

మెగా డిఎస్సీకి, ఢిల్లీ ఆందోళనలకు ముడిపెట్టాలని వైఎస్సార్సీపీ యత్నిస్తోందని మంత్రులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లేని వివాదాలు సృష్టించటమే ఆ పార్టీ నైజం అని చంద్రబాబు మండిపడ్డారు. ప్రో యాక్టివ్‌గా మంత్రులు ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం పొగాకు రైతుల కోసం తీసుకున్న చర్యలను ప్రజలకు ముందుగానే వివరించాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు ముందే తెలియజేస్తే ప్రతిపక్షానికి అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఆగస్టు చివరి వారంలో ఉద్యాన హబ్‌ను మదనపల్లిలో ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆగస్టు మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ప్రారంభోత్సవం ఉంటే, చివర్లో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు.

**ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ**

జిల్లాల్లో ఇన్‌చార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారం అయినట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తెలిపారు. యేళ్ల తరబడి పెండింగ్ సమస్యల పరిష్కారం అయినవి ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలని సూచించారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు.

# రాజాపై ఎస్సీ, ఎస్టీ కేసు

>> 2024వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల ముందు బద్వేల్ టికెట్ కోసం వైకాపా నాయకుల కాళ్ల చుట్టూ తిరిగారని ఇలాంటి అవినీతిపరులకు, లంచగొండిలకు టిక్కెట్ ఇవ్వమని ఎడమ కాలనీలతో బయటకు తన్నేసామంటూ అత్యంత అవమానికారంగా ఆయన మాట్లాడారు.భూ వివాదాల కోసం, మాట్కా దందాల కోసం కర్నూలు మూడో పట్నం పోలీస్ స్టేషన్లో శేషయ్య పోస్టింగ్ ఇచ్చారని వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు ఒంటిమీద చొక్కా ఉంటే ఒట్టు అని హెచ్చరించారు.ఇంటి గేటు దగ్గర నిలబడి ఎండలో వానలో విధులు నిర్వహించే పోస్టును ఇప్పిస్తామని చెప్పారు. జక్కంపూడి రాజా చేసినవి సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారాయి. విషయం ఎస్సీ కమిషన్ దృష్టికి వెళ్లడంతో జక్కంపూడి రాజాపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె జవహర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా ఆదేశాలు ప్రకారం బి.ఎన్.ఎస్ 351( 2)ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద ఈ ఏడాది మే నెల 28వ తేదీన కేసు నమోదు చేశారు.దీనిపై నోటీసులు జారీ చేశారు.

# 3,168 ఉద్యోగాల భర్తీ!

>> చారు. సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ అయ్యింది. భుజానికి శస్త్ర చికిత్స కారణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరు కాలేదు. దాదాపు 25కు పైగా అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బాపట్ల జిల్లా వేదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాల కోసం భద్రతా ఏర్పాట్లకు రూ.50 కోట్లు మంజూరు చేసింది.పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా ఏపీ టూరిజం అథారిటీకి కీలక భూ బదిలీలు జరిగాయి. చిత్తూరు, కాకినాడ నగరాల్లో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్, స్టార్ హోటళ్లు, సరికొత్త టూరిజం ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాలను బదిలీ చేస్తూ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విజయనగరంలో యశశ్రీ విరోహా ఇంపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో "రద్దీస్ రీజెనరేటివ్ హాబ్" పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. పుట్టపర్తిలో ఎస్ఎస్ఎస్ ఏరోస్పేస్ ప్రాజెక్టు స్థాపన కోసం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భూములపై ఉన్న 76.13 ఎకరాల నిషేధాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు.మంత్రివర్గ సమావేశంలో ల్యాండ్ పూలింగ్ రైతులకు న్యాయం చేయడంతో పాటు పలు మౌలిక వసతుల ఒప్పందాలకు సవరణలు చేశారు. అనకాపల్లి ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా చెర్లపాలి ఖండం రైతులకు 1,800 చదరపు గజాలు లేఅవుట్ డెవలప్ చేసిన ప్లాట్లను పరిహారంగా ఇవ్వనున్నారు. విజయవాడ జెట్ సిటీ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో స్థలాల కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కుల వేగవంతం కోసం ఎపీఐఐసీ - ఎన్ఐసీడీఐటీ మధ్య జరిగిన ఒప్పందాన్ని సవరించారు. అగ్నిమాపక శాఖ ఆధునీకరణకు ఆమోదం లభించింది. పరిశ్రమలు, విద్య, మౌలిక సదుపాయాలకు ఊతమిస్తూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నీటిపారుదల రంగంలో నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641 కోట్ల పరిపాలనా అనుమతి, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్ -2 పనుల వ్యయాన్ని రూ.312 కోట్లకు పెంచే ప్రతిపాదనలకు ఆమోద ముద్ర పడింది.విశాఖలో ఏఐజీసంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణానికి మంత్రివర్గ కమిటీ భూ కేటాయింపులు జరిపారు. నంద్యాల జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో 700 మెగావాట్ల సోలార్, 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుల స్థాపనకు రెండు విడతల్లో భూములు కేటాయించారు. గండికోట పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పరిధిలో అదానీ సంస్థ నిర్మిస్తున్న 18 వందల మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్ట్ పనుల కోసం ఎన్ఆర్ఇడిసీఎపికు భూములు కేటాయించారు. కుప్పంలో శ్రేష్ఠ రెన్యూవబుల్స్ ఆధ్వర్యంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు, నంద్యాలలో ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్ మినీ హైడల్ ప్రాజెక్టుకు 33 ఏళ్ల లీజుపై భూములిస్తూ క్లియరెన్స్ ఇచ్చారు.శ్రీకాకుళంలోని బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థల లీజును కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పుష్కరాల నిర్వహణ, భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం రూ.50 కోట్ల నిధుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వడం వంటి అంశాలకు మంత్రివర్గం నుంచి ఆమోదం లభించింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్‌పై కూడా మంత్రివర్గం చర్చించింది. అలాగే నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతుల మంజూరుపై చర్చ జరిగింది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2 పనుల అంచనా వ్యయాన్ని రూ.241.20 కోట్ల నుంచి రూ.312 కోట్లకు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది ఇక మంత్రి వర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మదనపల్లిలో ఆగస్టు చివరి వారంలో ఉద్యానవనాన్ని ప్రారంభిస్తారని సీఎం చెప్పారు. గోదావరి పుష్కరాల ప్రారంభం రోజే పోలవరం ప్రారంభం గురించి ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. రెండో త్రైమాసికంలో అడుగుపెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో వెనుకబాటుతనం ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని అన్నారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపి

ఇచ్చి ట్యాంపర్‌ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని, ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. ఎన్ఐసి ఆంధ్రప్రదేశ్, ఎన్ఐసి బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్‌లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో 'మీ భూమి-బ్లాక్ చెయిన్'వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీసర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. 'మీ భూమి-బ్లాక్ చెయిన్' అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్‌ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అధ్యయనం చేయాలి... లోపాలు సరిదిద్దాలి**

'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఎపిలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఎపిలోనూ భూ తగాదాలు, వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన 'మీ భూమి-బ్లాక్ చెయిన్' ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి... దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సిఎస్ సాయిప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఎపి ఎన్ఐసి, బెంగళూరుఎన్ఐసి ప్రతినిధులు హాజరయ్యారు.

# అంపోలు జైలుకు అప్పలరాజు

>>పోలీసులు ఉన్నా వాహనాల రాకపోకలు సంభింపచేసినా కాలిబాటన, పొలాల్లోంచి జనం పలాసకాశీబుగ్గ పట్టణానికి చేరుకుని డాక్టర్ కు తమ సంఘీభావంను తెలియజేశారు.. అప్పలరాజు అరెస్టు హైడ్రామా 24 గంటల పాటు నడిచింది.

**ఆరోపణలతో అక్రమ కేసులు**

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు చేసిన యాక్సిడెంట్ లో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందగా.. సాక్షాలను తారుమారు చేసేందుకు ప్రయత్నం చేశారనే అభియోగంతో మాజీ మంత్రి సీదిరిని బుధవారం రాత్రి కాశీబుగ్గ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదంలో అప్పలరాజు కుమారుడు అరవ వర్మ సిద్దార్థ త్యాడీలను పదిరోజుల క్రితం ఆరెస్టు చేసి జైలుకు పంపిన పోలీసులు ఇదే కేసులో ఏ3గా పేర్కొంటూ డాక్టర్ అప్పలరాజును బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. అరవవర్మ సిద్దార్థ త్యాడీలను అరెస్టు చేసిన రోజు నుంచి అప్పలరాజు ఇంటి వద్ద పోలీస్ స్తే పెద్దసంఖ్యలోనే ఉంది. బుధవారం సాయంత్రం నాటికి ఎసిపి, ముగ్గురు డిఎస్పిలు, పలువురు సిఐలు, ఎస్సైలు, వందలాది మంద పోలీస్ కానిస్టేబుళ్లు కాశీబుగ్గలోని అప్పలరాజు ఇంటివద్దకు చేరుకున్నారు. పోలీస్ బలగాలు బుధవారం సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున సీదిరి ఇంటివైపు కదిలిరావడంతో పరిసర ప్రాంతాల్లో ప్రజలు కార్యకర్తలు కూడా అక్కడకు చేరుకొనే ప్రయత్నం చేశారు. అయితే అరెస్టుకు ముంచే పోలీస్ యంత్రాంగం పలాస, కాశీబుగ్గ పట్టణంలో పెద్ద ఎత్తున వలయాలు ఏర్పాటు చేయడంతో పాటు స్టేషన్ వైపు ఎవరూ రాకుండా జారగేడ్లు ఏర్పాటు చేశారు. అప్పలరాజును అరెస్టు చేసిన సమయంలో పోలీసులకు, వైశాపా నేతలు, కార్యకర్తలు, అభిమానులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. మాజీ మంత్రి అప్పలరాజును బలవంతంగా పోలీసులు తీసుకొని వెళ్లడానికి చేసిన ప్రయత్నం ను కార్యకర్తలు, అభిమానులు తీవ్రంగా అడ్డుకున్నారు.. ఆయన సోదరుడు సీదిరి త్రినాథ్‌ను పోలీసులు నెట్టేయడం కూడా కార్యకర్తల ఆగ్రహం మరింత పెరగడానికి కారణమయ్యింది.

**అప్పలరాజును రాత్రంతా పోలీస్ స్టేషన్లోనే ఉంచారు**

ఇదే ఘటనలో అప్పలరాజును తీసుకెళ్తున్నప్పుడు అడ్డుకొనేందుకు ప్రయత్నించిన టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌ను కూడా పోలీస్ స్టేషన్‌కు తీసుకొనివెళ్లారు. గురువారం ఉదయం వలాస నియోజకవర్గంలోని వజ్రపు కొత్తూరు, మందస, పలాస మండలాలతో పాటు పలాస, కాశీబుగ్గ పట్టణానికి చెందిన జనం కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా నలు మూలల నుంచి మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వారు, సీదరి అప్పలరాజు అభిమానులు వైసిపి శ్రేణులు, పలాస కాశిబుగ్గ వాహనాలతో రాకపోకలను పోలీసులు అడ్డుకోగలిగినప్పటికీ కాలిబాటన జనం మాత్రం వేల సంఖ్యలో గుమిగూడిపోయారు. మఫ్టీలోనూ, యూనిఫామ్ తోను వందలాది మంది పోలీసులు అరెస్టు చేయడావికి అక్కడకు వచ్చిన జనాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించడాన్ని జనం చర్చించుకుంటున్నారు. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం హాజరై అప్పలరాజు అరెస్టును ఖండించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లోనే మాజీ మంత్రి అప్పలరాజును ఉంచడాన్ని ముక్త ఖంఠంతో ఖండిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల తరువాత అప్పలరాజును కోర్టులో ప్రవేశపెట్టడంతో జడ్జి బెయిల్ తిరస్కరించి 14 రోజుల రిమాండ్ ను చెప్పడం శ్రీకాకుళం దగ్గర అంపోలు సబ్ జైలుకు తరలించారు.

## వారం - వర్జ్యం

24-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
దశమి ఉ.9.13, అనూరాధ తె.4.36
వర్జ్యం : ఉ.6.12-ఉ.8.00
దు.ఉ.8.20-ఉ.9.12, 2)మ.12.39-మ.1.31
శుభసమయం : ఉ.5.00-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** పారిశ్రామిక రంగాలలో వారికి పదవులు, హోదాలు లభిస్తాయి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.

**వృషభం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. రెండు, మూడు విధాలుగా ధన లాభం పొందుతారు. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**మిథునం:** క్రీడారంగం యందు ఆసక్తి కలిగివుంటారు. మొండిబాకీలు రాబట్టుకోవడానికి కొత్తగా మార్గాలు అవలంభిస్తారు.

**కర్కాటకం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడిందని గుర్తించి కొత్త వ్యూహాలను అనుసరిస్తారు. ఆ దిశగా కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**సింహం:** నూతనవ్యక్తులు పరిచయమై మాట సహాయసహకారాలు అందిస్తారు. అప్రయత్నంగా కలిసివస్తాయి. ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** క్రయవిక్రయాలు, దూరప్రాంత ప్రయాణాలు, పెట్టుబడులు కొంతకాలం వాయిదావేయటం అన్నివిధాలా మంచిది.

**తుల:** స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. రాజకీయ రంగాలలోని వారు విదేశీ పర్యటనలు పొందుతారు.

**వృశ్చికం:** సేవకా సిబ్బంది వలన, సహోద్యోగుల వలన నష్టములు వాటిల్లవచ్చు. తగు జాగ్రత్తలు పాటించండి.

**ధనుస్సు:** సంతానం గురించి అధికంగా ఆలోచిస్తారు. వారి పురోభివృద్ధికి కావలసిన వనరులను సమకూరుస్తారు.

**మకరం:** దూరప్రాంతాలలోని ఆత్మీయుల నుండి ఆనందాయకమైన సమాచారం అందుకుంటారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** వ్యవహారాల తాలూకు చికాకులను ఇంట్లో ప్రదర్శిస్తారు. ఇది లాభించే అంశం కాదు. కనుక తగుజాగ్రత్తగా ఉండండి.

**మీనం:** ప్రతి చిన్నవిషయానికి శ్రమించి చివరకు పూర్తిచేస్తారు. క్రయవిక్రయాలలో మెలుకువ అవసరం.ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 174 పేజీలు: 8+4 వెల: 6.50


జొన్నగిరి ఇకపై 'స్వర్ణగిరి' గోల్డ్‌మైన్స్

5లో

ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: మంత్రి గొట్టిపాటి

# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

ప్రధాని మోడీ హామీ... గంటల్లోనే కార్యాచరణ

ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాట్లు కేంద్రం చర్యలు

కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద కేసుల విచారణ

దోషులుగా తేలితే ఐదేళ్లు జైలు, రూ.10 లక్షల జరిమానా

తొలి దశలో 4 రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు

**న్యూఢిల్లీ, జులై 23:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 2024 కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కోల్‌కతా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే >>2

## ఉపేక్షించబోం!



"మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది మరొకటి లేదు. పరీక్షా పత్రాల లీకేజీకి పాల్పడిన వారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లను ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించాము. ఈ దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించాము. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తాము చేపడుతున్న వరుస చర్యలలో ఇది మరొకటి. మన యువత భవిష్యత్తుకు హాని కలిగించడానికి ప్రయత్నించే వారిని ఏమాత్రం ఉపేక్షించబోమ్మ

- నరేంద్రమోడీ, ప్రధానమంత్రి

## దెబ్బతీసింది మీరే!



"మన యువత భవిష్యత్తును అత్యంత తీవ్రంగా దెబ్బతీసింది మీరే.మన విద్యా వ్యవస్థను పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకుని నాశనం చేసేలా మీరు అనుమతించారు, ప్రోత్సహించారు. అంతేకాక, అందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ మీరు కాపాడారు. విద్యార్థుల డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలి. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్లి

- రాహుల్‌గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

## భవిత కోసమే పోరు!



"అన్నిటికంటే ముందుగా మీరు యువత డిమాండ్లను నెరవేర్చాలి.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, అవినీతి వ్యవస్థను సంస్కరించాలి, విద్యార్థులందరి నుండి క్షమాపణ కోరాలి. ప్రధానమంత్రి గారూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్నది మీ సొంత దేశానికి చెందిన యువత్లే

- కాక్రోచ్ జనతా పార్టీ



## చర్చలకు సిద్ధం

- కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేంద్ర సింగ్ వెల్లడి
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే చర్చలు: సిజెపి
- ఆ చర్చలు తటస్థ వేదికపైనే జరగాలని స్పష్టీకరణ

## పార్లమెంట్‌లోనూ రెడీ!

- కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రిజిజు ప్రకటన
- నాల్గవ రోజూ ఉభయ సభల్లో 'నీట్' రభస
- పార్లమెంట్ వెలుపలా అధికార, విపక్షాల ఆందోళన






- ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన
- పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన ఢిల్లీ పోలీసులు
- పోలీసులకు ప్రత్యేక అధికారాలు కల్పించిన కేంద్ర హోంశాఖ
- కాంగ్రెస్ తీరుపై వాంగ్‌చుక్ భార్య గీతాంజలి మండిపాటు
- రాజకీయాల కోసం విద్యార్థులను వాడుకోవద్దని హితవు
- నేడు దేశవ్యాప్త ఆందోళనలకు సిజెపి పిలుపు

## తగ్గేదేలే!: సిజెపి

- విద్యార్థులకు మద్దతు ప్రకటించిన సినీ ప్రముఖులు
- విద్యార్థులు ఒంటరివారు కాదు మేం వాళ్లతో ఉన్నాం
- జంతర్‌మంతర్ నిరసనల్లో విద్రోహ శక్తులు
- ఢిల్లీ పోలీసుల సంచలన పోస్టులు
- సిజెపి ఆందోళనకు విదేశీ నిధులు...
- బిజెపి కార్యకర్తలు రాళ్లు విసిరారు
- సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే ఆరోపణలు
- జంతర్‌మంతర్ దగ్గర ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిపివేత
- భారీగా పోలీసులు మోహరింపు... ఆంక్షలు

# ఎల్ నినో సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకోండి!

లోటు వర్షపాతం నమోదవుతోంది

తాగునీటికి తొలి ప్రాధాన్యతివ్వండి


పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం

ప్రత్యామ్నాయ పంటలేయండి

రైతులకు అవగాహన కల్పించాలి

కేబినెట్ భేటీలో విస్తృత చర్చ

మంత్రులకు సిఎం దిశానిర్దేశం




**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతుందనే సమాచారం నేపథ్యంలో వ్యవసాయ రంగం జలవనరులు, పౌరసరఫరాలు, పరిశ్రమలు, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖలు సమన్వయంతో సంక్షోభాన్ని సవాలుగా తీసుకోవాలని మంత్రులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం భేటీలో అజెండా అంశాలు ముగిశాక లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. తాగు నీటికి తొలిప్రాధాన్యం, పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు మంత్రులు వివరించాలన్నారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కృష్ణా, గుంటూరు డెల్టాలో వరి సాగు వేయకుండా రైతుల్ని చైతన్య పరచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు పై రైతులకు అర్థమయేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలుచేపట్టాలని వెల్లడించారు. ఏసమస్య ఎక్కడతలెత్తినా ఇన్‌చార్జ్ మంత్రులు >>2

## 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

- చేనేతలకు యేటా రూ.25 వేల ఆర్థిక సాయం
- 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి
- ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకం అమలు
- 50 యేళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్లు
- చంద్రబాబు పాలన నేతన్నలకు స్వర్ణయుగమే
- చేనేతల తరపున సిఎంకు మంత్రి సవిత ధన్యవాదాలు



**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సిఎం చంద్రబాబు లక్ష్యమని, ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా 'నేతన్న సేవ్వలో పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవలో పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ.25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. >>2

## మరింత అధ్యయనం తర్వాత 3,168 ఉద్యోగాల భర్తీ!

కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం

25కు పైగా అంశాలపై చర్చ, ఆమోదం

పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భూములపై నిషేధం ఎత్తివేత

కుప్పంలో కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు

విజయవాడ జెట్ సిటీ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో స్థలాల కేటాయింపులకు ఆమోదం

గండికోటలో 18 వందల మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్ట్‌కు భూములు కేటాయింపు

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగాల కల్పన, సంక్షేమం, విద్య, నీటిపారుదల రంగాల వంటి కీలక అంశాలకు ఆమోదం తెలపటమే అజెండాగా సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. రెండో దశలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై మరింత అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి, తదుపరి కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని సిఎం సూచిం >>2



## ఎర్రచందనం మాఫియా మూలాలను తుడిచేయండి

- డ్రోన్‌లతో నిఘా.. స్మగ్లింగ్ పూర్తిగా అరికట్టాల్సిందే
- కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపండి
- జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలి
- మన ఎర్ర చందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలవద్దు
- అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** "రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో అటవీ శాఖ ప్రణాళికలకు మరింత పదును పెట్టాలి. ఇందుకోసం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచాలి. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాల్లి అని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా నిర్మూలించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏమేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఈసందర్భంగా గడచిన రెండేళ్లలో ఎర్ర చందనం అక్రమరవాణాను అరికట్టేందుకు అటవీశాఖ తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, నమోదైనకేసుల వివరాలను అధికారులు వివరించారు.

**506 కేసులు... 1239మంది అరెస్టు**

గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అధికారులు వివరించారు. 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేయగా, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, 12మంది ప్రధాన స్మగ్లర్లపై పిడిచట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళ >>2



## అంపోలు జైలుకు అప్పలరాజు

బెయిలు తిరస్కరణ

14 రోజుల రిమాండ్

పలాసలో హైడ్రామా

రోజంతా పోలీస్ స్టేషన్‌లోనే

భారీగా పోలీసు బందోబస్తు

**పలాస, జులై 23, ప్రభాతవార్త :** మాజీ మంత్రి వైకాపా నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్టుతో పలాసకాశీబుగ్గ జంట పట్టణాలు అట్టుడికిపోయాయి. అప్పలరాజు అరెస్టు వార్త బుధవారం సాయంత్రం జనానికి తెలిసిపోవడంతో పరిసర ప్రాంతాలనుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గురువారంసాయంత్రం వేలాది సంఖ్యలో జనం పలాస కాశీబుగ్గ పట్టణానికి చేరుకున్నారు. వందలాది మంది >>2

## అమరావతిలో పిఎన్‌బి క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

**విజయవాడ , జులై 23.ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటం వ్యాలీలో మరో కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందుకు వచ్చింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ లో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఎపి క్వాంటం మిషన్‌పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఒప్పందం కుదిరింది. సిఎం చంద్రబాబు నాయుడు పిఎన్‌బి సిఇఒ, ఎండి అశోక్ చంద్ర సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మొట్ట మొదటి బ్యాంక్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది. బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను పటిష్టం చేయటంతో పాటు ఆర్థిక మోసాలను ముందుగా గుర్తించే వ్యవస్థ ఏర్పాటు, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్ని సురక్షితంగా నిర్వహించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు, >>2

## జక్కంపూడి రాజాపై ఎస్సీ, ఎస్టీ కేసు

28న విచారణకు రావాలంటూ వైసిపి నేతకు నోటీసులు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, జులై 23,ప్రభాతవార్త:** కర్నూలు మూడవ పట్టణ సిఐగా విధులు నిర్వహిస్తున్న శేషయ్యను ఉద్దేశించి అత్యంత అభ్యంతరంగా మాట్లాడిన వైయస్ఆర్సీపి యువత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కర్నూలు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని డిఎస్‌పి రాఘవేంద్ర ఆయనకు నోటీసులు పేర్కొన్నారు. వైకాపా యోజన విభాగం కర్నూలు నగర అధ్యక్షుడు బాలును పోలీసులు వేధిస్తున్నారంటూ వైకాపా నాయకులు మే 14వ తేదీన కలెక్టరేట్ దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ పోలీసులు కాకి చొక్కాలు వేసుకుని తప్పు చేస్తున్నారని తాము కొట్టే దెబ్బ చావుదెబ్బలాగా ఉంటుందని హెచ్చరించారు. సిఐ శేషయ్య తాను సంపాదించిన అక్రమ సంపాదనతో రాజకీయాల్లోకి రావాలని చూశారని జక్కంపూడి ఆరోపించారు. >>2

## రెండేళ్లలో రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులు



గురువారం రంపచోడవరంలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న దృశ్యం

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చిత్తశుద్ధితో అమలు చేయాలి

పరిశ్రమల గ్రౌండింగ్‌లో ప్రతినెలా పురోగతి కన్పించాలి

20లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల బృంద సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.29,30,357 కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు ముందుకు వచ్చాయి. వీటిద్వారా 24,66,165 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశంఉంది. ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం మంత్రిలోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరిగింది. సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షలో పురోగతి కన్పించాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలు ఎపిని ఎంచు >>2

## ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపి

భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్'

ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూర్టీ

'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రక్షాళన-విముక్తి- భద్రత అంశాలుగా భూ సమస్యలకుశాశ్వతపరిష్కారంచూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సిఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్ణ్ ప్రాజెక్టును తెచ్చామని సిఎం చంద్రబాబు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి 'మీ భూమి-బ్లాక్ చెయిన్ణ్ పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా సిఎం ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకత లను సిఎస్ సాయిప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సిఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూశాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా ప్రతి ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడి >>2


వార్త

భూమ్మీద మనిషంత గొప్పవాడు ఎవడూ లేడు. మనిషిలో మెదడంత గొప్ప అవయవం మరొకటి లేదు.

-విలియం హామిల్టన్

# 'ఉచితాల' కోసం ఎన్ని తిప్పలో!

ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా రూపొందుతున్న పథకాలు ఏలిన వారికి విజయం సాధించి పెట్టినా, ఆ వెంటనే అభాసుపాలు చేస్తున్నాయి. చిత్తశుద్ధికీ లక్ష్య సిద్ధికి లంగరు అందడం లేదు. అనర్హులకు చిక్కుతున్నాయి. ప్రభుత్వ ఖజానాలకు చిల్లుపెడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఏరాజకీయ పార్టీ అధికారంలోఉన్నా అవలంభించాల్సిన ఎన్నికల తంత్రం ఇదేనన్నట్లు చరిత్ర శిలాక్షరాలు రాసిపెట్టేసినట్లుంది. ఉచితాలనేవి తాత్కాలిక ప్రయోజనం ఆశించి గుప్పించే 'ఎర'మాత్రమే. అంతకన్నా వేరుగా విశ్లేషించలేం. కాలక్రమేణ అదే విషయం నిరూపితమవుతోంది. మహారాష్ట్రలో మహిళల కోసం మొన్న ఎన్నికలప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకం ఇప్పుడు ఆ రాష్ట్ర కోశాగారానికి కన్నం పెట్టిందనే చెప్పాలి. అనర్హులకు తామరతంపరగా ఆర్థికలబ్ధి చేరిపోయింది. ఇదేదో కుడి ఎడమైతే పర్వాలేదని పరాకుగా తెచ్చినపథకంకాదు. కానీ మహా కోశాగారం ఖాళీ అయిపోయింది. మహారాష్ట్ర ప్రభుత్వం పేదమహిళల ఆర్థిక పరిపుష్టి కోసం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ముఖ్యమంత్రిమాఝీలాడ్కీ బహీన్ యోజన'లో వెలు గుచూసిన ఆరోపణలు, బడ్జెట్ ఉల్లంఘనలు, నకిలీ లబ్ధిదారుల ఉదంతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో పారదర్శకత లోపిస్తే, ప్రజాధనం ఏ విధంగా దుర్వినియోగమవుతుందో తెలిపేందుకు ఈ ఘటన ఒక ఉదాహరణ. కాగ్ నివేదికతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర తనిఖీల్లో ఈ పథకంలో జరిగిన లోపాలు స్పష్టమయ్యాయి. ప్రాథమిక దశలో కఠినమైన భౌతిక తనిఖీలు లేకుండా కేవలం స్వీయ పత్రాల ఆధారంగా ఆదరబాదరగా నిధులు విడుదల వల్ల నకిలీ ఖాతాలు వెలిశాయి. నిరుపేద మహిళలకు నెలకు రూ.1,500 ఇచ్చే ఈపథకంలో సుమారు 14వేల మందికి పైగా పురుషులు మహిళలుగా నకిలీపత్రాలతోనమోదు చేసుకుని నిధులు పొందినట్లు తేలింది. దీనివల్ల సుమారు రూ.21.44 కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. అర్హత లేకపోయినా దాదాపు 2,600 మందికి పైగా ప్రభుత్వ మహిళా ఉద్యోగులు (క్లాస్3, క్లాస్4) ఈ ఆర్థిక సహాయాన్ని అక్రమంగా పొందారు. దాదాపు 29వేల మంది పురుషులు, సుమారు 8వేల మంది ప్రభుత్వఉద్యోగులు అనర్హులు అయినప్పటికీ లబ్ధి పొందినట్లు తేలింది. నిధుల కేటాయింపుల్లో అనుమతించిన బడ్జెట్ కంటే దాదాపు రూ.3,541 కోట్ల మేర అదనపు వ్యయం జరిగిందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. ఈ స్థాయిలో అక్రమాలు జరగడానికి ప్రభుత్వ యంత్రాంగం, డిజిటల్ వ్యవస్థల్లో ఉన్న లోపాలే ప్రధాన కారణం. ఎంప్లాయ్ డేటాబేస్, ఆధార్ సీడింగ్‌ను సరిగ్గా సరిపోల్చకపోవడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం సులభంగా లబ్ధిదారులుగా మారిపోయారు. లోపాలు బయటపడిన తర్వాత ప్రభుత్వం కఠిన తనిఖీలు చేపట్టి, ఆన్‌లైన్ ఈకెవైసి ప్రక్రియ ద్వారా దాదాపు 92లక్షల నకిలీ, అనర్హమైన ఖాతాలను తొలగించింది. అలాగే అక్రమంగా నిధులు పొందిన వారి నుండి రికవరీ చర్యలను ప్రారంభించింది. తొలగించబడిన లబ్ధిదారులు సుమారు రూ.14వేలకోట్లు అందుకున్నారు. ఈ ఘటన ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ పథకాలనిర్వహణపై అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. ఎన్నికల సమయాల్లో హడావుడిగా తగినంత బడ్జెట్ అంచనాలు లేకుండాప్రవేశపెట్టే పథకాలు రాష్ట్ర ఆర్థికపరిస్థితిని దెబ్బతీస్తాయి. ఒకేసారి లక్షలాది పేర్లను తొలగించే క్రమంలో, డిజిటల్ పరిజ్ఞానం లేని కొందరు నిజమైన పేద మహిళలు కూడా ఈకెవైసి సమస్యల వల్ల ప్రయోజనాలు కోల్పోతున్నారనే ఆందోళన ఉంది. లడ్కీబహీన్ యోజన కింద నమోదు చేసుకున్న ప్రతి 10మంది మహిళల్లో దాదాపునలుగురిని తొలగించినట్లు ప్రభుత్వ రికార్డుల సమీక్షలో వెల్లడైంది. ఈపథకం నుండి 92 లక్షలకు పైగా లబ్ధిదారులను తొలగించారు. ఇది మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడించిన సుమారు 80లక్షల తొలగింపులను మించిపోయింది. ఇలాంటి వాటిపై ఎన్నో చర్చోపచర్చలు జరుగుతాయి. కానీ ఫలితం శూన్యం. వారి కుటుంబాల వార్షిక ఆదాయం పథకం అర్హత గరిష్ట పరిమితి అయిన రూ.2.5లక్షలను మించిపోయినందున, దాదాపు 16లక్షల మంది లబ్ధిదారులను తొలగించారు. ధృవీకరణ సమయంలో మరో 4.42లక్షల మంది లబ్ధిదారులు, తాము గానీ లేదా తమ కుటుంబ సభ్యులలో ఒకరు గానీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారని ప్రకటించారు. వీరిలో సుమారు3.6 లక్షల మంది ఇప్పటికే సంజయ్‌గాంధీ నిరాధర్ యోజన కింద సహాయం పొందుతుండగా, దాదాపు 2.5 లక్షల కేసులలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారు. రికార్డుల ప్రకారం, సుమారు 1.8 లక్షల మంది లబ్ధిదారులు 65ఏళ్ల గరిష్టఅర్హతా పరిమితి కంటే ఎక్కువ వయస్సుగలవారని, జిల్లా స్థాయి ధృవీకరణ సమయంలో దాదాపు 1.7లక్షల మందిని గుర్తించినట్లు వెల్లడైంది. ఈపథకం కింద, సంవత్సరానికి రూ.2.5 లక్షల కంటే తక్కువ సంపాదించే కుటుంబాలకు చెందిన 21నుండి 65 సంవత్సరాల మధ్యవయస్సు గల మహిళలు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నెలకు రూ. 1,500 పొందుతారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, కొన్ని ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులను దీని నుండి మినహాయించారు. ధృవీకరణ ప్రక్రియలోని వివిధ దశలలో లబ్ధిదారులు సుమారు 10 నెలల పాటు సహాయం పొందారని అధికారులు తెలిపారు. కేవలం ఓట్ల లబ్ధికోసం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం కాకుండా, బడ్జెట్ క్రమశిక్షణతో కూడిన పారదర్శక పాలన అందించడమే దీనికి ఏకైక పరిష్కారం.



ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.

థామస్ ఫుల్లర్



మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.

లియో టాల్‌స్టాయ్

# ఒక దీక్ష... ఎన్నో ఆలోచనలు!

**ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బల హీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింప జేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలను మళ్లీ మన ముందుంచింది.**

ఎం కె కుమార్

చరిత్రలో కొన్ని క్షణాలు ఉంటాయి. అవి యుద్ధాల వల్ల కాదు. ఎన్నికల వల్ల కాదు. ఒక మనిషి మౌనంగా కూర్చోవడం వల్ల పుడతాయి. మాట్లాడకపోవడం వల్ల వినిపిస్తాయి. తినకపోవడం వల్ల దేశాన్ని ఆలోచింపజేస్తాయి. సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష అలాంటి క్షణాల్లో ఒకటి. ఆకలి సాధారణంగా శరీరానికి సంబంధించిన విషయం. కానీ కొన్నిసార్లు ఆకలి ఒక రాజకీయ భాష అవుతుంది. ఒక నిరసన అవుతుంది. ఒక నైతిక ప్రశ్నగా మారుతుంది. ఒక వ్యక్తి తన శరీరాన్నే వాదనగా మార్చుకున్నప్పుడు, అతని శక్తి కండరాల్లో ఉండదు. అతని బలం అతని నిశ్శబ్దంలో ఉంటుంది. ఆ నిశ్శబ్దం అధికారాన్ని అవమానించదు. కానీ ప్రశ్నిస్తుంది. సమాధానం కోరుతుంది. ఈ దేశం నిరాహార దీక్షలను కొత్తగా చూడలేదు. మహాత్మా గాంధీ కాలం నుంచి ఈ నేల ఒక విచిత్రమైన రాజకీయ సత్యాన్ని తెలుసుకుంది. కొన్నిసార్లు ఖడ్గం చేయలేని పనిని ఉపవాసం చేస్తుంది. శబ్దం చేయలేని మార్పును మౌనం తీసుకొస్తుంది. అయితే ప్రతి నిరాహార దీక్ష చరిత్రలో నిలవదు. ప్రజల హృదయాలను తాకినప్పుడే అది ఉద్యమమవుతుంది. సోనం వాంగ్‌చుక్ విషయంలో ఆసక్తికరమైన విషయం ఆయన వ్యక్తిత్వంకాదు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలు. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతి కేవలం వినియోగించాల్సిన వనరేనా? పర్వతాలు రాళ్ల కుప్పలా? నదులు కేవలం నీటి పైపులా? లేక ఇవన్నీ మన నాగరికతకు ఊపిరా? ఈ ప్రశ్నలు ఒక్క ప్రాంతానికి సంబంధించినవి కావు. ఇవి భవిష్యత్తు తరాల ప్రశ్నలు. మన కాలంలో అభివృద్ధి అనే పదం అత్యంత ఎక్కువగా వినిపిస్తోంది. కానీ అదే సమయంలో అడవులు తగ్గుతున్నాయి. నదులు ఎండిపోతున్నాయి. పర్వతాలు కోతలకు గురవుతున్నాయి. గాలి భారంగా మారుతోంది. అభివృద్ధి మనిషి కోసం జరగాలి. మనిషి ప్రకృతిని కోల్పోయేలా జరిగితే, అది అభివృద్ధి కాదు, భవిష్యత్తుపై అప్పు. ఈ ఉద్యమంలో మరో ఆశ్చర్యకరమైన అంశం జెన్‌జెడ్ యువత స్పందన. ఈ తరాన్ని చాలామంది మొబైల్ స్క్రీన్‌ల తరం అంటారు. కానీ అదే స్క్రీన్‌ల నుంచి ఒక సామాజిక చైతన్యం కూడా పుట్టవచ్చని ఈ సంఘీభావం చూపించింది. వారు కేవలం ఒక వ్యక్తికి మద్దతు ఇవ్వడం కాదు. ఒక ప్రశ్నకు మద్దతు ఇస్తున్నారు. 'భవిష్యత్తు ఎలా ఉండాలి?' అనే ప్రశ్నకు. యువత ఉద్యమాల్లో చేరడం కొత్త విషయం కాదు. కానీ నేటి యువత భావోద్వేగాలకంటే సమాచారంతో ముందుకు వస్తోంది. వారు పర్యావరణంపై చదువుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలను గమనిస్తున్నారు. తమ భవిష్యత్తు వాతావరణ మార్పులతో ముడిపడి ఉందని అర్థం చేసుకుంటున్నారు. అందుకే వారి సంఘీభావాన్ని కేవలం సోషల్ మీడియా ట్రెండ్‌గా తీసిపారేయలేం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల బాధ్యత కేవలం పాలించడం కాదు. వినడం కూడా. ప్రతి నిరసన సరైందని చెప్పలేం. ప్రతి డిమాండ్‌ను అంగీకరించాల్సిన అవసరం కూడా లేదు. కానీ శాంతియుతంగా ప్రశ్నించే పౌరులను వినడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక. ప్రశ్నలను అణచివేయడం కంటే వాటితో సంభాషించడం ఎప్పుడూ మెరుగైన మార్గం. ఈ ఉద్యమాన్ని చూసి మరో ప్రశ్న కూడా మన ముందుకొస్తుంది. మనం ప్రకృతిని ప్రేమిస్తున్నామా? లేక అవసరమైనంత వరకు మాత్రమే ఉపయోగించుకుంటున్నామా? హిమాలయాలు కేవలం పర్యాటక ప్రాంతాలు కావు. అవి భారతదేశ జలవనరుల హృదయం. వాటి ఆరోగ్యం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. అక్కడ జరిగే మార్పులు వేల కిలోమీటర్ల



దూరంలో ఉన్న ప్రజల జీవితాలను కూడాప్రభావితం చేయగలవు. సోనం వాంగ్‌చుక్ గెలుస్తారా? ఓడిపోతారా? ఈ ప్రశ్నకు సమాధానం భవిష్యత్తు చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన ఒక చర్చను ప్రారంభించారు. ఒక దేశం తన అభివృద్ధి నమూనాను మరోసారి పరిశీలించాలా అనే ప్రశ్నను ముందుంచారు. అదే ఒక ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన పని. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడం కాదు. ప్రతి రోజు మన భవిష్యత్తు గురించి మాట్లాడుకోవడం. ప్రకృతి గురించి ఆలోచించడం. భిన్నాభిప్రాయాలను వినడం. అధికారాన్ని ప్రశ్నించడం. సమాధానాలను కలిసి వెతకడం. ఒక మనిషి ఆకలి ఎన్నిరోజులు కొనసాగుతుందో తెలియదు. కానీ ఆ ఆకలి ఒక దేశపు మనస్సాక్షిని మేల్కొలిపితే, ఆ నిరాహార దీక్ష చరిత్రలో ఒక రాజకీయ సంఘటనగానే కాదు, ఒక నైతిక సంభాషణగా కూడా నిలిచిపోతుంది. ఒక దేశం బలం దాని సైన్యంలో మాత్రమే ఉండదు. దాని సంపదలో మాత్రమే ఉండదు. ఆ దేశంలో ఒక సాధారణ పౌరుడు అధికారాన్ని ప్రశ్నించగల ధైర్యంలో ఉంటుంది. ప్రశ్నించిన వ్యక్తిని శత్రువుగా కాకుండా, సంభాషణకు ఆహ్వానించే రాజకీయ సంస్కృతిలో ఉంటుంది. ఈ కారణంగానే సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కేవలం ఒక ఉద్యమంగా మిగలలేదు. అది భారత ప్రజాస్వామ్యానికి ఒక అద్దంగా మారింది. నేడు ప్రపంచమంతా అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, వేగవంతమైన రైళ్లు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఇవన్నీ అభివృద్ధి సూచికలుగా మారాయి. కానీ ప్రకృతి నిశ్శబ్దంగా ఒక ప్రశ్న అడుగుతోంది. 'ఈ అభివృద్ధిలో నాకు చోటుందా?' అనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మనం ఎంత దూరం పరిగెత్తినా, ఒకరోజు అదే ప్రకృతి మనల్ని ఆపుతుంది. ప్రపంచ చరిత్ర చెబుతున్న ఒక నిజం ఉంది. ప్రకృతిని జయించాలని ప్రయత్నించిన నాగరికతలు చివరికి ప్రకృతి ముందు తలవంచాయి. నదులకు బంధించిన సమాజాలు వరదలను చూశాయి. అడవులను నరికిన దేశాలు కరవును అనుభవించాయి. పర్వతాలను పేల్చిన నాగరికతలు భూకంపాల భయాన్ని ఎదుర్కొన్నాయి. ప్రకృతి ప్రతీకారం తీర్చుకోదు. కానీ తన నియమాలను మాత్రం మార్చదు. ఈ నేపథ్యంలో యువత స్పందనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒకప్పుడు రాజకీయాలు పెద్దల విషయం అనుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. వాతావరణ మార్పులు, ఉపాధి, విద్య, సాంకేతికత, స్వేచ్ఛ ఇవి యువత భవిష్యత్తును నేరుగాప్రభావితం చేస్తున్నాయి. అందుకే వారు ప్రేక్షకులుగా ఉండటానికి సిద్ధంగా లేరు. వారు ప్రశ్నిస్తున్నారు. చర్చిస్తున్నారు. భాగస్వాములు కావాలని కోరుకుంటున్నారు. అయితే ప్రతి ఉద్యమానికి ఒకప్రమాదం కూడా ఉంటుంది. అది వ్యక్తి చుట్టూ తిరగడం. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు ముఖ్యమే. కానీ వ్యక్తుల కంటే విలువలు ముఖ్యమైనవి. ఒక ఉద్యమం ఒక నాయకుడి జీవితంతో ముగియకూడదు. అది సమాజంలో ఆలోచనగా మిగలాలి. పర్యావరణం గురించి, ప్రజల భాగస్వామ్యం గురించి, బాధ్యతాయుతమైన పాలన గురించి చర్చలు కొనసాగాలి. అదే ఒక ఉద్యమం నిజమైన విజయం. మీడియా పాత్ర కూడా ఇక్కడ అత్యంత కీలకం. వార్తలను చెప్పడం మాత్రమే కాదు. ప్రజలకు వివిధ కోణాలను అందించడం కూడా మీడియా బాధ్యత. ఒక ఉద్యమాన్ని పొగడడమో, పూర్తిగా ఖండించడమో కాదు దాని వెనుక ఉన్న ప్రశ్నలను సమాజం ముందు ఉంచడమే ప్రజాస్వామ్య మీడియా ధర్మం. ప్రజలు అన్ని వాదనలు విని తమ అభిప్రాయాన్ని ఏర్పరచుకునే అవకాశం కల్పించాలి. ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బలహీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింపజేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలను మళ్లీ మన ముందుంచింది. ●

# ఆదాయపు పన్ను.. ప్రజల ఆర్థిక బాధ్యత



రామ కిష్టయ్య సంగన భట్ల

భారత ఆర్థిక చైతన్యానికి సంకేతంగా నిలిచే జులై 24 ఆదాయపు పన్ను దినోత్సవం. ఇది కేవలం ఓ చట్టబద్ధమైన విధానం రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతను, ప్రభుత్వానికి పౌరుల భాగస్వామ్యాన్ని, నైతికతను, పారదర్శకతను గుర్తుచేసే చైతన్య దినం. భారత దేశంలో ఆదాయపు పన్ను చట్టం మూలాలు బ్రిటిష్ కాలంలోకే వెళ్తాయి. 1857 సిపాయిల తిరుగు బాటుతో ఏర్పడిన ఆర్థిక లోటును తీర్చేందుకు 1860 జూలై 24న బ్రిటన్ ఆర్థిక మంత్రి సర్ జేమ్స్‌విల్సన్ పర్యవేక్షణలో ఆదాయపు పన్ను విధానం రూపొందించబడింది. గవర్నర్ జనరల్ లార్డ్ కేనింగ్ మద్దతుతో తొలిసారిగా భారత దేశంలో ఆదాయపు పన్ను అమలులోకి వచ్చింది. ఈ చరిత్రాత్మక నిర్ణయం భారత ఆర్థిక పరిపక్వతకు నాంది పలికింది. ఈ చారిత్రికతకు గౌరవ సూచకంగా భారత ఆదాయపు పన్నుశాఖ 2010 నుంచి ప్రతి సంవత్సరం జూలై 24ను ఆదాయపు పన్ను దినంగా అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారుల పట్ల కృతజ్ఞత ప్రకటిస్తూ అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణలు, విజేతల సన్మానాలు నిర్వహించబడుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961నాటి చట్టం, ఇది 1962 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈచట్టం ప్రకారం వ్యక్తులు, కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు తమ ఆదాయానికి తగిన విధంగాపన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను వసూళ్లను పర్యవేక్షించే ఆదాయపు పన్ను శాఖ దీనిని నిష్ఠతో అమలు చేస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో ఆదాయపుపన్ను కీలకమైన వనరుగా నిలుస్తోంది. దేశానికి వచ్చే మొత్తం పన్ను ఆదాయంలో సగానికి పైగా ఆదాయపు పన్నుల ద్వారానేలభిస్తోంది.





2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే ఆదాయపు పన్నుల ద్వారా రూ.10లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. ఈ ఆదాయంతోనే ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, రక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతోంది. పన్ను చెల్లించే వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఆదాయపు పన్ను శాఖ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ఫేస్‌లెస్ అసెస్మెంట్ విధానం ద్వారా అవినీతి నివారణ, ఇఫైలింగ్ వేదిక ద్వారా సులభత, ప్రీఫిల్డ్ రిటర్న్‌లతో ప్రజలకు సమయాన్ని ఆదా చేసే మార్గం, డిజిటల్ చెల్లింపు పద్ధతుల ద్వారా పారదర్శకత పెరిగింది. అంతేకాక, ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని పన్ను చెల్లింపుదారుల అనుభవాన్ని మెరుగుపరచడం జరిగింది. పన్ను విధానంలో సామాజిక సమతుల్యతకూ ప్రాధాన్యం ఇచ్చారు. అధిక ఆదాయం కలిగిన వారు అధిక పన్నుచెల్లిస్తే, తక్కువ ఆదాయం కలిగినవారు మినహాయింపులను పొందే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఫలితంగా, సమాజంలోని బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. 2023-24లో దేశవ్యాప్తంగా 8.2 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారు. వారిలో 60శాతం పాత పన్నువిధానాన్ని ఎంచుకోగా, మిగిలిన వారు కొత్త పన్ను విధానాన్ని అనుసరించారు. ఇది ఆదాయ స్థాయిలను బట్టి వ్యక్తులు ఎంచుకునే స్వేచ్ఛను సూచిస్తుంది. ఇదే ప్రజల ఆర్థిక చైతన్యానికి నిదర్శనం. పన్ను చెల్లించడాన్ని నేరుగా చట్టబద్ధ కర్తవ్యంగా కాక, దేశానికి చేసే సేవగా భావించాల్సిన అవసరంఉంది. ప్రతి పౌరుడు తన ఆదాయానికి తగిన విధంగా పన్ను చెల్లిస్తే మాత్రమే సమాజంలో సమతుల్యత, అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదాయపు పన్ను దినం అంటే కేవలం పన్ను చట్టాన్ని గుర్తు చేసే రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతకు గుర్తుగా నిలిచే అవిశ్రాంత పిలుపు. ఈ సందర్భంగా పన్ను చెల్లించు - దేశాన్ని నిర్మించు అనే నినాదం ప్రజల మనసుల్లో నాటుకోవాలి. జూలై 24 - ఇది దేశాభివృద్ధిలో పౌర సహకారానికి ఒక నిశ్చల గుర్తింపు, భవిష్యత్ భారత నిర్మాణానికి ప్రజల నైతిక ఆర్థిక చింతనకు నిలిచే శాశ్వత పిలుపు. ●

# ప్రజావాక్కు



## ప్రభుత్వ భూములాక్రమిస్తే జైలే గతి

ఈ మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబుప్రభుత్వ భూములు ఆక్రమిస్తే జైలే గతి అని ప్రకటించారు. అప్పుడే అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తాం అన్నాడు.. ఇద్దరి ప్రకటనలు చాలా బాగున్నాయి. అయితే అవి ఉత్తుత్తి ప్రకటనలుగానే మిగిలిపోయాయి అన్న అనుమానం వస్తుంది. ఎందుకంటే రాష్ట్రంలో దొంగ స్వాములు ప్రకాశంజిల్లాలో దొంగస్వామి, తిరుపతి జిల్లాలో కల్కి ఇద్దరు ప్రభుత్వ భూములు, దళితులభూములు, అటవీ భూములు అసైన్డ్ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో రకరకాలుగా మోసం చేస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని దొంగస్వామి ఆక్రమించిన భూముల ను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ 2021లో ఆదేశం ఇచ్చింది. ఇంతవరకు అతీగతీ లేదు. కల్కి వందలాదిఎకరాలు అసైన్డ్‌పేదల భూములుఆక్రమించి ఆశ్రమం నిర్మించాడు. కలెక్టరు ఖాళీచెయ్యమంటే కోర్టుకు వెళ్ళాడు. అటవీ భూమిలో కట్టేపుల్ల విరిస్తే జైల్లో పెడతాం అనే అటవీశాఖవారు కల్కి విషయంలో ఎందుకీ మౌనం?

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## విద్యార్థుల గురించి ఆలోచించాలి?

జిల్లా కేంద్రంలో ఉన్నకాలేజీలు, అందులో కొన్నిఆర్ట్స్ గ్రూపులు గ్రామాలకు తరలించడం అనే ప్రచారం జరుగుతుంది. జులై 31వరకు అడ్మిషన్లు ఇంకా కొనసాగుతున్నాయి. 40 సీట్లు భర్తీ కాలేదు. తగిన వసతులు లేవు. ట్రైబల్ విద్యార్థులు ఏజెన్సీ దూర గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్నారు. ఆగష్టు మొదటి వారంలో టెస్టులు నిర్వహించడం కోసం షెడ్యూల్ వచ్చింది. నోట్ బుక్స్, టెక్స్ట్‌బుక్స్, స్టడీమెటీరియల్, యూనిఫామ్‌లుఇంకారాలేదు. అరకొర వసతులతో ఎలా చదవడం ?గ్రామాలలో తగిన రవాణా వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతవిద్యలతో ఉద్యోగాలుపొందేఅవకాశం కలిపించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## రేషన్ కేవైసీ చేసుకోవాలి

రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ త్వరితగతిన రేషన్ కార్డులో పేరు కలిగిన అందరూ వేలిముద్ర ద్వారా ఈ కేవైసీ చేసుకోవాలి. రేషన్ కార్డు ఈ చేసుకోకపోతే రేషన్ నుండి పేరుతొలగించే అవకాశం లేకపోలేదు. కావునఅందరూ చేసుకుని పథకాలకు అర్హులుగా ఉండగలరని అధికారులు సూచిస్తున్నారు.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## సరైన నిర్ణయం కాదు!

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక సంస్థను ఏర్పాటు చేసుకోవడానికి, అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోరడానికి, హక్కులు నిరాకరించబడినప్పుడు పోరాడేందుకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి రాజ్యాంగం అందరికీ హక్కులను కల్పించింది. అందుకే 'నీట్'సహా వివిధ పోటీ పరీక్షలలో ప్రశ్నాపత్రాలు లీక్ కుంభకోణం, అవకతవకలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరుగుతున్నాయి. నీట్ పునఃపరీక్ష కారణంగా చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. తమపిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ప్రతిరోజూ కన్నీరు కార్చుతూ ఎంతో దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. దీనికికారణం అవినీతిమయమైన విద్యా వ్యవస్థ కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్ సమంజసమైనదే.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం

## కరోనా నిజమేనా?

మెడికల్ మాఫియా లేక కరోనా అనేది నిజమా అని నిర్ధారణ చేసుకోలేని స్థితిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరోనా కేసులు నమోదు గురించి సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అధికారికంగా ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ, భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ లేదా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గాని ఎలాంటి ప్రకటన చేయలేదు. విజన్ కలిగిన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిముందు జాగ్రత్త చర్యగా సోషల్ డిస్టెన్స్ పాటించే విధంగా లాక్‌డౌన్ ప్రకటించకుండా మహిళల ఉచిత బస్సు సౌకర్య ప్రయాణాన్ని రద్దు చేయాలి. ముఖ్యంగా కూరగాయలు చిరు వ్యాపారస్తులు స్నానపానాలు లేకుండా బస్సులు ఎక్కి మిగతా ప్రయాణికుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ ఉన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు లేకుండా చేస్తే అంత రద్దీ ఉండదేమో ప్రభుత్వం ఆలోచించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పెరుగుతున్న పర్యావరణ సమస్యలు

వైశాల్యంలో దేశంలోనే కీలక నగరంగా ఉన్న విశాఖపట్నం నేడు తీవ్రమైన పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోంది అని పలునివేదికలు తెలియచేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న కాలుష్యానికితోడు, ప్రైవేట్‌రంగంలోని పోర్టు ను ఒడి వెలువడుతున్న కాలుష్యం గాజువాక, మల్కాపురం తదితరప్రాంతాలను పూర్తిగా కమ్మేయడం వలన ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. విలీన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సదుపాయాలు, వీధిలైట్లు, డ్రైనేజీవ్యవస్థ నేటికీఅధ్వాన్నంగా ఉన్నాయి.

-సి. రాజేందర్, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఉపాధ్యాయుడే భవిష్యత్ మార్గదర్శి

తరిగోపుల నారాయణస్వామి

విద్య అనేది ఏ రాష్ట్రానికైనా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి పునాది. ఆ పునాదిని నిర్మించే ప్రధాన శిల్పి ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో, వృత్తిపరమైన గౌరవంతో పనిచేసినప్పుడే విద్యార్థి అభ్యసన ఫలితాలు మెరుగుపడతాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో నేడు అనేక మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుఎదుర్కొంటున్న పరిస్థితులను పరిశీలిస్తే, బోధన కంటేబోధనకు ఆటంకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయనే భావన కలుగుతుంది. ఈ పరిస్థితి కేవలం ఉపాధ్యాయుని వ్యక్తిగత సమస్య కాదు, అది విద్యార్థి భవిష్యత్తు, పాఠశాల వాతావరణం, సమాజ అభివృద్ధితో ముడిపడి ఉన్న అంశం. ఒక ఉపాధ్యాయుని ప్రధాన బాధ్యత తరగతిగదిలో విద్యార్థులను బోధించడం. కానీ వాస్తవ పరిస్థితుల్లో బోధనేతర కార్యక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే అభిప్రాయం ఉపాధ్యాయుల్లో విస్తృతంగా వినిపిస్తోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, నివేదికలు, డేటా నమోదు, ప్రత్యేక కార్యక్రమాలు, పరిపాలనా పనులు వంటి బాధ్యతలుబోధన సమయాన్నే ప్రభావితం చేస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. తరగతి గదిలో గడపాల్సిన సమయం కార్యాలయ సంబంధిత పనుల్లో గడిస్తే, విద్యార్థుల అభ్యసన నాణ్యతపై దాని ప్రభావం సహజంగానే ఉంటుంది. విద్యార్థి ముందు నిలబడే ఉపాధ్యాయుడు కేవలం పాఠ్య పుస్తకాన్ని బోధించే వ్యక్తి కాదు. ఆయన ఆలోచింపజేసే మార్గదర్శి. విలువలను నాటే వ్యక్తిత్వ నిర్మాత. అలాంటి బాధ్యతలను నిర్వర్తించాలంటే ఉపాధ్యాయునికి మానసిక ప్రశాంతత అత్యవసరం. అయితే నిరంతర పరిపాలనా ఒత్తిళ్లు, తరచూ మారే ఆదేశాలు, అదనపు బాధ్యతలు, అనిశ్చితి వంటి అంశాలు బోధనపై ప్రభావం చూపే అవకాశాన్ని విస్మరించలేం. ఇటీవలి కాలంలో యాభై సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయుల్లో కూడా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన ఆందోళనలు కనిపిస్తున్నాయి. అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు మళ్లీ పరీక్షలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి మానసిక ఒత్తిడిని పెంచుతుందని వారు భావిస్తున్నారు. జీవిత అనుభవం, బోధనా అనుభవం, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య సమస్యలు, వయస్సు వంటి అంశాల మధ్య పరీక్షలకు సిద్ధమవడం సులభం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైనవిద్య లక్ష్యం ఎంత ముఖ్యమో, ఆలక్ష్యాన్ని అమలు చేసే విధానంలో మానవీయ కోణం కూడా అంతేముఖ్యమనే చర్చ అవసరం. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత ఉపాధ్యాయుల్లో కేటాయింపులపై ఏర్పడిన అనిశ్చితి కూడా చాలామందిలో ఆందోళనకు కారణమైంది. ఏ జిల్లాలో సేవలు కొనసాగుతాయో తెలియని పరిస్థితి కుటుంబ జీవితం, పిల్లల చదువులు, వృద్ధుల సంరక్షణ వంటి అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. ఉపాధ్యాయుడు పాఠశాలలో చిరునవ్వుతో కనిపించినా, మనసులో అనిశ్చితి ఉంటే అది బోధనలో ప్రతిఫలించే అవకాశం ఉంటుంది. ఆర్థిక అంశాలు కూడా ఉపాధ్యాయుల మనోధైర్యంపై ప్రభావం చూపుతాయి. పెండింగ్ డీఏలు, వేతన సవరణ ఆలస్యం, ఇతర ఆర్థిక అంశాలపై ఉపాధ్యాయ సంఘాలు తరచూ తమ ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి. ఆర్థిక భద్రత ఉద్యోగ సంతృప్తికి ఒక ముఖ్యమైన ఆధారం. కుటుంబ అవసరాలు, పిల్లల ఉన్నత విద్య, వైద్య ఖర్చులు, ద్రవ్యోల్బణం వంటి పరిస్థితుల్లో ఆర్థిక అనిశ్చితి ఉద్యోగి మానసిక ప్రశాంతతను ప్రభావితం చేయవచ్చు. ఆర్జిత సెలవులు మంజూరులో ఆలస్యం లేదా పరిమితులపై కూడా ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విశ్రాంతి అనేది విలాసం కాదు, అది వృత్తి సామర్థ్యాన్ని నిలబెట్టే అవసరం. శారీరకంగా, మానసికంగా పునరుత్తేజం పొందిన ఉపాధ్యాయుడే తరగతి గదిలో ఉత్సాహంగా బోధించగలడు. ఆదివారాలు, పండుగ సెలవులు, ఇతర విశ్రాంతి రోజుల్లో కూడా అధికారిక కార్యక్రమాలకు హాజరు కావాల్సి వస్తోందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. కుటుంబంతో గడపాల్సిన సమయం తగ్గిపోతే కుటుంబ బంధాలపై ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయుడు కూడా ఒక కుటుంబ సభ్యుడే. ఆయనకు కూడా వ్యక్తిగత జీవితం ఉంటుంది. వృత్తి, కుటుంబం మధ్య సమతుల్యత కోల్పోతే ఉద్యోగంపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంది. పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరమే. కానీ అదే సమయంలో మిగతా తరగతుల విద్యార్థుల అభ్యసన కూడా సమానంగా ముఖ్యమే. ప్రారంభ తరగతులలో బలమైన పునాది ఏర్పడకపోతే పదో తరగతిలో మంచి ఫలితాలు ఆశించడం కష్టమే. కాబట్టి విద్యా విధానం మొత్తం పాఠశాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకోవాలి. ఒకే తరగతిపై అధిక దృష్టి కేంద్రీకరిస్తే మిగతా తరగతుల అభ్యసనలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. విద్య అనేది పరీక్షల కోసం మాత్రమే కాదు. జీవితాన్ని నిర్మించడానికి. పరీక్షలు అవసరమే కానీ పరీక్షలే విద్యకు కేంద్రబిందువుగా మారకూడదు. విద్యార్థిలో ప్రశ్నించే స్వభావం, సృజనాత్మకత, సహకార భావం, విలువలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే అసలు విద్య లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలలపై సమాజం నమ్మకం పెరగాలంటే మొదట ఉపాధ్యాయుడిపై వ్యవస్థ నమ్మకం చూపాలి. ప్రతిసమస్యకు ఉపాధ్యాయుడినే బాధ్యుడిగా చూడకుండా, ఆయనకు అవసరమైన వనరులు, సమయం, శిక్షణ, మానసిక భరోసా, పరిపాలనా సహకారం అందించడం మరింత ప్రయోజనకరం. ఉపాధ్యాయుడు భాగస్వామి, కేవలం ఆదేశాలు అమలు చేసే ఉద్యోగి మాత్రమే కాదు. విద్యా విధానాల రూపకల్పనలో తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుల అనుభవాలను కూడా వినాలి. పాఠశాల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటే అమలు సులభమవుతుంది. పైస్థాయిలోరూపొందిన విధానాలు నేలస్థాయిలో ఎలాపని చేస్తున్నాయో నిరంతరం సమీక్షించడంఅవసరం. ఉపాధ్యాయుడి మనసు ప్రశాంతంగా ఉంటే తరగతి గది సృజనాత్మకంగా మారుతుంది. ●

# తిరుమల సమాచారం

## 31న టిటిడి ఖాళీ గోనె సంచుల ఇ-వేలం



**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలవేంకటేశ్వరస్వామి ఆలయంతో బాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో వినియోగించిన ఖాళీ గోనె సంచులను ఇ వేలం వేయనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి 2027 మార్చి 31 వరకు "రేట్ కాంట్రాక్ట్" ప్రాతిపదికన విక్రయించేందుకు ఈనెల 31న ఇ వేలం నిర్వహించనున్నట్లు టిటిడి తెలిపింది. ఈ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు ఈనెల 30వ తేదీ సాయంత్రం లోపు కొనుగోలు పోర్టల్ ద్వారా 30వేల రూపాయలు ఇఎండీ చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.ఈ వేలానికి సంబంధించిన పూర్తి వివరాలను హెచ్‌టిటిపిఎస్://కొనుగోలు.ఎపి.జివొవి.ఇన్" వెబ్‌సైట్ ను సందర్శించవచ్చు. అదనపు సమాచారం కోసం టిటిడి జనరల్ మేనేజర్ (వేలాలు) కార్యాలయాన్ని 0877-2264429 నంబర్‌లో సంప్రదించగలరు.

## శ్రీవాణి బ్రేక్ భక్తులకు తిరుమలలో లాంజ్

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొం డలవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులతోబాటు ప్రతిరోజూ శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనానికి విచ్చేస్తున్న 1,500మంది భక్తులకు సులభంగా విశ్రాంతి తీసుకునేలా లాంజ్ ఏర్పాటుచేయాలని టిటిడి భావిస్తోంది. విమా నాశ్రయంలో ప్రయాణీకులు వేచివుండే లాంజ్‌లా తిరుమలలోనూ శ్రీవాణి భక్తులకు కల్పించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పరిశీలించారు. ఉదయం టిక్కెట్లు అందుకునే భక్తులేగాక ముందుగా ఆన్‌లైన్‌లో విడుదలైన ఈ దర్శన టిక్కెట్లతో వస్తున్న భక్తులకు గదులు సమకూర్చడం కొంత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఉదయం నుండి సాయంత్రం 4గంటల వరకు దర్శనానికి వెళ్ళే వరకు ఈ భక్తులు ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలనేది సమస్యగా మారింది. శ్రీవాణి భక్తుల కోసం నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీవాణి దర్శన టికెట్లు మూడు నెలల ముందు 500 ఆన్ లైన్‌లో ,ప్రతి రోజు 500 కరెంట్ బుకింగ్ ఆన్‌లైన్‌లో, మరో 300 గతంలో విరాళాలిచ్చి టికెట్లు పొందని వారి కోసం కేటాయిస్తున్నారు. మరో 200 టికెట్లు రోజూ తిరుపతి విమా నాశ్రయంలో ఆఫ్ లైన్‌లో ఇస్తున్నారు. ఈ టికెట్లు పొందిన భక్తులకు గదులు కేటాయిస్తున్నారు. కరెంట్ బుకింగ్ లో టికెట్లు పొందిన వారికి అదే రోజు సాయంత్రం 4 గంటలకు టిటిడి దర్శనం కల్పిస్తోంది. ఉదయం 9 గంటలకు టికెట్లు తీసుకున్న భక్తులు సాయంత్రం 4 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. వారికి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విమా నాశ్రయం తరహాలో శ్రీవాణి భక్తులు వేచి ఉండేందుకు లాంజ్ నిర్మాణం చేయాలని ఆలోచన చేస్తున్నారు. రానున్న టిటిడి బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలు తయారుచేసి ఆమోదించే అవకాశం ఉంది.

## భవిష్యత్తులో ఇలాంటి అపచారాలు పునరావృతం కాకుండా చర్యలు: మంత్రి ఆనం

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల మొదటిఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద ఇంజనేయస్వామి ఒక అడుగు విగ్రహ అపహరణకేసును కొన్ని గంటల్లోనే తిరుమల పోలీసులు చేదించడం అభినందనీయమని రాష్ట్రదేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు దేవాలయాల వద్ద భద్రతను పటిష్ఠం చేయాలని ఆయన ఆదేశాలిచ్చారు. పక్కా ప్రణాళికతో వేగవంతమైన దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో బాటు, స్వామి విగ్రహాన్ని సురక్షితంగా స్వాధీనం చేసుకోవడం పోలీసుల సమర్థతకు, అంకితభావానికి నిదర్శనమని ఆయన కొనియాడారు.తిరుమల వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి అన్నారు. తిరుమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను తక్షణమే పటిష్ఠం చేయాలని సంబంధిత దేవాదాయ, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణాల్లో సిసిటీవీ నిఘాను నిరంతరం పర్యవేక్షించాలని, భద్రతా సిబ్బంది గస్తీని పెంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. దేవతా విగ్రహాలను అపహరించడం,ఆలయ ఆస్తులు, సెంటిమెంట్లతో ఆడుకునే దుశ్చర్యలకు పాల్పడే వారిపై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తుందని మంత్రి హెచ్చరించారు. కోట్ల మంది భక్తుల నమ్మకాలకు, భావోద్వేగాలకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చిచెప్పారు. భవిష్యత్తులో ఏ పుణ్యక్షేత్రంలోనూ ఇలాంటి అపచారాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.




## శాస్త్రోక్తంగా ఆంజనేయవిగ్రహం పునఃప్రతిష్ట

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సమీపంలో చోరీకి గురైన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం ఉదయం యధావిధిగా శాస్త్రోక్తంగా పున:ప్రతిష్టాపన చేశారు. ఇక్కడ పూజలందుకునే విగ్రహాన్ని చోరీ చేసిన విషయం విదితమే. పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో టిటిడి అర్చకులు తిరిగి అంతే వేగంగా పున:ప్రతిష్టించే పనులు చేపట్టారు. టిటిడి ఆగమ సంప్రదాయాల ప్రకారం పుణ్యాహ వచనం, జల సంప్రోక్షణం తదితర శాస్త్రోక్త క్రతువులు నిర్వహించి, గురువారం ఉదయం అదే ప్రదేశంలో విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించినట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. ఈ ఘటనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సిసి కెమెరాల నిఘా, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తత, జిల్లా పోలీసులతో సమన్వయం కారణంగా అత్యంత తక్కువ సమయంలో నిందితుడిని గుర్తించి విగ్రహాన్ని తిరిగి తీసుకురావడం సాధ్యమైందని అదనపు ఇఒ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఘాట్ రోడ్డులోని చిన్న దేవాలయాలు, విగ్రహాలకు రక్షణగా గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు మరింత నాణ్యమైన సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి,తిరుమల ఎఎస్పీ రామకృష్ణ,విఎస్ఒ సురేంద్ర, ఇతర అధికారులు,అర్చకులు పాల్గొన్నారు.

## విగ్రహం మాయం వెనుక భూమన హస్తం

### జనసేన నేత కిరణ్ రాయల్ సంచలన వ్యాఖ్యలు



**తిరుపతి,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంట కట్టుదిట్టమైన భద్రత ఉన్న తిరుమల ఘాట్‌లో ఏడవమైలు వద్ద ఆంజనేయస్వామి విగ్రహాన్ని చోరీచేసుకెళ్ళిన ఘటన వెనుక వైసిపి నేత భూమన హస్తం ఉందని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి నేత కిరణ్‌రాయల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమల నడక మా ర్గంలో విగ్రహ మాయంపై భూమన అనవసర రార్ధాంతం చేశాడని,ఆవిగ్రహం మాయం చేయడం వెనుక భూమన హస్తం ఉందన్న అనుమానం ఉందని ఆరోపణలు చేశారు. 2019 -24మధ్య వైసిపి హాయాంలో భూమన తిరుపతి పరిసరాల్లో భారీగా భూకబ్జాలకు పాల్పడ్డారని, 1వందకోట్ల విలువచేసే భూ ములను కబ్జా చేశారని ఆరోపించారు. తిరుపతి పరిసరాల్లోని మంగళం, తిరుచానూరులో 16ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారని కిరణ్‌రాయల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో భూమన బాధితులు చాలా మంది ఉన్నారని, భూమన బాధితులు ముందుకు రండి భూకబ్జాకు పాల్పడలేదని భూమన ఇప్పుడు ప్రమాణం చేయగలడా..? అని ప్రశ్నించారు.

# క్వాంటం పరిశోధనలకు అమరావతి అత్యుత్తమం

### సిఎం చంద్రబాబుతో క్వాంటినమ్ టెక్నాలజీస్ సిఇఒ రాజీబ్ హజ్రా భేటీ



సీఎం చంద్రబాబుతో భేటీ అయిన క్వాంటినమ్ టెక్నాలజీస్ సీఈఓ రాజీబ్ హజ్రా

**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ టెక్నాలజీగా క్వాంటం కంప్యూటింగ్ రంగాన్ని గుర్తించి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పని చేయటం ప్రారంభిస్తుందని, ఇప్పటికే క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు ఏపీలో పని ప్రారంభించాయని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి ఫుల్‌స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ కంపెనీ క్వాంటినమ్ సంస్థ సీఈఓ రాజీబ్ హజ్రా సహా ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి క్వాంటం వ్యాలీని క్వాంటం ఇన్నోవేషన్ సహా పరిశోధనలు తదితర అంశాల్లో కీలకమైన హబ్ గా తయారు చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో క్వాంటినమ్ సంస్థ సీఈఓ చర్చించారు. జాతీయ క్వాంటం మిషన్‌కు అనుగుణంగా ప్రపంచస్థాయి ఎకోసిస్టంను అభివృద్ధి చేసేందుకు ఏపీతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు క్వాంటినమ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాలు, ఏఐ ఎనేబుల్డ్ క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ రీసెర్చి, స్టార్టప్ ఇంక్యుబేషన్ టెక్నాలజీలపై పనిచేయాలని సీఎం సూచించారు. గతంలో ఐటీని ప్రోత్సహించామని ఇప్పుడు ఏఐ, క్వాంటం టెక్నాలజీల ద్వారా వేగంగా సమస్యలకు పరిష్కారం అందించాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. క్వాంటం పరిశోధనలకు ఏపీ అమరావతి అత్యుత్తమ ప్రాంతమని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తితో పాటు అల్గారిథమ్స్ వరకూ సహకారం అందించేందుకు తాము సిద్ధమని క్వాంటినమ్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

### గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో

# నీటి సమస్యలకు చెక్: మంత్రి పార్థసారధి



మంత్రి పార్థసారధి, కమిషనర్ విశ్వనాథన్


**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** గోదా వరి, కావేరి నదుల అనుసంధానంతో మంచి, సాగునీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురు వారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు. క్యాబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పలు సమస్యలపై దిశానిర్దేశం చేశారని ముఖ్యంగా ఎల్ నినో ప్రభావంతో రైతులు సాంప్రదాయ పంటలు వేయటం వల్ల సకాలంలో సాగు నీరు అందక పోతే నష్టపో తారన్న అభిప్రాయం ముఖ్యమంత్రి వ్యక్తం చేశారని తెలిపారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభా వం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉం డనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు.ఈ ఏడాది సాధారణం కంటే 51 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గుదల ఉంటుందని, దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొనే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని తద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచిం చారు. అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చ రించారు.బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచనను రైతులు చేయవద్దని కోరారు.దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు. పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందని దీంతో గోదావరి,కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఒక వేళ మంచి వర్షాలు పడితే మంచిదే కాని ఎల్ నినో ప్రభావం పై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్పటికే 70శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతు లు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేం ద్రం సానుకూ లంగా ఉండటం హర్షనీయమన్నారు. నదుల అనుసంధానం తెలంగాణా,ఏపి,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉం టుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రా ల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరు తుందని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నా రన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ గా నిలవనుందని, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానా శ్రయాన్ని ప్రారంభించ నున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభు త్వం సిద్ధం చేస్తోందన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సం చాలకులు కెఎస్.విశ్వనాధన్ పాల్గొన్నారు.

## రూ.5,092కోట్లతో టాన్స్‌కో గ్రిడ్ బలోపేతం

### ప్రాజెక్టుల పురోగతిపై విజయానంద్ సమీక్ష



**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ప్రసార వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీట్రాన్స్‌కో చేపడుతున్న 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ ఎక్స్‌ట్రా హై వోల్టేజ్ ప్రసార ప్రాజెక్టుల పురోగతిపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ , డైరెక్టర్లు ఏ వి కె భాస్కర్, జీవి రావు, వెంకట రమణ మూర్తి, సీ ఈలు, యస్ఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, రానున్న పెట్టుబడులు, భవిష్యత్ కార్యాచరణ, కీలక ప్రసార మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రూ.5,092 కోట్ల అంచనా వ్యయంతో 60 ప్రధాన ప్రసార ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రానికి అదనంగా 14,296 ఎంవీఏల ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం, 1,760 సర్క్యూట్ కిలోమీటర్ల ప్రసార లైన్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. దీంతో విద్యుత్ ప్రసార సామర్థ్యం మరింత పెరగడంతో పాటు ప్రాంతాల మధ్య గ్రిడ్ అనుసంధానం బలోపేతమై, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా, విశ్వసనీయంగా మారనుందని వివరించారు. త్వరలో పూర్తి కానున్న ప్రాజెక్టులపై కూడా విజయానంద్ సమీక్ష నిర్వహించారు. రూ. 3,507 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 36 ప్రధాన ప్రసార ప్రాజెక్టులు (400 కేవీ, 220 కేవీ, 132 కేవీ) రానున్న ఆరు నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు.



నవమల్లెతీగను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

## సామాజిక ప్రయోజనమే సాహిత్యానికి హేతువు: మంత్రి సవిత

**విజయవాడ,జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక ప్రయోజనమే సాహిత్యానికి హేతువుగా నిలవాలని ఏపీ చేనేత,జౌళి,హస్తకళలు,బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు.ఏ ప్రక్రియలో రాసినప్పటికి సాహిత్యం జనజాగృతంగా ఉండాలన్నారు.సమకాలీన పరిస్థితులతో పాటుగా,గతాన్ని గుర్తు చేస్తూ, వర్తమానంలో చోటు చేసుకున్న అవగతం చేసుకుంటూ రేపటి తరానికి మంచి వారధిని నిర్మించే దిశలో రచనలు ఉండాలన్నారు.రచయిత,రచయిత్రి స్వేచ్ఛగానే తమ భావవక్తీకరణ చేయాలని, అయితే ఇతరుల భావోద్వేగాలకు భంగం కలిగించకూడదన్నారు. కలిమిశ్రీ సంపాదకత్వంలో నవమల్లెతీగ శత సంచికని ఏపీ సచివాలయంలో సవిత ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రముఖ చిత్రకారుల ముఖచిత్రాలతో ఇలాంటి ప్రత్యేక సంచికలు వెలువరించేవన్నారు. ప్రచురణలు కనుమరుగవుతున్న నేటి కాలంలో ప్రత్యేక సంపుటికి తీసుకురావడం గొప్ప సాహసమన్నారు. సాహిత్యాన్ని ప్రధానంగా చేసుకుని సాహితీవేత్తలతో పాటు యువతను, మహిళలను అన్నిరకాల పాఠకుల్ని ఆకట్టుకునే విధంగా పత్రికను రూపొందిస్తున్న సంపాదకులను అభినందించారు.

## జొన్నగిరి ఇకపై 'స్వర్ణగిరి' గోల్డ్ మైన్స్

### అధికారికంగా పేరు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లాలోని జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'స్వర్ణగిరి గోల్డ్ మైన్'గా మార్చింది. జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును అధికారికంగా మార్చాలని రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి చేయగా ఆ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఇకపై మైనింగ్ ప్లాన్‌లు, చట్టపరమైన అనుమతులు, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ , పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ తదితర అధికారిక రికార్డుల్లో కూడా స్వర్ణగిరి గోల్డ్ మైన్' పేరును నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన తొలిబంగారు గనిగా గుర్తింపు పొందిన ఈ గని భవిష్యత్తులో ప్రముఖ బంగారం ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కర్నూలుజిల్లా తుగ్గలి మండలం పరిధిలోని పగిడిరాయి, జొన్నగిరి, ఎర్రగుడి గ్రామాల సరిహద్దుల్లో ఈ బంగారు గని విస్తరించి ఉంది. మొత్తం 597.820 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ గనిలో ప్రధానంగా బంగారాన్ని వెలికితీస్తున్నారు. దీంతో పాటు వెండి, రాగి, సీసం, జింక్ వంటి ఇతర ఖనిజాలనుకూడా తవ్వుతున్నారు.బంగారం వెలికితీత కోసం జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రభు త్వం 30 సంవత్సరాల మైనింగ్ లీజును మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈయేడాది జూన్‌లో గనిని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ ప్లాంట్‌లో వాణిజ్య బంగారం ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు.

## ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: మంత్రి గొట్టిపాటి



**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి త్వరలోనే ఒక అంత ర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేసారు. త్వరలోనే ఇక్కడ భారీ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు ప్రముఖ కళాశాలలు ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. అమరావతిలో భవనాల నిర్మాణాలు అద్భు తంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఇది అత్యంత అద్భుతమైన నివాస యోగ్యమైన నగరంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన మొదటి డైమండ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 12 ఫ్లోర్లు సిద్ధమవుతాయని ప్రకటించారు. రాజధాని విషయంలో వైసీపీ అధినేత జగన్ అనవసర గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తికమక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. జగన్ కనీసం ఒక్కసారైనా నేరుగా వచ్చి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూడాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైతుల చలవ వల్లే ఈరోజు అమరావతిలో ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యమ వుతున్నాయని మంత్రి కొనియాడారు. వారి త్యాగాలను కూటమి ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు.

### మాజీ మంత్రి అప్పలరాజు అరెస్టుతో

# పలాస-కాశీబుగ్గలో ఉత్కంఠ

### 144 సెక్షన్ అమలు, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారులన్నీ దిగ్బంధం

### పేరాడ తిలక్‌పై పోలీస్ కేసు నమోదు

**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 23 ప్రభాతవార్త :**పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఇంగిలిగాం పారిశ్రామిక వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని కూడా రాజకీయ కక్ష సాధింపు కోసం ఆయుధంగా మార్చుకునే స్థాయికి కూటమి ప్రభుత్వం దిగజారిపోయిందనే ఆరోపణలు పలాస నియోజక వర్గం వైసిపి శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు రెండవ కుమారుడు 18 యేళ్ల అరవ్ వర్మ ద్విచక్ర వాహనం నడుపుతూ రోడ్డు ప్రమా దానికి కారకుడయ్యాడన్న ఆరోపణలపై రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సెక్షన్లు కాకుండా, ఏకంగా హత్యానేరం అభియోగాలు మోపి అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించడం జరిగింది. అయితే అదే కేసులో ఏ3 ముద్దాయిగా ఉన్న డా. సీదిరి అప్పలరాజును బుధవారం రాత్రి అరెస్టు చేయడం చూస్తే ఒక మత్స్యకార వైసీపీ నాయకుడి కుటుంబాన్ని రాజకీయంగా వేధించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా మారిందని ఈ సంఘటనతో తేటతెల్లమైందని వైసిపి నాయకులు పేర్కొంటున్నారు. మరి టీడీపీ నాయకులు, మంత్రులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల వలన జరిగిన రోడ్డు ప్రమాదాలన్నింటికీ ఇదే సిద్ధాంతం వర్తింపజేస్తారా..? అని వైసీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నాయకులను కేసుల్లో ఇరికించి వారి గొంతునొక్కాలన్నదే ఈ అరెస్టుల వెనుక కనిపిస్తున్న కుట్ర అని పలువురు పేర్కొంటున్నారు.

**వైసిపి నాయకుడు పేరాడ తిలక్ అరెస్ట్ :** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించిన సందర్భంగా బుధవారం రాత్రి సుమారు 2 గంటలకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద వైసీపీ పార్టీ కి చెందిన పేరాడ తిలక్ మరి కొంత మంది అనుచరులతో కలిసి నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించి సాదారణ ప్రజానీకం రాకపోకలను అడ్డుకొన్నారు. ఈ సమయంలో అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది మానవహారం చేయవద్దని తెలిపారు. అయితే అక్కడ నుండి తప్పుకోమని పోలీసులను బెదిరించి వారి విధులకు ఆటంకం కలిగించడం వలన విధులలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ వైసీపీ నాయకులు తమ విధులకు ఆటంకం కలిగించారని పేరాడ తిలక్, అతని అనుచరులు కొంత మందిపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో



ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వైసీపీ నేత పేరాడ తిలక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

పలాసలో 144 సెక్షన్ అమలు: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్ట్ కు నిరసనగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యగా కాశీబుగ్గ పోలీసులు 144 సెక్షన్ ను అమలు చేశారు. ఎమర్జెన్సీని తలపించే విధంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లే రహదారులలో బారికేడ్లు పెట్టి భారీగా పోలీసు లను మోహరించారు. దీని వలన ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. కాగా రాత్రి అదుపులోకి తీసుకున్న డాక్టర్ అప్పలరాజును గురువారం 12 గంటల వరకు పోలీస్ స్టేషన్ లోనే ఉంచారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసిపి పార్టీ శ్రేణులు పోలీస్ స్టేషన్ కు తరలి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. డాక్టర్ అప్పలరాజుకు వైద్య పరీక్షలు అనంతరం పలాస కోర్టు కు తీసుకువెళ్లి సబ్ జడ్జి ముందు హాజరు పరిచారు.

## కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్డీయే పక్షాల నిరసన



**విశాఖపట్నం, జులై 23:** న్యూఢిల్లీ పార్లమెంట్ భవన ప్రాంగణంలో ఎన్డీయే కూటమికి మద్దతుగా, కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా పలువురు ఎంపీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం మోసపూరిత వైఖరితో దేశంలోని యువతను పక్కదోవ పట్టిస్తోందని, వారి భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఎంపీలు మండిపడ్డారు. ఎన్డీయే పక్షాల ఎంపీలతో కలిసి రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ నిరసన తెలపడమే కాకుం డా, యువతను వంచి స్తున్న కాంగ్రెస్ పాలసీ లను తీవ్రంగా నిరసిం చారు.దేశ ప్రయోజ నా లు, యువత సంక్షే మం దృష్ట్యాఎన్డీయే ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# నేడు పోలవరం జిల్లాకు సిఎం చంద్రబాబు

### యం.పి.టి.యం సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**పోలవరం జిల్లా ప్రతినిధి జులై 23 ప్రభాత వార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు పోలవరం జిల్లాలో(రంపచోడవరం )లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన పురస్కరించుకొని మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. హెలిప్యాడ్, యం. పి. టీ. యం సమావేశం నిర్వహించే పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, సి. యం. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరావు,జె. సి. ప్రశాంత్ కుమార్,రంపచోడవరం ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి, మఠం విజయ్ భాస్కర్,ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంస్ చైర్మన్, రంపచోడవరం పరిశీలకులు కోట్ని బాలాజీ, అరకు పార్లమెంట్ టీ డి పి అధ్యక్షురాలు తేజవతి, మాజీ యం యల్ ఏ బాబురామేష్,సుభాని, పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. 39 & 40/ఇ2/2026-27 తేది: 20.07.2026
తూర్పుగోదావరి జిల్లాలో ఆర్.డబ్ల్యు.ఎస్ & ఎస్ డివిజన్ రాజమహేంద్రవరం పరిధిలో 2 పనుల నిమిత్తం రూ.20.00 లక్షల అంచనాతో RUDA Grant నిధుల నుండి ఆన్‌లైన్ టెండర్లు పిలువబడుచున్నవి. టెండరు షెడ్యూల్‌ను ఇ-మార్కెట్ ప్లేస్ నుండి తేది: 24.07.2026 ఉ.10.30గం.లకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలను www.apeprocurement.gov.in లో చూడవచ్చును.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య శాఖ, రాజమహేంద్రవరం.
DIPR.NO. 21001/CL/ADVT/1/1/2022-23 తేది: 23.07.2026

# జి.ఒ నం.3ని పునరుద్ధరిస్తాం

## గిరిజనుల ప్రయోజనాలు పరిరక్షిస్తాం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన హ క్కులకు ఎలాంటి భంగం కలగకుండా బల మైన చట్టం తీసుకొస్తామని ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరి జనుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షే మానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. గిరిజన సంఘాల నుంచి వచ్చిన సూచనలు, వినతులను ప్రభుత్వం సాను కూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుం టుందని తెలిపారు. గుమ్మిడి సంధ్యారాణి, ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ జీవో నంబర్3 పునరుద్ధరణతో పాటు గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరి రక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జీవో నంబర్3కు కూటమి ప్రభు త్వం గానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుగానీ ఏనాడూ వ్యతిరేకం కాదని, ఆదివాసీలకు శాశ్వత న్యాయం జరిగేలా చట్టపరంగా బలమైన పరిష్కారం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జీవో3 చరిత్రను వివరిస్తూ.. 1986లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నం దమూరి తారక రామారావు జీవో275 ద్వారా గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం 2000 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో నంబర్3ను ప్రవేశపెట్టి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులను 100 శాతం స్థానిక గిరిజనులకే కేటాయించేలా చర్యలు తీసు కున్నారని తెలిపారు. సుప్రీంకోర్టులో జీవో నంబర్ 3 రద్దుకు గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో3 పునరుద్ధరణకు నూటికి నూరు శాతం సానుకూలంగా ఉన్నారని, ఈసారి తీసుకొచ్చే చట్టం కోర్టుల్లోనూ నిలిచేలా అందరూ సహకరించాలని మంత్రి కోరారు. గిరిజనుల భూహక్కులను పరిరక్షించే 1/70 చట్టం ఉందని అది వారి ప్రాథమిక హక్కు అని, దానిని ఏ ప్రభుత్వం కూడా పక్కన పెట్టబోదని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను గిరిజనులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఎండుతున్న పంటలు..కుములుతున్న రైతులు

## ఎల్‌నినోతో తగ్గిన నీటిమట్టం

## ఫసల్ బీమాకు అధికారులు సూచనలు

**శ్రీకాళహస్తి,జులై 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మం డలాల్లో గురువారం ఆచార్య ఎన్.జి రంగా యూ నివర్సిటి సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించారు. ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో శ్రీకాళహస్తి వ్యవసాయడివిజన్లో రైతులు సుమారు 33వేల ఎకరాల్లో వరిపంటను వేసా రు. శ్రీకాళహస్తి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో రైతు లు ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఆదేశాలను ఖా తరు చేయక వరిపంటను పోలో మని సాధారణ విస్తీర్ణంకన్నా అధికంగా పంటలు వేసారు.ఎల్‌నినో ప్రభావంతో పంట పిలక దశ నుంచి పరిపక్వత దశకు చేరుకుంది. ఈ పరిస్థితిలో నీటి కొరతతో చేతికొచ్చిన పంట కళ్ళ ముందే ఎండుతుంటే రైతులు తల్లడిల్లుతున్నారు. అనూహ్యంగా బోర్లలో నీరు అడుగింటడంతో పంటలు ఎండిపోతు న్నాయని రైతులు గగ్గోలు పెడుతుండటంతో వ్యవసాయశాఖ సహాయ సంచాలకు రమేష్‌రెడ్డి వారి సహాచరులతో అన్ని మండలాల్లో పంటల పరిస్థితిని పరిశీలించారు. నివేదికలు తయారు చేస్తున్నారు. ంరైతులకు అవగాహన కల్పిస్తూ 'పంటల భీమాను' తప్పని సరిగా చేసుకోవాలని ఆగస్టు 15వరకు అవకాశం ఉందని చైతన్య పరుస్తున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు, ఏర్పేడు మండలంలోని దుర్గిపేరి గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంట ఎండుతుండటంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈసందర్భంగా దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలు మాట్లాడుతూ తాము ముం దస్తుగానే మేనెలలోనే వరి పంటను వేస్తా మన్నా రు. జూన్ నెలలో ఊహించని విధంగా ఎండలతో చెరువులు ఎండాయని బోర్ల నీరు అడుగింటి పోయిందని శాస్త్రవేత్తలకు వివరించారు.

**రైతులకు పలు సూచనలు:**

ఎండుతున్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు అన్నదాతలకు పలు సూచనలు చేస్తూ విత్తనాలు,పురుగుమందులు, ఎరువులు కొనుగోలు చేయాలన్నా అన్నదాత సుఖీభవ, ఎఎంకిసాన్, ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన స్కీం కింద ఇన్సు రెన్స్ లబ్ధి పొందాలన్నా, తప్పని సరిగా ప్రతి ఒక్క రైతు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్ర దించాలన్నారు. అంతేకాక ఎల్‌నినో ప్రభావంతో ఎండలుఅధికమై నీరు ఆవిరిగా మారి బోర్లు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం సహా యం అందాలంటే ప్రతి రైతు తమ పంటకు సం బంధించి బీమా చేసుకోవాలని సూచిం చారు. ఈ పరిశీలనల్లో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిమ, డాక్టర్ సం ధ్యారాణి, సహాయ సంచాలకులు ధనంజయరెడ్డి, శ్రీకాళహస్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.రమేష్ెండ్డితో కలసి విస్తృతంగా పరిశీలించారు. ఏర్పాట్లను వ్యవసా యాధికారి మమతారెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది తేజస్విని, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం వరి పంటను పరిశీలిస్తున్న ఆచార్య రంగా వర్సిటీ శాస్త్రవేత్తలు

# ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించిన ఉద్యోగ సంఘాల జెఏసి

**శ్రీకాళహస్తి,జులై 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండున్నర సం వత్స రాలు గడుస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్ర భుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూ పాలని కోరుతూ రాష్ట్ర జేఏసి నాయకులు ఎం ఎల్ఏలకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ నేపథ్యంలో గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ జేఏసి చైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ సా రథ్యంలో ఉద్యోగులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల బాధలను చెం చురత్నం యాదవ్ వివరించారు. ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు.అయితే ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్‌సికి సం బంధించి కమిషన్ వేయటంలో చొరవ చూ పలేదన్నారు ఇక ఐఆర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఉ ద్యోగులకు 5డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని సరెండర్ లీవ్‌కు సంబంధించి కూడా అపరి ష్కృతంగా ఉందన్నారు.ఈ సమస్యలను ఎం ఎల్ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, వి ద్యాశాఖమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేం దుకు ఉద్యోగులతో సహాకరించాలని కోరారు. జేఏసి నాయకుల అభ్యర్థనను స్వీకరించిన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలుస్తుందన్నారు.నేడు రాష్ట్ర జేఏసి సంఘ నాయకులు అందించిన వినతి పత్రంలోని డి మాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామన్నారు. రాబోవు శాసనసభ సమావేశాల్లో ఉద్యోగుల సమ స్యలకు సంబంధించి చర్చించి పరిష్కరించేందుకు తన వంతు సహాకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ మేరకు ఉద్యోగ సంఘాల జేఏసి చైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేష్,కార్యదర్శి వెంకటమునిి, శ్రీనివాసులు,బాలు తదితరులు పాల్గొన్నారు.




గురువారం ఎంఎల్ఏ బొజ్జల సుధీర్ రెడ్డిని కలసి ఉద్యోగ సంఘాల నాయకులు



# డెన్మార్క్ ప్రతిష్టాత్మక డారా పిహెచ్‌డి ఫెలోషిప్‌ను దక్కించుకున్న విమల

**విజయవాడ.జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శాస్త్రవేత్త విమల బత్తినేని అరుదైన ఘనత సాధించారు. డెన్మార్క్ ప్రతిష్ఠా త్మక డారా పీహెచ్‌డీ ఫెలోషిప్‌ను దక్కిం చుకున్నారు. దీని విలువ సుమారు 25 లక్షల డానిష్ క్రోనార్లు (దాదాపు రూ.3.6 కోట్లు). 2026 సెప్టెంబర్ నుంచి యూనివర్సిటీ ఆఫ్ సదర్న్ డెన్మార్క్‌లో మూడేళ్ల పీహెచ్‌డీ ప్రారంభించనున్నారు. సామాజిక మాధ్యమం లిం క్డిన్‌లో ఈ విషయాన్ని విమల వివరిస్తూ ఈ విజయం వెనుక ఎన్నో తిరస్కరణలు, అనిశ్చితి దాగి ఉన్నాయని చెప్పారు. అనేక పీహెచ్‌డీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, డారా ఫెలోషిప్‌కు చేసిన తొలి ప్రయత్నం కూడా విఫలమైందని గుర్తు చేశారు. అయితే ప్రతి తిరస్కరణ తనకు కొత్త పాఠం నేర్పిందని పేర్కొన్నారు.విమల 2019 నుంచి 2023 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని రేకులకుంట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో శాస్త్రవేత్తగా పనిచేశారు. అనంతరం భర్త ఉద్యోగరీత్యా డెన్మార్క్‌కు వెళ్లడంతో, అక్కడే పరిశోధన రంగంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆమె చేపట్టనున్న ఫాబా లూప్ పరిశోధనలో ప్రొటీన్ అధికంగా ఉండే ఫాబా బీన్స్ సాగును విస్తరించడం ద్వారా సోయా దిగుమతులపై డెన్మార్క్ ఆధారపడడాన్ని తగ్గించవచ్చా అనే అంశాన్ని అధ్యయనం చేయనున్నారు.



గురువారం న్యూఢిల్లీలో బిజెపి కార్యనిర్వాహక కార్యదర్శి బిఎల్ సంతోష్‌తో జనసేన ఎంపిలు

# బిఎల్ సంతోష్‌ని కలిసిన జనసేన ఎంపీలు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** భార తీయ జనతాపార్టీ ప్రధాన (ప్రచార) కార్యదర్శి బి ఎల్ సంతోష్ ని గురువారం ఢిల్లీలో జనసేన ఎంపీలు లింగమనేని రమేష్ , వల్లభనేని బాల శౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లు మర్యాద పూ ర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంతోష్‌ని జనసేన ఎంపీలు సత్కరించారు. మోడీ నాయకత్వంలో భారత దేశ అభ్యున్నతికి కూటమి పక్షాలన్నీ సంఘటితంగా కృషి చేద్దామని సంతోష్ వ్యాఖ్యానించారు.

# విజయవాడ, విశాఖపట్నంలో కేంద్ర జిఎస్‌టిఎటి బెంచ్‌ల ప్రారంభం

**విజయవాడ,జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యు నల్ (జీఎస్‌టీఏటీ) విజయవాడ, విశాఖపట్నం బెంచ్‌లు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర జీఎస్‌టీఏటీ ఉపాధ్యక్షులు. సభ్యులు (న్యాయ), (ఆంధ్రప్రదేశ్) భాస్కర్ రెడ్డి వేమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంచ్‌ల ప్రారంభోత్సవం ఒక చారిత్రక మైలురాయి అన్నారు. రెండు బెం చ్‌లలోనూ అప్పీళ్ల విచారణలు ప్రారంభోత్సవం జరిగిన అదే రోజే ప్రారం భమయ్యాయన్నారు. పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవం తమైన న్యాయాన్ని అందించడంతోపాటు, కేంద్ర జీఎస్‌టీ అప్పీళ్ల విచారణలో ఏకరూపత, సమర్థతను నిర్ధారిం చడం పట్ల ట్రిబ్యునల్ నిబద్ధత కలిగి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీఏటీ (ఆం ధ్రప్రదేశ్) సభ్యులు (సాంకేతిక) సతీష్ కుమార్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ.బాబు, స్పెషల్ కమిషనర్ నూతలపాటి సౌమ్య, కమిషనర్ (అప్పీ ల్స్) దేవేష్ గుప్తా, కమిషనర్ (కస్టమ్స్) ఆర్కే రామన్, కమిషనర్ (సీజీ ఎస్‌టీ) అరుణ్ రిచర్డ్, అదనపు కమిషనర్ (కస్టమ్స్) లక్ష్మీ నారాయణ, అదనపు కమిషనర్ (సీజీఎస్‌టీ) జి రాజుయాదవ్, డిప్యూ టీ రిజిస్ట్రార్ (జీఎస్‌టీఏటీ ఏపీ) వివిఎస్ కిషోర్ రాయలు,కోర్టుఅధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) వినయ్ కృష్ణ దాసి, కోర్టు అధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) సి.హెచ్.ప్రత్యూష, అకౌంట్స్ అధికారి (జీఎస్ టీఏటీ ఏపీ) శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్, తెలం గాణలకు చెందిన ట్యాక్స్‌బార్ సీనియర్ సభ్యు లు, ట్యాక్స్ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆఫీస్‌పై దాడిని ఖండిస్తున్నాం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయ వాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బిజెపి మూకల దాడిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు ఈశ్వరయ్య నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ర్యాలీపై బిజెపి ఘర్షణకు దిగటం దుర్మార్గం. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా ఒక బాధ్యతాయుత స్థానంలో ఉన్నారనే విషయాన్ని విస్మరించి, కేవలం బిజెపి నేతగానే శ్రేణులు చూడటం అవివేకమన్నారు. బిజెపి దాడుల వెనక రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండి ఉంటుందన్న పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు లేకుండా ఏపీలో బిజెపి దాడులకు తెగబడే సాహసం చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు, ఉన్మాద చర్యలు అత్యంత హేయం. దాడికిపా ల్పడిన బిజెపి మూకలను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతున్నామన్నారు.

# నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై తీర్పు రిజర్వ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కేసులో నిందితుడిగా ఉన్న కృష్ణలంక పీఎస్ సస్పెండెడ్ సీఐ నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై సుప్రీంకోర్ట్ తీర్పు రిజర్వ్ చేసింది. సిఐడి కస్టడీలో నాగరాజును విచారించేందుకు హైకోర్టు షరతులు విధించింది. హైకోర్టు షరతులను సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ సవాలు చేసింది.జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మా సనం సీఐడీ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ విచారణకోసం నాగరాజును 160కి.మీ. తీసు కొచ్చి మళ్లీపంపించాల్సి ఉంటుందని సీఐడీ స్ప ష్టం చేసింది.

ఇలా చేస్తే కేసు దర్యాప్తుపై తీవ్ర ప్ర భావం చూపుతుందని సీఐడీ తెలిపింది. ఇరు వర్గాల వాదనల తర్వాత సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు రద్దు చేయండి: హైకోర్టు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సా ర్సీపీ నాయకుడు పేర్ని నాని, ఆయన కుమా రుడు మచిలీపట్నంలో పంపిణీ చేసిన నకిలీ ఇం టి పట్టాలను రద్దు చేయడానికి నాలుగు వారా ల్లోగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉన్నతాధికారులను ఆదేశించింది. రోడ్లు, శ్మశాన వాటికలు,డ్రైనేజీ, పోరంబోకు వంటి ప్రభుత్వ భూముల్లో పట్టాల అక్రమ పంపిణీకి సం బం ధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న అధికారులపై తీసుకున్న చర్యల గురించి నివేదిక సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. మచిలీపట్నంలో ఎన్నికలకు ముందు వైఎస్సార్సీపీ నేత నాని, ఆయన కుమారుడు కిట్టు, వైఎస్సార్సీపీ నాయ కులు నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ టీడీపీ నేత ఐ. దిలీప్‌కుమార్ గతేడాది హైకోర్టులో పిల్‌వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది మల్లవోలు నిఖిత వాదనలు వినిపించారు. నకిలీ పట్టాలు పంపిణీ చేసింది వాస్తవమేనంటూ అధికారులు తేల్చారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం నకిలీ పట్టాల రద్దుకు నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. పేర్ని నాని తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ ప్రయోజనం కోసం ఈ పిల్ దాఖలు చేశారన్నారు. పిటిషనర్‌పై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విష యాలను పిల్‌లో దాచి పెట్టారన్నారు. ఈ వివ రాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వాస్తవాలను గోప్యంగా ఉంచి పిల్ దాఖలు చేసి నట్లు తేలితే పిటిషనర్‌కు ఖర్చులు విధిస్తామని స్పష్టం చేసింది.

# గ్లోబల్ లూనార్ మిషన్‌కు ఎపి విద్యార్థిని ఎంపిక

## ధవళేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కందుల జెస్సీ

### జెస్సీకి మంత్రి లోకేష్ అభినందన



**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్ర దేశ్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అరుదైన అంతర్జాతీయ ఘనతను సొంతం చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, ప్రపం చంలోనే మొట్టమొదటి గ్లోబల్ ఆల్‌గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ అయిన 'మిషన్ శక్తిశాట్' కు ఎంపికయ్యారు.ఈ విజయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. జెస్సీని అభినం దిస్తూ ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రశంసలు కురి పించారు. 'విద్యా రంగంపై మేం ఎందుకు ఇం తగా పెట్టుబడి పెడుతున్నామో అప్పుడప్పుడు ఇలాంటి కథలు గుర్తుచేస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్ లోని ఒక ప్రభుత్వ పాఠశాల నుంచి అంతర్జాతీయ అంతరిక్ష మిషన్‌కు ఆమె ప్రయాణం, కలలు కనే ప్రతి యువతకు స్ఫూర్తిదాయకం' అని పేర్కొ న్నారు.' జెస్సీ, నువ్వు ఆంధ్రప్రదేశ్ గర్వపడేలా చేశావు. చంద్రుడిని, ఆపై శిఖరాలను అందు కోవాలని ఆశిస్తూ నీకు శుభాకాంక్షలు' అంటూ లోకేశ్ తన పోస్టులో అభినందనలు తెలిపారు. ఈ మిషన్‌లో భాగంగా జెస్సీ శాటిలైట్ రూప కల్పనలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో కలిసి పని చేయనున్నారు. ఈ శాటిలైట్‌ను అక్టోబర్ 11న శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ప్రయో గించనున్నారు. ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతరిక్ష ప్రయోగంలో భాగస్వామి కావడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది.

# చెరువు కబ్జా చేసిన భూమన: టిడిపి జెబి శ్రీనివాస్




**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి మొత్తం బతుకు కబ్జాతోనే ప్రారంభమైందని. భూమి లాక్కుని ఇల్లు కట్టావని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జెబి శ్రీనివాస్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గురువారం సాయంత్రం తిరు పతిలో మీడియా సమావేశం నిర్వహించారు. తిరుచానూరులో స్వర్ణ ముఖి నది ఒడ్డున భూమిని కబ్జా చేసిన ఘనత భూమనదేనన్నారు. గతంలోనే ఈ విషయం చెప్పానని, ఇప్పుడు విజిలెన్స్ విచారణతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుం టున్నారని అన్నారు.కోట గోడలు కట్టి స్వర్ణ ము ఖి నదిని పూడ్చి మొత్తం 9 ఎకరాలు ఆక్రమిం చుకున్నావని ఆరోపించారు. అది మాదే అని మీడియాతో చెబుతు న్నావన్నారు. 24 ఎకరాలు మీదే అయితే. 2024 ఎన్నికల అఫిడవిట్ లో సుమారు 15ఎకరాలు మాత్రమే మీ కుటుంబ పేరుతో పొందుపరిచావని, మిగిలిన 9 ఎకరాలు ఆక్రమించినట్టు ఒప్పుకున్నటేగా అని వ్యాఖ్యలు చేశారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కుమారమ్మ ,అన్నా అనిత, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహే ష్ యాదవ్,తిరుపతి క్లస్టర్ ఇన్చార్జులు శ్రీధర్ వర్మ,దంపూరి భాస్కర్ యాదవ్,మునిశేఖర్ రాయల్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



# అంతర్జాల సదస్సుకు ఆచార్య రాచపాలెం

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం నిర్వహిస్తున్న అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డుగ్రహీత, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చం ద్రశేఖర్ రెడ్డి హాజరు కానున్నారు. తెలుగు సాహిత్య విమర్శ "నాడు నేడు" అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేస్తారు. భారత కాల మానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఈ వెబినార్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. "నెలనెలా తెలుగు వెన్నెల" పేరుతో ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం "సాహిత్య వేదిక" వెబినార్ సదస్సును నిర్వహిస్తోంది. ఈనెల 26వ తేదీ జరిగే 228 వ అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్య అతిథిగా ఆచార్య రాచపాలెంను ఆహ్వానించినట్లు సంఘం అధ్యక్షులు మాధవి లోకిరెడ్డి, సమన్వయకర్త దయాకర్ మాడ వెల్లడించారు. మాతృభాషను అభిమానించి, తెలుగు సాహిత్యాన్ని ఆస్వాదిం చాలని వారు కోరారు.

# థాయ్‌లాండ్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ విద్యార్థినులు

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళవిశ్వవిద్యాలయంకు చెందిన ఇద్దరు విద్యార్థినులు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పి. హారిణి సూర్యం, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగానికి చెందిన జి. శ్రీ సాయి హర్షిత థాయ్‌లాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంగ్‌క్లా యూనివర్సిటీ (పీఎస్‌యూ), పట్టానీ క్యాంపస్ నిర్వహించిన ఐదు రోజుల "లీడర్‌షిప్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్" అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన విద్యార్థులతో కలిసి వీళ్ళునాయకత్వ లక్షణాలు, బృందంగా పనిచేసే విధానం, భిన్న సంస్కృతుల గురించి అవగాహన పెంపొందించుకున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై అనుభవాత్మకంగా నేర్చుకున్నారు.
హారిణి సూర్యం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంచి అవగాహనతో పాటు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించిందని చెప్పారు. సాయి హర్షిత మాట్లాడుతూ, ఇతర దేశాల విద్యార్థులతో కలిసి పనిచేయడం వల్ల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, జట్టుగా పనిచేసే సామర్థ్యం, ప్రపంచ దృక్పథం మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యార్థినులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమా వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్యఆర్. ఉషా, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి ్మ అభినందించారు.

# నిరుద్యోగులను మోసగించిన కేసులో ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లకు రిమాండ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** నిరు ద్యోగులను మోసం చేసిన కేసులో నిందితులు ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లను విజయ వాడ న్యాయస్థానం గురువారం రెండు వారాల పాటు రిమాండ్ విధిం చింది. నిందితులను విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో అదు పులోకి తీసుకున్నారు. వారిని విచారించిన తరువాత బుధవారం అధికారికంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించారు.వారిని బుధవారం రాత్రే న్యాయస్థానానికి తరలించారు. అయితే సమయం ముగియడంతో న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన న్యాయమూర్తి అందులో మార్పులు చేయాలని దర్యాప్తు అధికారికి సూచించారు. నివేదికలో మార్పులు చేసి గురువారం ఉదయం న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలని సూచించడంతో నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.రిమాండ్ రిపోర్టులో మార్పుల అనంతరం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా వారి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. విజయవాడ శివారులోని పెదపులి పాక గ్రామానికి చెందిన ముసునూరి శ్రీనివాస్, సౌజన్యలు భార్యాభర్తలు. సౌజన్య గతంలో పటమట పంటకాలువ రోడ్డులోని ఒక సంస్థలో పని చేసింది. స్టూడెంట్ వీసా ప్రాసెస్ గురించి తెలుసుకుని నిరుద్యోగులను మోసం చేయవచ్చని భావించింది. ఒక పథకం ప్రకారం భర్తతో కలిసి విజయవాడ, విశాఖపట్నం, హైద రాబాద్‌లో ఫ్లైయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ కార్యా లయాలను ఏర్పాటు చేసింది. సోషల్ మీడియా, యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగులను ఆకర్షించారు. ఈ నెల 19న అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే షేక్ సలమా అనే యువకుడికి విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అరెస్టు చేసినట్లు విజయవాడ డీసీపీ గుణ్ణం రామకృష్ణ తెలిపారు.ఇక స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరిల పేరుతో యూరప్ దేశాలైన నెదర్లాండ్స్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, ఫి న్లాండ్‌తదితర దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వారిని నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద రూ. 8 లక్షల నుంచి రూ. 13లక్షల వరకు వసూలు చేశారు. ఇలా విజయవాడలో 700 మంది నుంచి రూ.11 కోట్లు, విశాఖపట్నంలో 130 మంది నుంచి రూ.2.2 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో దాదాపు 2,400 మంది వీరి కార్యాలయానికి వచ్చినట్లు గుర్తించారు. అక్కడ ఎంత మందిని మోసం చేసింది ఇంకా తెలియరాలేదు. నిరుద్యోగుల నుంచి ప్రాసెసింగ్ రుసుములు వసూలు చేసి, వారికి నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించే వారు. తమ సంస్థ ప్రతినిధులనే విదేశీ కంపెనీ ప్రతినిధులుగా నటింపచేసేవారు. తర్వాత ఇంటర్వ్యూల్లో ఫెయిల్ అయ్యారని అభ్యర్థులకు నకిలీ ఫీడ్‌బ్యాక్ ఇచ్చేవారు. దీనిపై కొంత మంది అనుమానం వ్యక్తం చేయగా వారి చరవాణి నంబర్లను బ్లాక్ చేశారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లో అనేక మందిని మోసం చేశారు. మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఈ మోసం డొంక కదిలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. దీంతో పోలీసులు నిందితులను గుర్తించి ఆకస్మాత్తుగా దాడి చేసిఅరెస్టు చేశారు. భార్యా భర్తలపై మొత్తం 8 కేసులు నమోదయ్యాయని పోలీసులు వెల్లడిం చారు. 2011లోనే సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మోసం కేసు నమోదైంది. 2024లో మాచవరం పీఎస్‌లో, 2025లో అన్న మయ్య జిల్లా పీలేరు పోలీస్ స్టేషన్‌లో, 2026లో తెలంగాణ రాష్ట్రం లోని జగిత్యాల మహిళా పీఎస్, బేగంపేట పీఎస్, కామారెడ్డి జిల్లా బిక్నూర్ పీఎస్, విజయవాడ మాచవరం, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన డబ్బులతో కారు లోన్ (రూ.3.3 లక్షలు), రూ.71.45 లక్షల విలువైన బంగారం, రూ.2.25 కోట్ల విలువైన స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకా ఏమైనా కొనుగోలు చేశారా అనే దానిపై వాకబు చేస్తున్నారు,

# శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికం

## ఎపి పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికంగా మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. భవిష్యత్తులో పోలీసులకు ఎదురయ్యే సవాళ్లు.. వాటిని ఏ విధంగా అధిగమించాలనే అంశాలపై మూడు రోజుల నుంచి పోలీస్ ఉన్నతాధికారుల మేథో మధనంగా రిట్రీట్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులు.టెక్నాలజీని వినియోగించి పోలీసింగ్ ఏ విధంగా చేపట్టాలి... మహిళలపై నేరాలను అదుపు చేయడం. సైబర్ నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై కాన్ఫరెన్సులో చర్చలను జరిపారు.తద్వారా వివిధ




ఎపి పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై నివేదికను ప్రదర్శిస్తున్న సిఎం చంద్రబాబు,హోంమంత్రి అనిత,డీజీపీ హరీష్

అంశాలపై తాము రూపొందించిన ప్రజెంటేషన్లను సీఎం చంద్రబాబుకు ఐపీఎస్ అధికారులు వివరించారు. సంబంధిత నివేదికను సీఎం చంద్రబాబుకు అందించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 2001లో ఇదే తరహాలో ఫ్యూచర్ పోలీసింగ్ తరహాలో వర్క్ షాప్ నిర్వహించాం అన్నారు.

గతంతో పోల్చుకుంటే నేరాలతీరు మారిందన్నారు.సోషల్ మీడియా వేదికగా సమాజంలో అశాంతిని రెచ్చగొట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారు.నేరాలను కట్టడి చేయడంతోపాటు తప్పులు చేసిన వారికి శిక్షలు పడేలా చేయగలిగితే నేరాలు అదుపులోకి వస్తాయి అన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థను రీస్ట్రక్చర్ చేయాల్సిన అవసరం ఏ మేరకు ఉందో పరిశీలించాలన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కొన్ని పార్టీలు ఏకంగా నేరాలు చేయడానికి కూడా వెనుకాడడం లేదన్నారు. రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని సమర్ధంగా నియంత్రించామని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులుప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సిఎం సూచించారు.

## ఆంజనేయుని విగ్రహం అపహరణలో వీడని చిక్కుముడి

**తిరుమల, ప్రభాతవార్త:** తిరుమల డౌన్‌ఘాట్‌రోడ్డు (మొదటి)లోని మామండూరు మిట్ట వద్ద ప్రసన్నాంజనేయ స్వామి గుడి వద్ద చిన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని బుధవారం వేకువజామున అపహరించాడు. ఈ కేసును కొన్ని గంటల వ్యవధిలోనే తిరుపతి జిల్లా పోలీసులు చేధించడమే ఛాలెంజ్‌గా తీసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, తిరుమల అదనపుఎస్పీ ఐ.రామకృష్ణ, తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, 2టౌన్ సిఐ రాముడు ప్రత్యేక బృందాలతో చేపట్టిన దర్యాప్తు సత్ఫలితాలనిచ్చింది. సాంకేతికత తో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ముద్దాయి జశ్వంత్‌కుమార్‌తో పాటు విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు విచారణ తోబాటు అతని తల్లి తండ్రుల విచారణలో జస్వంత్‌కుమార్ ఇంజనీరింగ్ వరకు చదివి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నట్లు, సుమారు మూడు సంవత్సరాలుగా అతని మానసిక పరిస్థితి నిలకడగా లేనట్లు, తరచూ తల్లి తండ్రులతో గొడవ పడుతున్నట్లు వివరాలు రాబట్టారు. ఈ నెల 5 వ తేదీ మిత్రులతో కలిసి నిందితుడు తిరుమల కి వచ్చినట్లు, నడకదారిలో వెళ్తూ ఈ చిన్న ఆంజనేయ స్వామి విగ్రహాన్ని చూసినట్లు, చిన్నదిగా బాగుండటంతో తీసుకెళ్ళి పూజ చేసుకోవాలని భావించాడు. మూడు రోజుల క్రితం తిరుమల కి ఒక్కడే వచ్చినందున దర్శనం పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో జీపు లో వెళ్తూ ఆంజనేయస్వామి గుడి వద్ద దిగి విగ్రహాన్ని పట్టుకెళ్ళాడు. అయితే ఈ కేసులో దర్యాప్తు అన్ని కోణాల్లో చేపట్టాల్సి ఉందని, విగ్రహం దొంగతనంలో నిందితుడు వెల్లడించిన సమాచారంలో ఎంతవరకు వాస్తవాలు ఉందనేది తేల్చాల్సి ఉందని అదనపు ఎస్పీలు రవి మనోహరచారి, రామకృష్ణ గురువారం సాయంత్రం తిరుమలలో మీడియాకు వెల్లడించారు. త్వరలోనే కోర్టు ద్వారా కస్టడీ కి తీసుకొని పూర్తి స్థాయి లో దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## 25,26 తేదీల్లో 'తెలుగు మహోత్సవం': మంత్రి దుర్గేష్

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాష వైభవాన్ని, సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నతాశయంతో రాష్ట్ర స్థాయిలో తెలుగు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జులై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో జరగనున్న తెలుగు మహోత్సవం అధికారిక పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, సాంస్కృతిక



సౌందర్యం, కళా సంప్రదాయాలు, జానపద వారసత్వం మరియు సృజనాత్మకతలను ఒకే వేదికపైకి తెచ్చే అద్భుతమైన వేడుక ఈ తెలుగు మహోత్సవం అన్నారు. మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ మహా కార్యంలో విద్యార్థులు, యువత, తెలుగు భాషాభిమానులు, ప్రతి ఒక్కరూ విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.



## కాణిపాకం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### స్వర్ణరథం సేవ టిక్కెట్ ధర రూ.5 వేలు, పాలక మండలి ఏకగ్రీవ తీర్మానం

**కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈఏడాది సెప్టెంబర్ 14 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని దేవస్థాన పాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించింది. పాలకమండలి సమా వేశం గురువారం స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకమండలి చైర్మన్ మణి నాయుడు అధ్యక్షతన జరిగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ ప్రధాన అజెండాగా పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిషోర్‌లు సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. ఈసందర్భంగా వచ్చే సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 5 వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగానిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. ప్రతి నెలా ఆలయంలో సంకటహర చతుర్థి రోజున స్వామివారికి జరిగే స్వర్ణర థోత్సవం ప్రస్థుతం దేవస్థానం వారే నిర్వహి స్తుండగా ఇకపై స్వర్ణ రథోత్సవం నిర్వహించే అవకాశం భక్తులకు కల్పిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు స్వర్ణ రథోత్స వంకు 5 వే రూపాయలుగా టిక్కెట్ ధరను ప్రతిపాదిస్తూ సమావేశంలో తీర్మానించినట్లు చైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులను ఉత్సవాలకు ఆహ్వానించాలని పాలకమండలి తీర్మానించనట్లు చైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు.

## దేశంలో యువ స్వాతంత్ర్య పోరాటం మొదలైంది

### కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్

**విజయనగరం, (కురుపాం), జూలై 23 ప్రభాతవార్త :** దేశంలో యువ స్వాతంత్ర పోరాటం మొదలైందని దానిని నియంత్రణ చేసే స్థాయి ఏఒక్క రాజకీయ పార్టీలకు లేదని డిల్లీ జంతర్ మంతర్‌లో నీట్ లీకేజీపై జరుగుతున్న న్యాయ పోరాటంపై స్పందిస్తూ కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్ అన్నారు. గురువారం ప్రకటన విడుదల చేస్తూ విద్యార్థులకు అన్ని రకాలు విద్యకు అర్హత పరీక్షలు నిర్వహణ ,సీట్లు కేటాయింపు పూర్తి అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని నిబంధనలు కు విరుద్ధంగా



కేంద్ర ప్రభుత్వం వైద్య విద్య అర్హత పరీక్ష (నీట్) తమ ఆదీనంలోకి తీసుకోవడమే చట్టవ్యతిరేకమైన దన్నారు. దేశంలో వివిధ వర్గాల ప్రజలు ,యువత 12 ఏళ్ళ బిజెపి పరిపాలన పై విసిగిపోయి పోరాటం చేసేందుకు సిద్ధం అయ్యా రని అన్నారు. ఇది ముమ్మాటికీ కేంద్ర హోంశాఖ వైఫల్యమేనని, భవిష్యత్ యువతరానిదేనని అన్నారు.

## కందుల జెస్సీకి పవన్ కల్యాణ్ అభినందనలు

**విజయవాడ,జూలై 23,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రతిష్ఠాత్మక మిషన్ శక్తిశాట్ కార్యక్రమానికి ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా జడ్పీ పాఠశాలకు చెందిన కందుల జెస్సీని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్..అభినందించారు. "ప్రభుత్వ పాఠశాల తరగతి గది నుంచి చంద్రుని యాత్ర అంచు వరకు సాగిన నీ ప్రయాణం అద్భుతం" అంటూ పవన్ కళ్యాణ్ ప్రశంసించారు..యువతకు స్ఫూర్తిగా నిలిచేలా మరిన్ని విజయాలు సాధించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు.

## ఉగ్రకుట్ర కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధించిన విశాఖ ఎన్ఐఏ కోర్టు

**విజయవాడ.జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఉగ్రకుట్ర కేసులో విశాఖ ఎన్ఐఏ కోర్టు ముగ్గురికి జైలుశిక్ష విధించింది. డొంగరి దేవేంద్ర, దుబాషి స్వప్న, చుక్క శిల్పకు 5 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. దోషులు జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల జైలుశిక్ష విధించనున్నారు. దోషులు నిషేధిత సీపీఐ మావోయిస్టు అనుబంధ సంస్థ సభ్యులుగా గుర్తించారు. మావోయిస్టులకు మద్దతు, నియామకాలు, కుట్ర ఆరోపణలతో కేసు నమోదైంది. ఏపీ పోలీసుల నుంచి 2022 జూన్‌లో ఎన్ఐఏ కేసును తీసుకుంది.

## లారీ కింద పడి వ్యక్తి మృతి

**బుచ్చి (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** బుచ్చి రెడ్డిపాళెం ముంబాయి రహదారిలో వేణుగోపాల స్వామి గుడి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి ఆత్మకూరుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. బుచ్చిరెడ్డిపాళెం నుండి సంగం వైపు మోటార్ బైకుపై వెళుతు వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడు పడిపోగా వెనుకనే వస్తున్న లారీ అతని తలపైన ఎక్కడంతో తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ఆత్మకూరు జేఆర్ పేటకు చెందిన అశోక్‌కుమార్ (40)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిఐ శివరామ కృష్ణారెడ్డి, ఎస్ఐ ఉమాశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టరం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐటిపరిశ్రమల స్థాపనకు అనువైన భవనాలు పోర్టల్‌లో నమోదు చేయండి : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, జూలై 23, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఐటి పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీల స్థాపనకు అనువైన ఖాళీ కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీభూములు, ఐటి కార్యకలాపాలకు అనువైన ఇతర ఆస్తుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌లో నమోదు చేసి జిల్లాలో ఐటిపరిశ్రమ విస్తరణకు సహకరించాలని జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్‌జిల్లాను ఐటిహబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఐటిపరిశ్రమల విస్తరణ ద్వారా స్థలాలు, భవన యజమానులకు మంచి అద్దె లభించటంతోపాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు.

పోర్టల్ నమోదు వివరాల కోసం 8497961902లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## భూమన కరుణాకర్ రెడ్డికి అరెస్ట్ తప్పదు

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి విద్య, జూలై 23 ప్రభాతవార్త:** భూ కబ్జాలు, టిడీఆర్ బాండ్ల కుంభకోణం, 2021 తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దొంగ ఓట్ల నమోదుకు సంబంధించిన కేసుల్లో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తప్పవని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ అంశాలపై విజిలెన్స్ నివేదికలు ప్రభుత్వానికి అందాయని, చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.గురువారం తిరుపతిలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తూ భూముల స్వాధీనాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. భూమన కరుణాకర్ రెడ్డి ఆక్రమించినట్లు విజిలెన్స్ నిర్ధారించిన భూములనే రెవెన్యూ అధికారులు చట్ట ప్రకారం స్వాధీనం చేసుకున్నారని, ఇందులో రాజకీయ జోక్యానికి తావులేదని స్పష్టం చేశారు. తాను భూకబ్జాలకు ఎప్పుడూ



పాల్పడలేదని చెబుతున్న భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డి ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అలాగే 2021 తిరుపతి ఉప ఎన్నికల సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న దొంగ ఓట్ల నమోదుపై సిట్ విచారణ కొనసాగుతోందని, విచారణలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వామివారి సేవలో నిబద్ధతతో పనిచేస్తుంటే, వ్యక్తిగత అక్కసుతో ఆయనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆరణి విమర్శించారు.

## ఉరి వేసుకుని సచివాలయ ఎఎన్ఎం మృతి

**చిల్లకూరు (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** మండలంలోని తోణుకుమాల గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న శ్రీపతి సాయి చందన ప్రియ (27)గురువారం సచివాల యంలో సిబ్బంది ఎవరు లేకపోవడంతో సూసైడ్ లేక రాసిపెట్టి ఫ్యానుకు చున్నితో ఉరేసుకొని మృతి చెందింది. సూసైడ్ లేఖలో అమ్మ నాన్న అక్కకి నమస్కరించి రాయటం ఏమనగా నా చావుకి ఎవరు కారకులు కాదని నేనే ఉరేసుకొని చనిపోతున్నాను అని లేఖలో పేర్కొంది. మృతి చెందిన సాయి చందన ప్రియ ఓజీల మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన అవివాహిత గత సంవత్సరం క్రితమే బదిలీల్లో తోనుకుమాల గ్రామ సచివాలయానికి రావడం జరిగింది. శ్రీపతి రమణయ్య, సుకుమారి దంపతులకు రెండవ కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సచివాలయం వదకు వచ్చి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు, సంఘటన స్థానానికి చేరుకొని కేసు నమోదు చేసిపోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది.

# దుర్గమ్మకి పాలకమండలి ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జులై 22, ప్రభాతవార్త :** బెజవాడ దుర్గమ్మవారికి ఆషాఢం సారె కార్యక్రమంలో గురువారం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు ఆషాఢం సారెను వైభవంగా సమర్పించారు. సారె సమర్పించడానికి వచ్చిన పాలకమండలికి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్ర పఠనోచ్చారణతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించారు.

**వారాహి నవరాత్రులకు నేడు పూర్ణాహుతి :**

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమైన వారాహీ నవరాత్రులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు శాస్త్రోక్తంగా పూర్ణాహుతితో స్వస్తి పలుకుతామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. యాగశాలలో జరిగే జప, తర్పణ, హోమాదుల పూజా కార్యక్రమాలను దేవస్థానమే అంతర్గతంగా నిర్వహిస్తుందని, భక్తులకు ఇందులో అనుమతి ఉండదన్నారు.

**దుర్గమ్మవారికి ఆషాఢం సారె :**

దుర్గమ్మవారికి మంగళవారం పలువురు మహిళా



భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి 7 రోజు గురువారం తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు 27 సారె బృందాలకు చెందిన 9278 మంది భక్తులు సారె సమర్పణ చేశారు. వారికి భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు. **కొబ్బరి చిప్పల టెండర్ ఖరారు:** మహా మండపం 6వ అంతస్తులో జరిగిన భక్తులు కొబ్బరికాయ కొట్టగా ప్రోగు పడిన కొబ్బరి చిప్పలు సేకరించి, బయటకు తీసుకెళ్ళుటకు గానూ జరిగిన టెండర్ బహిరంగ వేలం ప్రక్రియలో ఆలయం ధర్మ కర్తల మండలి చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, ధర్మ కర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. రు.1,36,50,000లకు టెండర్ వేసిన విజయవాడకు చెందిన సుంకాబత్తుల నాగవైష్ణవి టెండర్‌ను ఖరారు చేశారు.

# తుంగభద్ర రిజర్వాయర్‌కు పెరుగుతున్న వరద ప్రవాహం

### ప్రస్తుత నీటి నిల్వ 25 టీఎంసీలు

### ఇన్‌ఫ్లో 24,821 క్యూ సెక్కులు

**అనంతపురం, జులై 23 ప్రభాతవార్త బ్యూరో** ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. గత రెండు రోజుల్లోనే దాదాపు రెండు టీఎంసీలకుపైగా తుంగభద్ర డ్యాంకు చేరుకున్నాయి. 2026 సంవత్సరంలో బుధవారం రికార్డు స్థాయిలో నీరు చేరినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎగువత ప్రాంతాల్లో భారీ వర్షాలు రావడం వల్ల తుంగభద్ర జలాశయానికి నీరు రావడం ఎక్కువైంది. బుధవారం నాటి టనీటి లెక్కలను పరిశీలిస్తే.. టీబీ డ్యాంలో 105.788 టీఎంసీల నీటి గాను 28 టీఎంసీల నీరు ఉంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో పరిశీలిస్తే 24,821 క్యూ సెక్కులు కాగా, అవుట్ ఫ్లో 3,035 క్యూసెక్కులు అని చెప్పవచ్చు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలో వర్షాలు వస్తుండటంతో అనంతపురం, కర్నూలు ఆశలు చిగురిస్తున్నాయి. తుంగభద్ర జలాశయంలో 40 టీఎంసీల నీరు ఉంటేనే అనంతపురం జిల్లాకు సంబంధించిన హెచ్ఎల్‌సికి నీరు వదిలేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే కర్నూలు జిల్లాకు సంబంధించిన ఎల్ఎల్‌సికి నీరు వదిలే నేపథ్యంలో నీటి ప్రవాహం పెరిగితే అనంతపురం జిల్లాకు కూడా హెచ్ఎల్‌సి ద్వారా నీరు వదిలేందుకు అవకాశం ఉంది. హెచ్ఎల్‌సి నీటిని ప్రధానంగా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మొదటి ప్రాధాన్యతగా అధికారులు ఎంచుకునే అవకాశం ఉంది. రుతు పవణాల ప్రభావం వల్ల మరో వారం రోజులు ఇదే విధంగా వర్షాలు పడితే తుంగభద్ర జలాశయంకు ఎక్కువగా నీరు వచ్చే అవకాశం ఉందని, తద్వారా అనంతపురం జిల్లాకు సంబంధించిన హెచ్ఎల్‌సికి టిబి డ్యాం అధికారులు నీరు వదిలే అవకాశం కనిపిస్తోంది. ఇది ఇలా ఉండగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. అనంతపురం, కర్నూలు జిల్లాలకు సంబంధించిన హంద్రీనీవా సుజల స్రవంతి పథకం శ్రీశైలం జలాశయంపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వల పరిస్థితి దయనీయంగా ఉంది. శ్రీశైలం జలాశయానికి సంబంధించి బుధవారం నాటి తాజా నీటి లెక్కలను పరిశీలిస్తే జలాశయం పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 41.51 టీఎంసీలు మాత్రమే ఉంది. డ్యాం పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 820.89 అడుగులు మాత్రమే ఉంది. దీనిని బట్టి తుంగభద్ర జలాశయంలో ఎప్పుడు లేని విధంగా నీరు అడుగంటిందని చెప్పవచ్చు. అయితే తుంగభద్ర జలాశయం పై భాగంలో కర్ణాటకలో ఉన్న ఆల్‌మట్టి, నారాయణపూర్, జలాశయాల్లో నీటి నిల్వలు పెరుగుతూ వస్తున్నాయి. రిజర్వాయర్ల పై భాగంలో కురుస్తున్న వర్షాల వల్ల ఇన్‌ఫ్లో పెరుగుతున్నాయి. ఆ ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో శ్రీశైలం రిజర్వాయర్‌కు కూడా నీరు వచ్చే అవకాశం కనిపిస్తోంది. కర్ణాటకలోని ఆల్‌మట్టి జలాశయానికి సంబంధించి బుధవారం రోజు 65,752 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 38,067 ఆల్‌మట్టి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 123.08 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 103.766 టీఎంసీలు ఉంది. అంటే దాదాపు 84 శాతం నీరు ఆ జలాశయంలో ఉంది. ఆల్ మట్టి రిజర్వాయర్‌కు కింది భాగం కర్ణాటకలో నారాయణపురం డ్యాంలో గరిష్ట నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా, ఇప్పుడు 24.08 టీఎంసీలు ఉంది.



## ప్రధాని పర్యటన ఏర్పాట్లలో అత్యున్నత ప్రమాణాలు

### ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్

**విజయనగరం, జూలై 23 ప్రభాతవార్త:** ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్ర ప్రతిష్ఠాత్మక వేడుకగా నిలిచేలా అన్ని ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రధానమంత్రి పర్యటన నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ప్రధానమంత్రి పర్యటన ప్రత్యేక అధికారి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డితో కలిసి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించిన వారు, ప్రారంభోత్సవానికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో రాష్ట్ర ఎయిర్‌పోర్ట్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, పురపాలక శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ డా. పి.సంపత్ కుమార్, విజయనగరం జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ షోబిత, అదనపు ఎస్పీ సౌమ్యలత, జీఎంఆర్ ప్రతినిధులు ఐ. ప్రభాకర్ రావు, రామరాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దత్తారెడ్డి బ్యాటింగ్ విధ్వంసం

**అనంతపురం, జూలై 23 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి మరోసారి రాణించారు. ఇప్పటికే రెండు అర్థ సెంచరీలు సాధించిన మరల మూడో మ్యాచ్‌లో కూడా సూపర్ బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించారు. సెంచరీ మిస్ చేసుకున్నారు. విజయనగరంలో జరుగుతున్న అండర్-23 ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జట్టుపై కేవలం 45 బంతుల్లో 89 పరుగులు సాధించారు. 8 సిక్సర్లు ఆరు ఫోర్ లతో ప్రకాశం బౌలర్లపై విరుచుకుపడ్డారు గ్రౌండ్ నలుమూలల సిక్సర్ల వర్షం కురిపించి ఆకట్టుకున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని నార్త్ జోన్ అకాడమీలో జరుగుతున్న అండర్-23 ఇంటర్నల్స్ క్రికెట్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్ల మధ్య గురువారం ఉదయం మ్యాచ్ ప్రారంభమైంది. బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జిల్లా జట్టు 20 ఓవర్లలో




195 పరుగులు సాధించి ఏడు వికెట్లు కోల్పోయింది. అందులో ఓపెనర్ రంజీ క్రికెటర్ మచ్చ దత్తారెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రతిభతో 89 పరుగులు సాధించడంతోపాటు రాణించడంతో అనంతపురం జిల్లా జట్టు భారీ స్కోర్ చేసింది మనోజ్ కుమార్ 32 పరుగులు ప్రదీప్ రెడ్డి 22 పరుగులు రేహాన్ 28 పరుగులు మల్లికార్జున 12 పరుగులు చేసి అనంతపురం జట్టు భారీ స్కోర్ చేయడానికి దోహదపడ్డారు.



క్రీడా కారులను అభినందిస్తున్న సమగ్ర శిక్ష, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ టీ.శైలజ

## పారా స్పోర్ట్స్ మీట్‌లో దివ్యాంగ విద్యార్థుల జయకేతనం

**అనంతపురం న్యూటౌన్, జులై 23 ప్రభాతవార్త** రాష్ట్ర స్థాయి పారా స్పోర్ట్స్ మీట్-2026లో జిల్లా దివ్యాంగ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 8-గోల్డ్ మెడల్స్, 2-సిల్వర్ మెడల్స్, 1-బ్రాంజ్ మెడల్, మొత్తం 11 మెడల్స్ సాధించారు. 7 మంది అనంతపురం జిల్లా దివ్యాంగ విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలబెట్టారు. టి.చిన్న, బి.మధు, యం.సుదర్శన్, టి.రాహుల్, బి.తిలక్, పి.ప్రేమ్‌కుమార్, ఆర్.కృష్ణ ప్రవీణ్ విద్యార్థులు 100 మీటర్లు, 200 మీటర్లు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటారు. ఈ సందర్భంగా టీ.శైలజ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష, ఎస్. ఫణిరాజు, సహిత విద్య కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష వారు విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ పాల్గొన్నారు.

## ప్రపంచ జూ. స్క్వాష్ క్వార్టర్ ఫైనల్‌కు అనాహత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్క్వాష్ జూనియర్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ల మహిళల క్వార్టర్ ఫైనల్స్‌కు అనాహత్ సింగ్ చేరుకుంది. టాప్ సీడెడ్ భారత క్రీడాకారిణి అనాహత్ సింగ్ మలేషియాకు చెందిన డోయ్స్ యే సాన్ లీని సునాయాసంగా ఓడించింది. గత ఏడాది కాంస్య పతక విజేత అయిన అనాహత్, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో తన 13/16వ సీడ్ ప్రత్యర్థిని 11-4, 11-8, 11-3 తేడాతో ఓడించి, తదుపరి ఈజిప్టుకు చెందిన 5/8వ సీడ్ హబీబా రిజ్క్‌తో తలపడనుంది. మహిళల విభాగంలో, ఈజిప్ట్‌కు చెందిన హబీబా రిజ్క్ నాలుగు గేమ్‌ల పోరులో అమెరికాకు చెందిన షార్లెట్ స్జెను ఓడించగా, బెల్జియంకు చెందిన సవన్నా మోక్సామ్ వెనుకబడి ఉన్నప్పటికీ పుంజుకుని హాంకాంగ్, చైనాకు చెందిన ఎనా క్వాంగ్‌ను 3-1 తేడాతో ఓడించింది. మరో జిప్సీ క్రీడాకారిణి మాలికా ఎల్కరక్సీ, అమెరికాకు చెందిన దియా యాదవ్‌పై విజయంతో తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించగా, నంబర్ 1 సీడ్ మొహమద్ జకారియా పాకిస్థాన్‌కు చెందిన నౌమాన్ ఖాన్‌పై గెలిచి ముందంజ వేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన అమీర్ ఖలీద్‌జౌస్సెలిన్, ఇంగ్లాండ్‌కు చెందిన రోనీ హిక్లింగ్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించగా, హాంకాంగ్, చైనాకు చెందిన హెలెన్ టాంగ్, మలేషియాకు చెందిన హార్లీన్ టాన్‌పై విజయంతో ముందంజ వేసింది. పురుషుల విభాగంలో, టాప్‌ఎనిమిది సీడ్‌లకు సంబంధించి అనేక అనూహ్య ఫలితాలు నమోదయ్యాయి. భారత ఆటగాడు ఆర్యవీర్ దీవాన్ (5/8) అమెరికాకు చెంఇన యాసీన్ షాలాబీ చేతిలో వరుస గేములలో ఓడిపోయాడు. ప్రస్తుత ఆసియా అండర్ 19 ఛాంపియన్ అయిన అతను అమెరికా ప్లేయర్ చేతిలో 4-11, 1-11, 5-11 తేడాతో పరాజయ పాలయ్యాడు.

## చైనా ఓపెన్‌లో సింధు ఓటమి

### ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2026, రౌండ్ ఆఫ్ 16లో చెన్ యుఫెయ్ చేతిలో భారత్ షట్లరున పీవీ సింధు ఓటమి పాలవ్వగా, ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ పరాజయం పాలై టోర్నీ నుండి నిష్క్రమించారు. చైనాకు చెందిన చెన్ యుఫెయ్ గురువారం భారత క్రీడాకారిణి పివి సింధును 16-21, 22-20, 21-18 తేడాతో ఓడించి, చైనా ఓపెన్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. రెండో గేమ్‌లో సింధుకు నాలుగు మ్యాచ్ పాయింట్లు లభించినప్పటికీ, చెన్ పుంజుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. చివరి గేమ్‌లో, భారత షట్లర్ ఆరంభంలో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, చివరి దశలో చెన్ దూసుకువచ్చి టైను ముగించింది. ఇక భారత యువ ఆటగాడు ఆయుష్ శెట్టి ప్రస్థానం కూడా చివరి 16 రౌండ్‌లో ముగిసింది. అతను ఒక గేమ్ ఆధిక్యాన్ని కోల్పోయి ఐర్లాండ్‌కు చెందిన న్హాట్ గుయెన్ చేతిలో 21-15, 13-21, 20-22 తేడాతో ఓడిపోయాడు. ప్రపంచ 28వ ర్యాంకర్ శెట్టి, రెండో గేమ్ ఓడిపోయిన తర్వాత కోలుకుని, నిర్ణయాత్మక సెట్‌లో 19-15 ఆధిక్యం సాధించినప్పటికీ, తన ప్రత్యర్థిని ఆ స్థితి నుండి తొలగించలేకపోయాడు. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష్య సేన్ 19-21, 11-21 తేడాతో ఓడిపోవడంతో, చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష య సేన్ 1921, 1121 తేడాతో ఓడిపోవడంతో, ఆ రోజు చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది.

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్

# ఫైనల్స్ ఖరారు

### జూన్ 9న నుండి 13 వరకు




**న్యూఢిల్లీ:** ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2027లో జరగనుంది. దీనికి సంబంధించి ఫైనల్ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ ఫైనల్ లండన్‌లోని ఓవల్ స్టేడియంలో జరుగుతుంది. ఫైనల్ జూన్ 9న ప్రారంభమై జూన్ 13 వరకు కొనసాగుతుంది. ఈ టోర్నీ 2025లో ప్రారంభమైంది. టెస్ట్ ఛాంపియన్‌షిప్ రెండేళ్ల పాటు కొనసాగుతుంది. ఇందులో 9 జట్లు పాల్గొంటున్నాయి. అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు ఫైనల్ కు చేరుకుంటాయి. 2027 తర్వాత 2029, 2031 టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ల ఫైనల్స్ ఇంగ్లాండ్‌లో జరుగుతాయని ఐసీసీ ఇప్పటికే ప్రకటించింది. గత సంవత్సరం జూన్ 17న బంగ్లాదేశ్‌శ్రీలంక మ్యాచ్‌తో టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ప్రారంభమైంది. ఆస్ట్రేలియా ప్రస్తుతం 8 మ్యాచ్‌లలో ఏడు విజయాలతో, 87.5 శాతం పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా 75 శాతం పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. 2023లో భారత్‌ను ఓడించి ఆస్ట్రేలియా టైటిల్ గెలుచుకోగా, 2025లో ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టుకు ఈ ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సీజన్ అంతగా కలిసి రాలేదు. ఆ జట్టు తొమ్మిది మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించింది. గతేడాది ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను భారత్ డ్రా చేసుకోగా, వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకుంది. స్వదేశంలో జరిగిన సిరీస్‌లో దక్షిణాఫ్రికా భారత్‌ను క్లీన్ స్వీప్ చేసింది. భారత జట్టు ఇప్పుడు వచ్చే నెలలో శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది.

### కామన్వెల్త్ గేమ్స్‌లో మాల్టాపై

## భారత్ విజయం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో మహిళల బౌల్స్ జంటల ప్రారంభ మ్యాచ్‌లో మాల్టాపై భారత్ విజయం సాధించింది. గురువారం జరిగిన మహిళల జంటల విభాగంలో రూపా రాణి టిర్కీ, పింకీ సింగ్, మాల్టాకు చెందిన కోనీ రిక్సన్, రెబెక్కా రిక్సన్‌లను ఓడించడంతో, భారత్ తన కామన్వెల్త్ గేమ్స్ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించింది. గ్రూప్ దశ ఆరంభ మ్యాచ్‌లో పోటీపడిన భారత ద్వయం, హోరాహోరీగా సాగిన పోరు అనంతరం టై బ్రేక్‌లో విజయం సాధించింది. పింకీ సింగ్ రాణించడంతో భారత్ ఉత్కంఠభరితమైన తొలి విజయాన్ని కైవసం చేసుకుంది. భారత్ తొలి అర్ధభాగంలో రెండు పాయింట్లు సాధించి బలమైన ఆరంభాన్ని అందుకుంది. ఆ తర్వాత మాల్టా రెండో అర్ధభాగంలో ఒక పాయింట్‌తో ఆధిక్యాన్ని తగ్గించింది. భారత జంట తొలి సెట్ మిగిలిన భాగమంతా ఆధిపత్యం కొనసాగించి, దానిని 7-1 తేడాతో సునాయాసంగా కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో మాల్టా బలంగా పుంజుకుంది. తొలి ఎండ్‌లో పింకీ సింగ్ అద్భుతమైన ఫైనల్ బౌల్ వేసి భారత్‌కు ఆరంభ ఆధిక్యాన్ని అందించగా, రెండవ ఎండ్‌లో మాల్టా పుంజుకుని స్కోర్లను సమం చేసింది. మూడో ఎండ్‌లో భారత్ మళ్లీ ఆధిక్యం సాధించగా, నాలుగో ఎండ్‌లో మాల్టా స్కోరును సమం చేసింది. ఆ తర్వాత మాల్టా ఐదో ఎండ్‌ను కైవసం చేసుకుని రెండో సెట్‌ను గెలుచుకోవడంతో,



మ్యాచ్ టైబ్రేక్‌కు దారితీసింది. టైబ్రేక్ కూడా అంతే ఉత్కంఠభరితంగా సాగింది. మాల్టా మెరుగైన ఆరంభం చేసినప్పటికీ, పింకీ సింగ్ మరోసారి ఒత్తిడిలో రాణించి, కీలకమైన చివరి బంతితో భారత్ నిర్ణయాత్మక ఎండ్‌ను కైవసం చేసుకుని విజయాన్ని ఖాయం చేసుకోవడంలో సహాయపడింది.



### కామన్వెల్త్‌లో తొలిపతకాన్ని ఖరారు చేసిన

# బాక్సర్ లవ్లీనా

**న్యూఢిల్లీ:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో గురువారం జరిగిన ప్రారంభోత్సవానికి ముందే, మహిళల 75 కేజీల విభాగంలో బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంతో, 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారతదేశానికి తొలి పతకం ఖరారైంది. 28 ఏళ్ల లవ్లీనా పోటీపడనున్న విభాగంలో కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఫలితంగా, ఈ భారత క్రీడాకారిణికి సెమీఫైనల్స్‌కు నేరుగా ప్రవేశం లభించింది, ఇది ఆమెకు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేస్తుంది. ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లినా జూలైలో జరిగే సెమీఫైనల్స్‌లో టువాలుకు చెందిన గిరేతీశి తాఫాకితో తలపడనుంది.

లవ్లినాకు ఇది తొలి కామన్వెల్త్ గేమ్స్ పతకం. 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన గత ఎడిషన్‌లో, లోవ్లినా లైట్ మిడిల్‌వెయిట్ కేటగిరీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది, అక్కడ ఆమె వేల్స్‌కు చెందిన రోసీ ఎక్లెస్ చేతిలో ఓడిపోయింది. వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చానుతో పాటు, గురువారం జరిగే ప్రారంభోత్సవానికి లవ్లీనాను భారత పతాకధారిగా ఎంపిక చేశారు.

## మెర్సిడిస్ బెంజ్ కొత్త కారు విడుదల!

**ముంబయి,జులై 23:** లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా, భారత మార్కెట్లో తన ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేసింది. దేశంలోనే తొలి ఎలక్ట్రిఫైడ్ ఏఎమ్‌జీ ఈక్లాస్ సెడాన్ అయిన మెర్సిడెస్‌ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్ 4మేటిక్‌ప్లస్‌ను గురువారం లాంచ్ చేసింది. ఏఎమ్‌జీ బ్రాండ్ అందించే అద్భుతమైన పనితీరుతో పాటు ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ టెక్నాలజీ అందించే ఇంధన సామర్థ్యం ఈ కారు సొంతం. ఈ కొత్త సెడాన్ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. పెర్ఫార్మెన్స్ ఎడిషన్ ధర రూ. 1.45 కోట్లు కాగా, రేసింగ్ ఎడిషన్ ధర రూ. 1.48 కోట్లుగా (రెండు ధరలూ ఎక్స్‌షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్, ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ వంటి విభిన్న పవర్‌ట్రెయిన్ ఆప్షన్లను వినియోగదారులకు అందించాలనే తమ వ్యూహంలో భాగంగా ఈ కారును విడుదల చేసినట్లు మెర్సిడెస్‌బెంజ్ పేర్కొంది. ఈ సందర్భంగా మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోశ్ అయ్యర్ మాట్లాడుతూ భారత ఆటోమోటివ్ పరిశ్రమలో ఈక్లాస్ సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న మోడల్. కొత్త ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్, అద్భుతమైన పనితీరు, రోజువారీ వినియోగానికి అవసరమైన సౌలభ్యం, ఎలక్ట్రిక్ సామర్థ్యం వంటి అంశాలను ఒకేచోట



అందిస్తోంది. రేస్ ట్రాక్ మీద అవసరమైన పెర్ఫార్మెన్స్‌ను, రోజువారీ ప్రయాణాలకు కావాల్సిన ప్రాక్టికాలిటీని ఈ సెడాన్ సమన్వయం చేస్తుందని వివరించారు. మెర్సిడెస్ ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్‌లో 3.0లీటర్ ఇన్‌లైన్ సిక్స్‌సిలిండర్ టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 449 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనికి ఏఎమ్‌జీ స్పీడ్‌షిఫ్ట్ టీసీటీ 9జీ ట్రాన్స్‌మిషన్‌లో అనుసంధానించిన 120 కిలోవాట్ల ఎలక్ట్రిక్ మోటార్‌ను జతచేశారు. ఈ రెండూ కలిసి ఏకంగా 585 హెచ్‌పీ (రేస్ స్టార్ట్ ఫంక్షన్‌తో 612 హెచ్‌పీ) శక్తిని, 750 ఞ్ టార్క్‌ను విడుదల చేస్తాయి. ఈ కారు కేవలం 3.8 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ఠ వేగాన్ని ఎలక్ట్రానిక్‌గా గంటకు 250 కిలోమీటర్లకు పరిమితం చేశారు.

### నాలుగోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు

## తప్పని నష్టాలు!

**ముంబయి,జులై 23:** మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం ప్రభావంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. రియాల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్,మౌలిక వసతులు (ఇన్‌ఫ్రా), పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఆటో మరియు మీడియా రంగాల షేర్లు మాత్రమే స్వల్ప లాభాలను నమోదు చేశాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 363.66 పాయింట్లు క్షీణించి 76,391.39 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 126.65 పాయింట్లు పడిపోయి 23,896.60 వద్ద స్థిరపడింది. గత నాలుగు వరుస



ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 2.25 శాతం, నిఫ్టీ 1.90 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ పతనానికి ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు కారణమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.01 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.20 శాతం క్షీణించాయి. బిఎస్ఇలో మొత్తం 1,637 షేర్లు లాభపడగా, 2,585 షేర్లు నష్టపోయాయి. మరో 181 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 4.01 డాలర్లు పెరిగి 98.08 డాలర్లకు చేరుకుంది. ముడిచమురు ధరల పెరుగుదలతో పాటు డాలర్ బలపడటంతో రూపాయి బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96.5600 వద్ద ట్రేడైంది. అంతకుముందు సెషన్‌లో ఇది 96.5300 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1%తగ్గి రూ.1,44,222కు చేరుకుంది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు కంపెనీల షేర్లలో భారీ కదలికలు నమోదయ్యాయి.ఎటర్నల్ షేరు 0.95 శాతం పెరిగింది.




### ఇన్ఫోసిస్ తొలి త్రైమాసిక లాభం

# 8.6% తగ్గుదల

**బెంగళూరు,జులై 23:** దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తొలి త్రైమాసికంలో నికరలాభం 8.6 శాతం తగ్గి రూ.7,769 కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో ఇది రూ.8,501 కోట్లుగా నమోదైంది. మార్కెట్ అంచనాలు రూ.7,774 కోట్లుగా ఉన్నాయి. అదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం పెరుగుదలను నమోదు చేసింది. గత త్రైమాసికంలోని రూ.46,402 కోట్లతో పోలిస్తే 3.9 శాతం పెరిగి రూ.48,211 కోట్లకు చేరుకుంది. వడ్డీ, పన్నుల ముందు లాభం 4.3 శాతం పెరిగి రూ.10,163 కోట్లకు చేరగా, గత త్రైమాసికంలో ఇది రూ.9,743 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 20.99 శాతం నుంచి 21.08 శాతానికి పెరిగి 9 బేసిస్ పాయింట్ల వృద్ధిని నమోదు చేసింది. రాబడులపరంగా 1.5 శాతం నుంచి 3.5 శాతం వృద్ధి ఉంటుందని పేర్కొనగా, తాజా అంచనాలో దానిని 1.5 శాతం నుంచి 3 శాతం మధ్యకు సవరించింది. ఆపరేటింగ్ మార్జిన్ మార్గదర్శకత్వాన్ని మాత్రం 20 నుంచి 22 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది.ఎఐ సేవల ద్వారా బలమైన వృద్ధికంపెనీ సీఈఓ సలిల్ పారేఖ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు మంచి డిమాండ్ కొనసాగుతోందని తెలిపారు. జూన్ త్రైమాసికంలో స్థిర కరెన్సీ ప్రాతిపదికన కంపెనీ ఆదాయం 1 శాతం పెరిగిందని చెప్పారు. మొత్తం తొలి త్రైమాసిక ఆదాయంలో ఎఐ సేవల వాటా 8.2 శాతంగా నమోదైందని కంపెనీ నాయకత్వ మార్పులో భాగంగా అశిష్ కుమార్ దాస్‌ను 2027 మార్చి 31 వరకు సిఇఒడిజిగ్నేట్‌గా నియమించింది. అనంతరం ఏప్రిల్ నుంచి ఆయన పూర్తి స్థాయి సీఈఓ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉద్యోగులకు రెండు విడతల్లో వేతన పెంపుఇన్ఫోసిస్ సిఎఫ్‌వో జయేష్ సంగ్‌రాజ్‌కా మాట్లాడుతూ, ఉద్యోగుల వార్షిక వేతన పెంపును రెండు విడతల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. షేర్ ధత్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు రూ.1,051.80 వద్ద స్వల్ప నష్టంతో ముగిసింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు షేరు ధర 35 శాతానికి పైగా క్షీణించగా గత 12 నెలల్లో సుమారు 33.5 శాతం పడిపోయింది.

## రాబడుల్లో వృద్ధి, తగ్గిన మీషో నష్టాలు!

**ముంబయి,జులై 23:** ఈకామర్స్ సంస్థ మీషో తొలి త్రైమాసికంలో తన పనితీరును మెరుగుపరుచుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర నష్టం దాదాపు సగానికి తగ్గగా, ఆదాయం భారీగా పెరిగింది. కంపెనీ రూ.132.8 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ నష్టం రూ.289.3 కోట్లుగా ఉంది. మరోవైపు, కంపెనీ ఆదాయం 48.3 శాతం పెరిగి రూ.3,713 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,504 కోట్లు.వడ్డీ, పన్నులు, తరుగుదల, అమోర్టైజేషన్‌కు ముందు లాభనష్టం పరంగా కూడా కంపెనీ మెరుగుదల నమోదు చేసింది. ఎబిడిటా నష్టం




రూ.264.4 కోట్ల నుంచి రూ.224.7 కోట్లకు తగ్గింది. వ్యాపార విస్తరణలో భాగంగా, తన అనుబంధ సంస్థ మీషో గ్రోసరీస్లో రూ.75 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నెట్ మెర్చండైజ్ విలువ 34 శాతం పెరిగి రూ.11,614 కోట్లకు చేరుకుంది. మార్కెట్‌ప్లేస్ ఆదాయం 48 శాతం పెరిగి రూ.3,707 కోట్లకు చేరింది. వినియోగదారులు, ఆర్డర్లలో గణనీయమైన పెరుగుదమీషో వార్షిక లావాదేవీలు నిర్వహిస్తున్న వినియోగదారుల సంఖ్య 29 శాతం పెరిగి 27.4 కోట్లకు (274 మిలియన్లు) చేరింది. ఒక్కో వినియోగదారు ఏడాదికి చేసే కొనుగోళ్ల సగటు సంఖ్య 10.3 ట్రాన్సాక్షన్లకు పెరిగింది.అదే విధంగా, కంపెనీకి వచ్చిన మొత్తం ఆర్డర్లు కూడా 29 శాతం పెరిగి 72.5 కోట్లకు (725 మిలియన్లు) చేరాయి.నగదు ప్రవాహంలో మెరుగుదగత 12 నెలల ఫ్రీ క్యాష్ ఫ్లో మైనస్ రూ.633 కోట్ల నుంచి మైనస్ రూ.537 కోట్లకు మెరుగుపడింది. త్రైమాసికంలో షిప్ చేసిన ఆర్డర్లలో సుమారు 37 శాతం ప్రీపెయిడ్ ఆర్డర్లే ఉన్నాయని కంపెనీ వెల్లడించింది.త్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఈలో మీషో షేరు 0.48 శాతం తగ్గి రూ.188.95 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 0.53 శాతం క్షీణించింది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు మీషో షేరు దాదాపు 5 శాతం లాభపడింది.






Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం
శుక్రవారం 24 జులై 2026
I


# రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులుగా అరిగెల బలరామమూర్తి నియామకం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై23,ప్రభాతవార్త.** జిల్లా కోకోపేడ్ చైర్మన్గా వ్యవహరిస్తున్న సీనియర్ కన్స్యూమర్ యాక్టివిస్ట్ అరిగెల బలరా మూర్తి కి ఇటీవల రాష్ట్ర విజిలెన్స్ కమిటీలో మెంబర్గా నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా ఆ నియామక ఉత్తర్వులను ఆయన కి అందజేశారు.అరిగెల బలరామమూర్తి ని ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ మరింత బాధ్యత వహించి కన్స్యూమర్స్ కు న్యాయం చేయటంలో మీరు ముఖ్య భూమిక వహించాలని గుర్తు చేశారు.గత 40 సంవత్సరాలు గా కన్స్యూమర్ యాక్టివిటీ గా ఉంటూ అనేక సమస్యలను తీర్చి కన్స్యూమర్స్ కు న్యాయం చేయటం మీ దక్షతకు నిదర్శనమని ప్రభుత్వం గుర్తించి మీకు రాష్ట్ర కమిటీలో నియమించటం జరిగిందని శాసనసభ్యులు ఆనందరావు వివరించడం జరిగింది. ఈసందర్భంగా శాసనసభ్యులు ఆనందరావు కి అరిగెల బలరా మూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. అమలాపురం జిల్లా కేంద్రంలో డిసి ఐసి సెంటర్ ఏర్పాటు చేయడంలో కృషి చేసిన శాసనసభ్యులు ఆనంద్ రావు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ,కన్స్యూమర్స్ సమస్యల పరిష్కార ఫారం ఏర్పాటు



చేయటానికి కూడా కృషి చేయగలరని ఈ సందర్భంగా అరిగెల కోరడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కోకోఫెడ్ డిసిపిసి మెంబర్స్ బీవీ సత్యనారాయణ,జీవీఎల్ఎన్ శర్మ, బి వి హనుమంతరావు, అద్దంకి అమరేశ్వరరావు, ఆకుల దొరబాబు, నేలపూడి నాగభూషణం, కొత్తపేట ఉషా మేడం సిస్టర్స్, తదితరులు అరిగెల బలరా మూర్తి ని ఘనంగా సత్కరించడం జరిగింది.

## మిషన్ శక్తి శాట్ లో ఏపీ విద్యార్థిని ఎంపిక



**రాజమహేంద్రవరంఅర్బన్,జులై23(ప్రభాతవార్త)** తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కందుల జెస్సీ తన సత్తా చాటింది ప్రపంచంలోనే తొలి ఆల్-గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ 'మిషన్ శక్తి శాట్'కు ఎంపికై రికార్డు సృష్టించింది. భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో జెస్సీ చోటు దక్కించుకుని.. ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా నిలిచింది. 108 దేశాల నుంచి సుమారు 12 వేల మంది బాలికలు ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోగా పలు దశల ఎంపిక ప్రక్రియ అనంతరం జెస్సీ తుది జాబితాలో స్థానం సంపాదించింది. ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం జిల్లాకే కాకుండా రాష్ట్రానికీ గర్వకారణంగా మారింది. ఆగస్టు 23 నుంచి న్యూఢిల్లీలో జరిగే తదుపరి దశ శిక్షణలో జెస్సీ పాల్గొననుంది. జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాలతో పాటు శాస్త్రవేత్తలతో కలిసి శాటిలైట్ డిజైన్, పేలోడ్ అభివృద్ధి, మిషన్ ఆపరేషన్స్‌పై ప్రాక్టికల్ శిక్షణ పొందనుంది. మరోవైపు విద్యార్థినులు రూపొందించే లూనార్ క్యూబ్‌శాట్‌ను అక్టోబర్ 11న శ్రీహరికోట నుంచి ప్రయోగించేందుకు ప్రణాళిక సిద్ధమైంది ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు.

## పోలవరం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి



**రంపచోడవరం: జులై 23 ప్రభాతవార్త.** నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇన్‌చార్జి మంత్రిగా మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని నియమించింది. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణతో పాటు గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారంపై ఆమె ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా గిరిజనుల విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, సంక్షేమ పథకాల అమలులో సమన్వయంతో పనిచేసే బాధ్యతను ఇన్‌చార్జి మంత్రిగా ఆమె నిర్వర్తించనున్నారు.

## మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే శిరీష దేవి ఆధ్వర్యంలో ఘన స్వాగతం

### పోలవరం జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన



**రంపచోడవరం, జూలై 23: ప్రభాతవార్త.** పోలవరం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు రంపచోడవరం మండలం పోలవరం జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి మంత్రికి ఆత్మీయ స్వాగతం తెలిపారు. మంత్రి నారా లోకేష్ పోలవరం జంక్షన్ వద్దకు చేరుకోగానే పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మంత్రిని కలిసేందుకు వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను వివరిస్తూ అర్జీలు సమర్పించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించి పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా పోలవరం జంక్షన్ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రికి స్వాగతం పలికారు.

## నేడు పోలవరం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన

### మెగా యం. పి. టీ. యం కు ఏర్పాట్లు పూర్తి.



**పోలవరం జిల్లా ప్రతినిధి జూలై 23 ప్రభాత వార్త.** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు పోలవరం జిల్లాలో(రంపచోడవరం )లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు విద్య -ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన పురస్కరించుకొని మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. హెలిప్యాడ్, యం. పి. టీ. యం సమావేశం నిర్వహించే రంపచోడవరం జిల్లా పరిషత్ పాఠశాల, జూనియర్ కళాశాల ను అంగరంగ వైభవంగా ముస్తబు చేశారు.ముఖ్య మంత్రి తో ముఖా ముఖిగా విద్యార్థులు, టీచర్లు, తల్లులు మాట్లాడటానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయటంతో పాటు, రీహారసల్స్ పూర్తి చేశారు. ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, సి. యం. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరావు,జె. సి. ప్రశాంత్ కుమార్,రంపచోడవరం ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి, మఠం విజయ్ భాస్కర్,ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంస్ చైర్మన్, రంపచోడవరం పరిశీలకులు కోట్ని బాలాజీ, , అరకు పార్లమెంట్ టీ డి పి అధ్యక్షురాలు తేజవతి, మాజీ యం యల్ ఏ బాబురామేష్,సుభాని, పెద్దిరాజు తతితరులు పరిశీలించారు.







## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి ఎమ్మెల్యే శిరీష దేవి, మఠం విజయ్ భాస్కర్‌లు విశేష కృషి

**లోకేష్ పర్యటన కోసం భారీ జనసమీకరణ.**

**పోలవరం జిల్లా ప్రతినిధి/రంపచోడవరం జూలై 23 ప్రభాత వార్త.** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన శుక్రవారం రంపచోడవరంలో విజయవంతం చేయడానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి,ఆమె భర్త మఠం విజయభాస్కర్ సర్వశక్తులు వడ్డీ విశేష కృషి చేశారు.రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం రాత్రి రంపచోడవరం పర్యటన విజయవంతం చేయడంతో పాటు, రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ కు గిరిజన సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలకాటని భారీ ఏర్పాటు చేశారు. లోకేష్ పర్యటనకు భారీగా జన సమీకరణ చేసి, ఘన స్వాగతం పలికి తమకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించి మంత్రి మన్నలు పొందాటానికి తమ వంతు కృషి చేశారు.యం ఎల్ ఏ దంపతులు కార్యక్రమం విజయవంతం చేయటం కోసం గత వారం రోజులుగా కంటిమీద కునుకు లేకుండా శ్రమిస్తున్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రంపచోడవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయటం, గుర్తైదు మండలాన్ని ప్రకటించటంలో యం. ఎల్. ఏ కృషి అభినదనీయం. తమ ప్రాంత అభివృద్ధి కి బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి పర్యటన, మంత్రి లోకేష్ పర్యటన విజయవంతం చేయటం, జిల్లా ఏర్పడ్డ తరువాత తొలి పర్యటన కావటంతో కార్యక్రమం విజయవంతం చేయటమే లక్ష్యంగా శ్రమించారు. 12 మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులను సమీకరించటం,వచ్చిన కార్యకర్తలు నాయకులకు అవసరమైన కనీస సౌకర్యం కల్పించి క్యాడర్ లో జోష్ నింపి తమ మార్క్ కోసం కృషి చేస్తున్నారు.ఐ. పోలవరం ఎన్. హెచ్.జంక్షన్ వద్ద లోకేష్ కు స్వాగతం పలకటం కోసం కార్యకర్తలను సమీకరించి, డోలుకోయలు, నృత్యాలు, గజమాల ఏర్పాటు చేశారు.ఒకవైపు తల్లికి వందనం, ముఖ్యమంత్రి పర్యటన, లోకేష్ పర్యటన ఏర్పాట్లు, శుక్రవారం మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్, పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నిర్వహించే సమావేశం ఏర్పాట్లు అన్ని విజయవంతం చేయటానికి చేస్తున్న కృషి చేశారు.





## వాడపల్లి వెంకన్న ఆలయం భక్త జన శోభితం...





**ఆత్రేయపురం, జూలై,23,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం గురువారం భక్తులతో పోటెత్తింది. ఉదయం మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, అష్టోత్తర శతనామావళి, గోపూజ, నిత్య కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.ఏడువారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర పూజ, నిత్యకళ్యాణం లలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తగు ఏర్పాట్లు చేశారు.


ప్రభాత వార్త

## న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెటవర్క్‌ను మరింత పట్టిష్టవంతంగా చేయాలనుకుంలోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గల వారికి న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది."

అభ్యర్థులకు కావలసిన అర్హతలు

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్, డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు

గండేపల్లి, కిర్లంపూడి, అన్నవరం, తొండంగి, , తుని రూరల్, కోటనందూరు, సామర్లకోట, కరప, యానం, కాకినాడ సిటీ

ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.

'వార్త' ఆఫీస్, రాజమహేంద్రవరం

వివరములకు: 9666685998, 8096661682 నెంబర్లను సంప్రదించగలరు





# మొక్కలు నాటే కార్యక్రమం..




ఎటపాక: జూలై 23 ( ప్రభాత వార్త): లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం-జటాయు ప్రెసిడెంట్ బానోతు మంగలాల్ గారి ఆధ్వర్యంలో పిచికలపాడు పంచాయతీ తొగ్గూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల యందు పకృతి పరిరక్షణ హరితహారం -మణిహారం లో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కల నాటే కార్యక్రమం విద్యార్థులకు ఉచితంగా బుక్స్, భోజనం ప్లేట్, గ్లాస్, మరియు తోగూడెం గ్రామ పేదలకు దోమతెరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం జటాయు చాటెడ్ ప్రెసిడెంట్ నక్క వెంకన్న గారు, 2026-2027 జటాయు క్లబ్ ప్రెసిడెంట్ బానోతు మంగలాల్ , సెక్రటరీ కోపనాతి శాంతారావు, ట్రెజరర్ భాష్యం రమణ , సంపతి క్లబ్ ట్రెజరర్ మల్లాడి చక్రవర్తి, ప్రోగ్రాం చైర్మన్: విజయ రెడ్డి, అకిశెట్టి రాము, అశోక్, రాంబాబు, క్లబ్ మెంబర్స్ రాము నాయక్, వీరన్న, నరసింహారావు, నాగేశ్వరరావు, స్కూల్ యాజమాన్యం, గ్రామ పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బూడిద దుర్గను పరామర్శించిన తెలుగుదేశం నాయకులు



వి.ఆర్.పురం,జూలై23, ప్రభాతవార్త మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోగల చొప్పల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బూడిద.దుర్గ ను ఆ పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి బురక.కన్నారావు, మాజీ ఆర్గనైజషన్ కార్యదర్శి బురక.సారయ్య, బోదేబోయినసురేష్ రావు, సరియం.కుమారిలు పరామర్శించారు. దుర్గాలు ఇటీవల భద్రాచలం పట్టణంలోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగింది. ఆమె గురువారం స్వగ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న నాయకులు ఆమె ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఘనంగా పెదవలసల మహాలక్ష్మమ్మ తీర్థం.




తాళ్లరేవు, జూలై 23 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాలక్ష్మమ్మ తీర్థం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మమ్మ ఆలయాన్ని, విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో బంధువులు, పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో పెద వలసలలో సందడి నెలకొంది. ఆసాధులు భక్తి భావంతో గరగ నృత్యాలతో అలరించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోండి.

రౌతులపూడి, జూలై 23, (ప్రభాత వార్త) ప్రతీ రైతు తమ పంటలకు బీమా చేయించు కోవాలని మండల వ్యవసాయాధికారి ఈశ్వర రావు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎలీనో ప్రభావం ఉన్నందున రైతులు రెండు వేల రూపాయలు చెల్లించి పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకుంటే పంట నష్ట పోయిన రైతులు నలభై వేల రూపాయలు ఇన్సూరెన్స్ పొందవచ్చన్నారు. ప్రతి రైతులకు నేడే ఇన్సూరెన్స్ చేయించుకోవడానికి ఆఖరి తేదీ యని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

## 25 అంగన్వాడీ సహాయకుల పోస్టులకు అర్జీలు పరిశీలన ..

**ఇంచార్జి సి. డి. పి. ఓ.క్రాంతికుమారి**
**(సీతారామాపురం పోస్టుకు అర్జీ నిల్ )**



రాజవొమ్మంగి, జూలై 23, ప్రభాతవార్త రాజవొమ్మంగి ఐ. సి. డి. ఎస్. ప్రాజెక్ట్ పరిధిలో 16 అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ సహాయకులు పోస్టుల అర్జీల్లో భాగంగా 15 కేంద్రాలకు 28 అప్లికేషన్ లు రాగా వాటిని 25 తేదీ శనివారం పరిశీలన చేయడం జరుగుతుందని ఇన్ ఛార్జి సిడిపిఓ క్రాంతికుమారి తెలిపారు. సీతారామపురం గ్రామ అంగన్వాడీ కేంద్ర సహాయకుల పోస్టుకు అర్జీ ఎవరూ చేసుకోలేదన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగంపాడు. నెల్లిమెట్ల కాలనీ., డి. మల్లవరం, సింగంపల్లి రోడ్డు, సుబ్బంపాడు., బొరుగుపల్లి అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి ఒక ధరకాస్తు మాత్రమే వచ్చాయన్నారు. జడ్డంగి.. 4 అంగన్వాడీ కేంద్రానికి 3, చిన్నయ్య పాలెం.. 2, కొత్తవీధి. 2, వయ్యాడ.. 2, శ్రీరామ్ నగర్.. 2, లక్కవరప్పాడు.. 2, కింద్ర కాలనీ.. 4 అర్జీలు, కన్నయ్యమ్మపేట.. 3, కిర్రాబు కాలనీ.. 2 వచ్చాయని వెల్లడించారు.


## 12 గ్రామాల్లో దోమలు మందు పిచికారీ పూర్తి..

**సబ్ యూనిట్ ఆఫీసర్ ఛీడిపల్లి ప్రసాద్**



రాజవొమ్మంగి, జూలై 23, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలంలో గల మూడు ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో 33 గ్రామాల్లో దోమలు మందు పిచికారీ చేయాల్సి ఉండగా 12 గ్రామాల్లో పూర్తి అయినట్లు రాజవొమ్మంగి మండల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ తెలిపారు. గడుఓకుర్తి పంచాయితీ దోనేలపాలెం గ్రామంలో గురువారం దోమలు మందు టెక్నీకల్ సూపర్ వైజర్ సోమరాజు రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 11 తేదీన చీడిపాలెంలో పిచికారీ ప్రారంభించడం జరిగిందన్నారు. లాగరాయి పి. హెచ్. సి పరిధిలో 13 గ్రామాలకు 11 గ్రామాలు పిచికారీ పూర్తి కావడం జరిగిందన్నారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి పరిధిలో 8 గ్రామాలకు ఒక గ్రామం పూర్తి అయినట్లు వివరించారు. జడ్డంగి పి. హెచ్. సి పరిధిలో 12 గ్రామాల్లో పిచికారీ చేయాలన్నారు. 33 గ్రామాల్లో 3599 గృహాల్లో పిచికారీ చేయాల్సి ఉండగా 12 గ్రామాల్లో 800 గృహాల్లో పిచికారీ పూర్తి అయినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సి. హెచ్. ఓ. దబ్బా విల్సన్ బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్, యం. టి. ఎస్. పల్లాల సోమరాజు రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ పూసం రాజబాబు, యం. ఎల్. హెచ్. పి. సుష్మ, ఏ. ఎన్. యం. కృష్ణవేణి, అంగన్వాడీ వర్కర్ చదల ఆదిలక్ష్మి, ఆశ వర్కర్ కుంజం దేవి పాల్గొన్నారు.

## నేడు మరిడమ్మ అమ్మవారి ఆలయం మూసివేత



పెద్దాపురం, జూలై 23 (ప్రభాత వార్త ) ఈనెల 24వ తేదీన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయ తలుపులు మూసివేస్తున్నట్లు మరిడమ్మ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కే విజయలక్ష్మి తెలిపారు. అమ్మవారి ఆషాఢ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మరిడమ్మ తల్లికి మహాకుంభ నివేదన సమర్పించడంతో ఆషాఢ శుక్రవారం ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆలయంలో ఎటువంటి దర్శనాలు ఉండవని, భక్తులు, యాత్రికులు ఈ విషయాన్ని గమనించాలని విజయలక్ష్మి కోరారు. శనివారం యధావిధిగా అమ్మవారి దర్శనాలు లభిస్తాయన్నారు. భక్తులు యధావిధిగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని ఆమె కోరారు.

# ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న ఇన్చార్జ్ పదవి ఎవరిని వరిస్తుందో?

- పి.గన్నవరం నియోజవర్గంలో టిడిపి అధిష్టానం నిర్ణయం కోసం ఆశావాహుల నిరీక్షణ..
- లీడర్లు అధిష్టానం వైపు.. క్యాడర్ లీడర్ల వైపు..



అంబాజీపేట,జూలై 23, ప్రభాతవార్త): రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న లీడర్లు,ఉత్సాహవంతులైన కేడర్ తో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీకి పి.గన్నవరం నియోజకవర్గంలో ఏడేళ్లుగా ఇన్చార్జి లేకపోవడం ఆ పార్టీ శ్రేణులను బాధిస్తోంది. ఇన్చార్జిని నియమించాలని ఎంతోమంది ఎన్నో రకాలుగా విజ్ఞప్తి చేసినా పార్టీ అధిష్టానం పట్టించున్న దాఖలాలులేవు. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇప్పటివరకు పి.గన్నవరం నియోజవర్గంలో పార్టీని నడిపించే నాయకుడు లేకపోయినా, పార్టీ శ్రేణులు సమిష్టి కృషితో ఎన్నో కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు. కూటమి పొత్తులో భాగంగా 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీకి సీటు కేటాయించినా టిడిపి శ్రేణులు ఏమాత్రం వ్యతిరేకత కనపర్చక కపోవడంతో పాటు కూటమి అభ్యర్థి విజయానికి కృషిచేసి భారీ విజయాన్ని నమోదు చేశారు.గత ఏడేళ్లుగా త్రిమెన్ కమిటీ అంటూ కొన్నాళ్ళు,ఇద్దరు కో-కన్వీనర్లు అంటూ ఇప్పటివరకు పార్టీని నడిపించూసుకుంటూ వచ్చారు.కూటమి పొత్తులో భాగంగా జారవిడుచుకున్న నియోజకవర్గాలలో పార్టీ బలాన్ని పెంచే ఉద్దేశంతో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో పి.గన్నవరం నియోజకవర్గం టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం మొదలైంది.పార్టీని నమ్ముకుని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నియోజకవర్గానికి చెందిన ఎస్సీ నాయకులకే ఇన్చార్జి పదవి ఇవ్వాలని ఎస్సీ సామాజిక వర్గీయుల నుండి ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది.ఈ నెల 16న పి.గన్నవరంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు, జోన్-2 ఇంచార్జ్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావులు నియోజకవర్గ ఇన్చార్జి ఎంపికకు అభిప్రాయ సేకరణను రహస్యంగా చేపట్టారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను నాయకులకు తెలిపారు.పార్టీ నాయకులు వెల్లబుచ్చిన అభిప్రాయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఇన్చార్జిని ఇస్తామని, పార్టీ అధిష్టానం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని ఇంచార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు.వీరైతేనే పార్టీ అభివృద్ధితో పాటు అందరి సమన్వయంతో ముందుకు వెళ్లగలరని కొంతమంది పేర్లను నియోజకవర్గ పార్టీ శ్రేణులు సూచించినట్లు తెలిసింది. వారిలో ప్రధానంగా కొన్నాళ్లుగా నియోజకవర్గ కో-కన్వీనర్ గా పనిచేస్తున్న మోకా ఆనంద సాగర్,2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు అనూహ్యంగా తెరమీదకు వచ్చి పి.గన్నవరం అసెంబ్లీ టికెట్ చేజిక్కించుకుని,అనివార్య కారణాలతో టికెట్ వదులుకుని, ఇన్చార్జి రేసులో ఉన్నానంటూ మళ్లీ ముందుకొచ్చిన మహాసేన రాజేష్, రాజకీయ ఆరంగేట్రం తెలుగుదేశం పార్టీతోనే మొదలైన నాగాబత్తుల వెంకట సుబ్బారావు,జాలెం సుబ్బా రావు, చిన్నం బాల విజయరావులతో పాటు నక్కా సునీల్ రేసులో ఉన్నట్లు తెలిసింది..

## రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు బలరామమూర్తికి అభినందనలు..



అంబాజీపేట,జూలై 23, (ప్రభాతవార్త): రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన అంబాజీపేటకు చెందిన కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తిని కూటమి శ్రేణులు గురువారం అభినందించారు. రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన ఉత్తర్వులను అమలాపురంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా బలరామమూర్తి అందుకున్నారు. ఈ సందర్భంగా బలరాంమూర్తిని అంబాజీపేట కార్యాలయంలో పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపతి వీర రాఘవులు, రవణం రాము, మైపాల తాతాజీ, పత్తి దత్తుడు, సూదాబత్తుల రవి, పత్తి శివ, నందెపు శ్రీను, బంధన రంగ తదితరులు ఉన్నారు.

## పెద్దాపురం లో హోరా హోరిగా సాగుతున్న హేండ్ బాల్ పోటీలు



పెద్దాపురం జూలై 23 (ప్రభాత వార్త ) స్థానిక పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో గురువారం రెండవ రోజు హ్యాండ్ బాల్ రీజినల్ లెవెల్ పోటీ రెండవ రోజు హోరాహోరీగా జరిగాయి . ఈ పోటీలలో గెలుపొందిన టీమ్ నేషనల్ లెవెల్ లో ఆడేందుకు అర్హత పొందుతారని విద్యాలయ ప్రిన్సిపాల్ శరత్చంద్ర కీర్తి తెలిపారు. ఈ మూడు రోజులపాటు జరుగుచున్న పోటీలలో 60 లీగ్ మ్యాచ్ లను నిర్వహించాల్సి ఉండగా ఇప్పటికి 50 మ్యాచ్ లను నిర్వహించామన్నారు. ఇంత వరకు జరిగిన మ్యాచ్ లలో కోలార్, పోలవరం , క్లష్టర్సు లీడ్ లో ఉండగా రాయి చూరు క్లస్టర్ మాత్రం అండర్ 19 బాలికల విభాగంలో ముందంజలో ఉందన్నారు. నాక్అవుట్ మ్యాచ్ లద్వార రేపు ఉదయం విజేతలను నిర్ణయిస్తారని పిఇ టి సనపల సత్యన్నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం లో పీ జి టి ఇంగ్లీష్, మేథ్స్ పిజిటి చక్రవర్తి, పి యి టి అనూరాధ, పి. రామారావు పి జి టి హిందీ ప్రేమలత, రాజ్యలక్ష్మి, ఎమ్ లక్ష్మణరావు, కె విజయకుమార్, కె రామచంద్రుడు, బి శార్వాణి తదితరులు పాల్గొన్నారు.

## డొంకరాయి ఎస్సై చరణ్ నాయక్ ఆధ్వర్యంలో 10 కేజీల గంజాయి పట్టివేత



మోతుగూడెం జూలై:23 ప్రభాతవార్త ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డొంకరాయి పోలీసు స్టేషను ఎదురుగా చెక్ పోస్ట్ వద్ద బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిస్సా రాష్ట్రం పశువులంక గ్రామం నుండి గుంటూరు పట్టణానికి పల్సర్ మోటారు బైక్ మీద ఇద్దరు వ్యక్తులు వెళుండగా ఎస్సై చరణ్ నాయక్ మరియు సిబ్బంది చెక్ పోస్ట్ వద్ద చెకింగ్ కోసం ఆపాగా ఇరువురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద సుమారు 50 వేల రూపాయల విలువ కల్గిన 10 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. తరలిస్తున్నా కుందేటి చెన్నకేశవరావు (20)మరియు సద్దాం పవన్ మాధవ్ (21) గుంటూరు పట్టణానికి చెందిన వారని ఎస్సై తెలిపారు.కేసు నమోదు చేసీ ముద్దాయిలను రిమాండ్ కు తరలించామని తెలిపారు.

## పోలీస్ పహారా మధ్య జి.వేమవరంలో స్మశాన స్థలం సర్వే.

**ముందస్తుగా మోహరించిన పోలీసు బలగాలు.**



తాళ్ళరేవు, జూలై 23 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం జి. వేమవరంలో సర్వే నెంబర్ 172/2, సర్వేనెంబర్ 173 లో 1.78 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు సర్వే చేసి, హద్దులు నిర్ణయించి గురువారం స్థానిక పంచాయతీకి అప్పగించారు. గత ఎన్నో ఏళ్లుగా ఇదే భూమిలో శాశ్వత గృహాలు నిర్మించుకుని ప్రజలు నివాసం ఉంటున్నామని, ఇప్పుడు స్మశాన స్థలం అనడం ఎంతవరకు న్యాయమని స్థానిక ప్రజలు కొన్నాళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. పలుమార్లు ఈ స్థలాన్ని సర్వే చేయడానికి వచ్చిన అధికారులను ప్రజలు అడ్డుకున్న సంగతి విధితమే. అయితే ఈ స్థలం పై గ్రామంలోని ఒక వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కోర్టు డిక్రీ ఇచ్చిందని, కోర్టు ఆదేశాల ప్రకారం ఆ స్థలాన్ని సర్వే చేసి పంచాయతీకి అప్పగించామని తాళ్లరేవు తహసిల్దార్ జి ఆర్ వి భద్రరావు అన్నారు. ఈ మేరకు సర్వే నెంబర్ 172/2లో 0.63 సెంట్లు, సర్వేనెంబర్ 173 లోని1.15 సెంట్లు వెరసి1.78 సెంట్ల భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించామన్నారు. గ్రామంలో ఎటువంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా కాకినాడ రూరల్ సి.ఐ. చైతన్య కృష్ణ, కోరంగి ఎస్. ఐ .సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు ముందస్తుగా జి.వేమవరం లో మోహరించాయి. అయితే ఈ స్థలంలో గత 60 ఏళ్లుగా 12 కుటుంబాలు అనుభవంలో ఉన్నాయని, వీరిలో 9 మంది శాశ్వత గృహాలు నిర్మించుకున్నామని, దానికి సంబంధించిన పక్కా రికార్డులు మా వద్ద ఉన్నాయని బాధితులు అనుకూలి రాము, అనుకూలి ఉప్పయ్య, అడబాల గంగాభవాని, యర్రం నీడి కమలావతి, టేకుమూడి దేవమని, పెంకే సూరిబాబు, దాసరి సత్తిబాబు, యలంపాలెపు శ్రీను, దాసం రామాంజనేయులు, అనుకూలి కృష్ణారావు, జీవీకే ప్రసాద్ తదితరులు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మా తాతల కాలం నాటి నుంచి ఈ స్థలంలో నివాసం ఉంటున్నామని ఇప్పుడు ఇది స్మశాన స్థలం అంటే మేము ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆక్యుఫెన్సీ సర్టిఫికెట్ లేకుండా భవనాలను వినియోగించరాదు

**కమిషనర్ రాహుల్ మీనా**



రాజమహేంద్రవరం సిటీ, జూలై 23(ప్రభాతవార్త). భవనాలకు పన్ను విధించే నాటికి ఆక్యు పెన్సి సర్టిఫికెట్ జారీ చేసి ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. గురువారం అసిస్టెంట్ కలెక్టర్ ఆదిత్య శర్మ టౌన్ ప్లానింగ్ విభాగం రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. టీటీడీ రోడ్ లో పన్ను విధించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్న పలు భవనాలను పరిశీలించారు. అర్బన్ పరిధిలో నిర్మిస్తున్న భవనాలు ఆమోదిత ప్లాన్ ప్రకారం అన్ని భద్రత ప్రమాణాలను అనుగుణంగా కడితేనే నివాసయోగ్య ధ్రువీకరణ పత్రం జారీ చేయబడుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ప్లానులకు నిర్మాణాలకు తేడాలు ఉన్నట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే అర్బన్ లో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాల జరగాలని నూతనముగా నిర్మాణం చేసే భవనాల నిబంధనలు మేరకు తగిన డ్రైనేజీ గ్రీనరీ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నివాస యోగ్య ధ్రువపత్రం పొందిన తరువాత ఆయా భవనాలకు పన్నులు విధించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్మాణ విస్తీర్ణాన్ని తక్కువగా చూపించి పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈయన వెంట డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, రెవెన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు ,సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఆర్ఐ సురేష్ ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఎస్ఎస్సీ మండల ఫస్ట్ విద్యార్థికి 'షైనింగ్ స్టార్ అవార్డు"ఘన సత్కారం...



ఆత్రేయపురం, జూలై,23,(ప్రభాత వార్త) పట్టుదల,క్రమశిక్షణ, నిరంతర శ్రమతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చనని మండల విద్యాశాఖా ధికారి పి. వరప్రసాద్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్, లు అన్నారు. మండలంలోని అంకంపాలెంలోని శివశివాని హిందూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ఐ. నాగ కేశవ్ ఎస్-ఎస్సీ--2026 పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఆత్రేయపురం మండలంలో ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖాధికారి పి. వరప్రసాద్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్, లు విద్యార్థి నాగ కేశవ్ను అభినందించి శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి నాగ కేశవ్ సాధించిన విజయం పాఠశాలకు, తల్లి దండ్రులకు, మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఎస్ఎస్సీ పరీక్షల్లో మండల ప్రథమ స్థానం సాధించిన నాగ కేశవ్కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "షైనింగ్ స్టార్ అవార్డు"తో పాటు రూ.20,000 నగదు బహుమతి ప్రదానం చేసిన విషయం తెలిసిందే. అద నంగా అతని ప్రతిభను గుర్తించిన శివశివాని హిందూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం రూ.10,000 నగదు ప్రోత్సాహక బహుమతిని అంద జేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఎం. చైతన్య,పాఠశాల యాజమాన్య సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన కాంగ్రెస్ నాయకులు



ఎటపాక, జూలై 23 (ప్రభాత వార్త ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును ఎటపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నక్క వెంకన్న యాదవ్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగం, పరీక్షల నిర్వహణలో లోపాలు, ధరల పెరుగుదల, రైతుల సంక్షోభం వంటి ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీని అరెస్టు చేసిందని ఆయన ఆరోపించారు. ప్రజలకు సమాధానాలు చెప్పాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు పోలీసు బలాన్ని ఉపయోగిస్తోందని విమర్శించారు. ఎన్నికైన మహిళా ఎంపీ ప్రియాంకా గాంధీతో అవమానకరంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల తరపున కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, ప్రజాస్వామ్యాన్ని సంకెళ్లతో బంధించలేరని నక్క వెంకన్న యాదవ్ అన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే నాయకులను అరెస్టు చేయవచ్చుగానీ, ప్రజల ఆగ్రహాన్ని అణచలేరని ఆయన హెచ్చరించారు.

## భూ రికార్డుల భద్రతకు బ్లాక్చెయిన్ సాంకేతికత


**ఏడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం -- ఎమ్మార్వో ఎం. శ్రీనివాస్**



కడియం, జూలై 23 (ప్రభాతవార్త) భూ రికార్డులను మరింత భద్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్చెయిన్ సాంకేతికత ఆధారంగా పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిందని కడియం మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) ఎం. శ్రీనివాస్ తెలిపారు. గురువారం కడియం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు చెప్పారు. భూ రికార్డుల్లో ఎలాంటి అనధికార మార్పులు జరగకుండా టాంపర్ప్రూఫ్ విధానంలో డిజిటల్ రికార్డులను భద్రపరిచే వ్యవస్థనే బ్లాక్చెయిన్ అని వివరించారు. జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) సహకారంతో హైపర్లెడ్జర్ ఫ్యాబ్రిక్ ఆధారంగా ఈ వ్యవస్థ రూపొందించబడిందని, దీని ద్వారా భూ రికార్డుల భద్రత పెరగడంతో పాటు నకిలీ పత్రాలు, అక్రమ మార్పులు, భూ వివాదాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే భూ రికార్డులు స్వయంచాలకంగా నవీకరణ కావడం, ఆటో మ్యుటేషన్, ఉపవిభజన, విస్తీర్ణ సవరణ వంటి సేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయని ఎమ్మార్వో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కే. రమేష్, జిల్లా రిజిస్ట్రార్ కే. జగన్మోహన్ రావు, సబ్రిజిస్ట్రార్ లక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి రివర్ ఫ్రంట్ ను సెప్టెంబర్ 15 నాటికి అందుబాటులో తీసుకురావాలి

**కమిషనర్ రాహుల్ మీనా**



రాజమహేంద్రవరం సిటీ, జూలై 23 (ప్రభాతవార్త) గోదావరి రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేసి సెప్టెంబర్ 15 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన గోదావరి రివర్ ఫ్రంట్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భద్రత కారణాల దృశ్యం ప్రజలకు చూసేందుకు అనుమతించవద్దని సంబంధిత అధికారులను సూచించారు. ఆగస్టు 15 నాటికల్లా పీవీ నరసింహారావు పార్కును వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈయన వెంట ఈ ఈ మదర్శాలి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వాడపల్లి దేవస్థానానికి శ్రీ స్వామివారి చిత్రపటం అందించిన భక్తుడు...



ఆత్రేయపురం, జూలై,23,(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తణుకుకు చెందిన మధు వరప్రసాద్ . శ్రీ వేంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని ఆయన స్వయంగా 40 రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో, చేతితో స్వామివారి చిత్రపటాన్ని రూపొందించి గురువారం దేవస్థానంలో అర్చకులకు అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

## ఘనంగా లక్ష్మీ వారాహి హోమం

**...అమ్మవారికి పుట్టకొండ గ్రామస్తుల సారి**



పెదపూడి,జూలై 23, ప్రభాతవార్త: కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడ బిక్కవోలు రోడ్డు నందు వెలసిన అయ్యప్ప ఆలయంలోని శ్రీ వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులలో 9వ రోజు లలితా దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారు శాంతస్వరూపంలో చెరుకు గడచేతభూని ప్రకాశవంతమైన చల్లని చూపులను భక్తులపై ప్రసరించింది. గుప్త నవరాత్రులలో 9వ రోజు కావడంతో ఆలయంలో తెల్లవారుజాము నుండి విశేషమైన కైకర్యాలను నిర్వహించారు లక్ష్మీ వారాహి హోమం ఎన్ వి రామారెడ్డి దంపతులు, సత్తి సుబ్బారెడ్డి దంపతులు, శ్రీనివాస్ రెడ్డి దంపతులు, రామలక్ష్మణులు దంపతులు, మల్లిడి శ్రీనివాసరెడ్డి దంపతులు యజ్ఞ కర్తలుగా వేదపండితులు పద్మనాభాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారి మహిమతో పెదపూడి మండలం పుట్టకొండ గ్రామం ఏకమై ఆధ్యాత్మిక గురువు వల్లు వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో వందలాదిమంది ఆషాఢ మాస సారి కార్యక్రమాన్ని మేళతాలు, మంగళ వాయిద్యాలు నడుమ మామిడాడ చేరుకొని శోభాయాత్రగా చలిమిడి పానకము, చీరలు,గాజులు, రవికలు, పిండి వంటలు రకరకాల తినుబండారాలను వివిధ అలంకారాలను అమ్మవారికి కానుకగా తీసుకువచ్చారు. పుట్టకొండ ప్రజానీకానికి మణికంఠ స్వామి ఆలయ దేవస్థానం కమిటీ మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికి ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించి సారెను సంప్రదాయంగా శాస్త్రానుసారంగా అమ్మవారికి అందజేశారు. వచ్చిన భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు అందించి అన్నప్రసాదమును అందజేశారు. వేలాది మంది భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లల మామిడాడ పరిసరం వారాహిమ నామస్మరణతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్తి భగవాన్ రెడ్డి,కార్యదర్శి మండ రాజారెడ్డి, కోశాధికారి డి ఆర్ కే రెడ్డి, మోహన్ రెడ్డి,సతీష్ రెడ్డి ,ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి, చిన్న గురువు, చంద్రమౌళి,సిద్ధార్థ సత్తిరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## వారాహిమాతకు రూ 3.50 లక్షల వెండి వస్తువులు సమర్పణ



పెదపూడి, జూలై 23, ప్రభాతవార్త: పెదపూడి మండలం గొల్లల మామిడాడ అయ్యప్ప స్వామి ఆలయంలో గల వారాహి అమ్మకు 1.5 కేజీల రూ 3.50 లక్షల విలువైన రోకలి,నాగలి, పాశము, అంకుశం వెండి వస్తువులను అనపర్తి గ్రామానికి చెందిన కర్రీ సాంబశివారెడ్డి సీతాదేవి దంపతులు, పందలపాక గ్రామానికి చెందిన పడాల రామారెడ్డి లక్ష్మి దంపతులు సమర్పించక ఆలయ ప్రధాన అర్చకులు త్రిపాటి పాండే శుక్ల అమ్మవారికి అలంకరించారు. సాంబశివారెడ్డి దంపతులను ఆలయ చైర్మన్ సత్తి భగవాన్ రెడ్డి సాలువతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి తొలి ప్రాధాన్యం

**ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాల కల్పన**
**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**




రావులపాలెం, జూలై 23 (ప్రభాతవార్త) : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని గురువారం సందర్శించిన ఆయన, గతంలో గుర్తించిన ఫ్యాన్లు, సీలింగ్, మరుగుదొడ్ల సమస్యలను ప్రభుత్వ నిధులతో పరిష్కరించిన అనంతరం ఏర్పాటైన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వసతి గృహంలో ప్రస్తుతం అన్ని సౌకర్యాలు మెరుగుపడ్డాయని తెలుసుకున్నారు. విద్యార్థినులకు ట్రంక్ బాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, బ్లాంకెట్లు, స్వెటర్లు, టవల్స్తో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్య నాణ్యత పెరుగుతోందని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దూరదృష్టితో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు.

## నేడు పిఠాపురంలో "వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్" కార్యక్రమం..

పిఠాపురం, జూలై23 ,(ప్రభాత వార్త ) ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ, శుక్రవారం పిఠాపురం పాడా కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి అలాగే డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు శుక్రవారం పిఠాపురం పాడా కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉదయం 9:30 నిమిషాలకే విధిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

మరిన్ని వార్తలు 6లో

## తమకు ఇష్టంలేనిచోట పునరావాసం వద్దని నిర్వాసితుల నిరసన



వి.ఆర్.పురం,జూలై23,ప్రభాతవార్త వడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని వి.ఆర్.పురం గ్రామానికి చెందిన పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు, తమకు ఇష్టంలేని ప్రాంతంలో అధికారులు బలవంతంగా పునరావాసం కల్పించాలని చూస్తున్నారని ఆరోపిస్తు, గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ కు వ్యతిరేకంగా నిర్వాసితులు నినాదాలు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇక్కడి గిరిజనేతర 1147 నిర్వాసిత కుటుంబాలకు పునరావాస కాలనీలు కట్టించి ఇచ్చేందుకు ప్రభుత్వం స్థల సేకరణకు పూనుకుంది. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజుల క్రితం అధికారులు ప్రభుత్వ ఖర్చులతో ఎన్టీఆర్ జిల్లా, గంపలగూడెం, తిరువూరు ప్రాంతాల్లో వీరికి భూమి చూపించేందుకు తీసుకొని వెళ్ళారు. అలా వెళ్ళి వచ్చిన నిర్వాసితుల్లో ఆతరువాత పునరావాస కాలనీల విషయమై భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు తమకు గంపలగూడెం ప్రాంతం నివాసానికి ఆమోగ్యమైందిగా ఉందని అధికారులకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా గంపలగూడెం ఆర్.డి.ఒ ను కలిసి తమకు పునరావాస కాలనీల కోసం ఇక్కడ స్థలం కల్పించాలని వారు వినతి పత్రం అందించారు. ఇక వైసిపి మద్దతుదారులు గంపలగూడెం ప్రాంతం తమకు నివాసయోగ్యంగా లేదని కొయ్యలగూడెం, గోకవరం ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, చింతూరు ఐటిడిఏ పిఒ శుభం నోక్వాల్ లకు తమ అభిప్రాయం తెలియజేస్తు వినతి పత్రాలు అందించారు. తాజాగా గురువారం ఇదే విషయమై వి.ఆర్.పురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.

**అవగాహన రాహిత్యంతోనే పునరావాస ప్రాంతాన్ని తిరస్కరిస్తున్నారా ?......**

వి.ఆర్.పురం నిర్వాసితులకు ప్రభుత్వ అధికారులు ఎన్.టి.ఆర్ జిల్లా తిరువూరు, గంపలగూడెం ప్రాంతాల్లో పునరావాస కాలనీలు ఏర్పాటు చేసేందుకు స్థలాలు చూపించగా, కొందరు ఆ ప్రాంతానికి అందుబాటులో ఉన్న పట్టణాలు, విద్యా, వైద్య సదుపాయాలు, ఆర్థిక వనరులపై సరైన అవగాహన లేకనే అధికారులు కల్పిస్తామని చూపించిన పునరావాస ప్రాంతాన్ని తిరస్కరిస్తున్నారని తెలుస్తుంది. ఎన్.టి.ఆర్ జిల్లాలోని తిరువూరు అసెంబ్లీ నియోజక వర్గం కాగా, గంపలగూడెం మండల కేంద్రంగా ఉంది. ఈ రెండు పట్టణాల్లో విద్యా, వైద్యంతోపాటు అనేక వసతులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా ఇక్కడకు విజయవాడ మహానగరం కేవల 60 నుండి 70 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. ఈ రెండు ప్రాంతాలకు తెలంగాణా రాష్ట్రంలోని మధిర పట్టణం కేవలం 20 నుండి 35 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. మధిర పట్టణం సకల వసతులతో, ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం తరువాత అతిపెద్ద పట్టణంగా ఉంది.

## రాధా--రంగా మిత్రమండలి కడియం మండల ఉపాధ్యక్షుడిగా గణేషుల చక్రవర్తి



కడియం, జూలై 23 ( ప్రభాతవార్త) ఆంధ్ర-- తెలంగాణ రాధా--రంగా మిత్రమండలి కడియం మండల ఉపాధ్యక్షుడిగా కడియం గ్రామానికి చెందిన గణేషుల చక్రవర్తి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కాశ్యపేట బుజ్జి నియామక పత్రాన్ని అందజేసి ఆయనను అభినందించారు. వంగవీటి మోహన రంగా ఆశయాల సాధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యువతను సేవాభావం వైపు ప్రోత్సహిస్తున్న చక్రవర్తికి ఈ బాధ్యతలు దక్కడం పట్ల రాధా--రంగా అభిమానులు, కాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చక్రవర్తి కుటుంబానికి దివంగత వంగవీటి మోహన రంగా కుటుంబంతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆయన తండ్రి దివంగత గణేషుల రమణ కడియం మండలంలో రంగా మిత్రమండలి కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా కడియం మండలంలో [illegible] వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించడంలో ప్రధాన భూమిక నిర్వహించారు. తండ్రి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ చక్రవర్తి కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుండటం విశేషం. ఈ సందర్భంగా గణేషుల చక్రవర్తి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కాశ్యపేట బుజ్జికి కృతజ్ఞతలు తెలిపారు. రాధా--రంగా ఆశయాలను అనుసరించి మండలంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ, యువతను సంఘటితం చేసి మిత్రమండలిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కడియం మండలానికి చెందిన పలువురు కాపు నాయకులు, రాధా--రంగా అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గణేషుల చక్రవర్తిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ రంగా ఆశయాల సాధనకు [illegible] విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## చెన్నై 'ఐఐటీ'లో సీటు సాధించిన ఒమ్మంగి విద్యార్థి

**శ్రీ భారతీ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి సురేంద్రకు అభినందించిన విద్యా సంస్థల చైర్మన్ సుంకర వీరబాబు**



ప్రత్తిపాడు, జూలై 23 (ప్రభాతవార్త) మండలంలోని ఒమ్మంగి శ్రీ భారతీ విద్యానికేతన్ పూర్వ విద్యార్థి దేవర్ల సురేంద్ర ప్రతిష్ఠాత్మక చెన్నై (తమిళనాడు) ఐఐటీలో సీటు సాధించి మండల ఖ్యాతిని చాటారు. ఈ సందర్భంగా గురువారం శ్రీ భారతీ విద్యాసంస్థల చైర్మన్ సుంకర వీరబాబు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో ప్రాథమిక విద్యను అభ్యసించిన సురేంద్ర జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సాంకేతిక విద్యాసంస్థలో సీటు సాధించడం తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కష్టపడి చదవే తత్వం, క్రమశిక్షణే సురేంద్రను ఈ స్థాయికి చేర్చాయని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు అభ్యసించి, దేశానికే గర్వకారణంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు సురేంద్రను అభినందించారు.

## విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


**రావులపాలెం ఎస్‌ఐ చంటి**



రావులపాలెం, జూలై 23 (ప్రభాతవార్త) : విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటే భవిష్యత్తులో సమాజాభివృద్ధికి తోడ్పడగలరని రావులపాలెం ఎస్ఐ చంటి అన్నారు. స్థానిక నారాయణ పాఠశాలలో నిర్వహించిన 'స్టూడెంట్ క్యాబినెట్ ఇన్‌స్టలేషన్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు [illegible] నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణబాబు, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, కోఆర్డినేటర్ గోవిందస్వామి, ప్రవీణ్‌కుమార్, వెంకట కిషోర్, అకడమిక్ డీన్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, ఏవో వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


# మెగా పీటీఎం 4.0ను విజయవంతం చేయండి

- ఎస్ఆర్‌కేవీఎం కిట్స్‌ను సద్వినియోగం చేసుకోండి
- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై23,ప్రభాతవార్త. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు ఈ నెల 24న నిర్వహిస్తున్న మెగా పీటీఎం 4.0ను విజయవంతం అయ్యేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల పిలుపునిచ్చారు. పట్టణంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎస్ఆర్‌కేవీఎం కిట్ల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎస్ఆర్‌కేవీఎం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, బెల్టు, స్కూల్ బ్యాగ్, డిక్షనరీ వంటి తొమ్మిది రకాల వస్తువులను విద్యార్థుల కు అందజేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 మండలాల పరిధిలోని 1,409 పాఠశాలల్లోని 74,895 మంది విద్యార్థులకు ఎస్ఆర్‌కేవీఎం కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఎస్ఆర్‌కేవీఎం కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధిని సాధించాలని సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 1,409 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మెగా పీటీఎంలో భాగంగా మినిట్ టు మినిట్ షెడ్యూల్‌ను కచ్చితంగా ఫాలో అవ్వాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందజేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్‌పై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యార్థి సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా మెగా పీటీఎంలను నిర్వహించా లన్నారు. పీఎంశ్రీ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీలు మాట్లాడుతూ మెగా పీటీఎం నిర్వహణలో అలసత్వానికి, వివాదాలకు తావులేకుండా ప్రభుత్వ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. మెగా పీటీఎం నిర్వహణ నిమిత్తం 1,409 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలలకు రూ.25,95,150లు విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఎస్ఆర్‌కేవీఎం కిట్లను అందజేశారు. ఎస్ఆర్‌కేవీఎం కిట్ల డెమోను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.ఘనసత్యనారాయణ, సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎం.వి.వి.సత్యనారాయణ, ఏపీఓ డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంఈవో--2 ఎస్.దుర్గాదేవి, కాంప్లెక్స్ సీఆర్ఎంటీ మెండు శ్రీనుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటి జాడ లేని గౌతమీ పాయ




అయినవిల్లి జూలై 23 ప్రభాతవార్త జూన్ నెల వచ్చిందంటే ఒకపక్క వరదలు మరోపక్క వర్షాలు కోనసీమ జిల్లా ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేసేది జూలై 24 తేదీ వచ్చినప్పటికీ ఇంతవరకు వర్షం గాని గోదావరికి వరద గాని లేకపోవడంతో వర్షా బావ పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు పరవళ్ళు తొక్కే గోదావరి గౌతమీపాయ కనీస ప్రవాహం కూడా లేకుండా ఇసుక దిబ్బలు తెలి పోయాయి మేఘాలకి పరిమితిమై చినుకు పడని పరిస్థితి ఏర్పడింది మెట్టపంటలు తీవ్రంగా దెబ్బతింటూ రైతులు ఆందోళన చెందుతున్నారు నైరుతి రుతుపవనాలు కరుణించకపోవడంతో వర్షాకాలమే ప్రారంభం కాలేదు భూగర్భ జలాలు ఇంకిపోవడంతో వ్యవసాయ బోర్లు ఉన్నచోట నీరు రావట్లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు వర్షాలు పడాలని ప్రతి ఒక్కరూ దేవుని ప్రార్థించడం తప్ప చేయగలిగింది లేదు

## కూటమిచేసిన అభివృద్ధి ప్రజల్లోకి తీసుకువెళ్లాలి నాగిడి



కాట్రేనికోన జూలై 23 (ప్రభాతవార్త) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి ,సంక్షేమ పథకాలను నాయకులు ప్రజలకు వివరించాలని తెదేపా సీనియర్ నాయకుడు నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమంపై ఇంటింటా ప్రచార కార్యక్రమంపై తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు చెల్లి సురేష్ అధ్యక్షతన నాయకులకు కార్యకర్తలకు అవగాహన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం గ్రామాలలో రోడ్లు ,మౌలిక వసతులు కల్పన వంటి అనేక పనులు చేపట్టిందన్నారు. సూపర్ సిక్స్ లో భాగంగా తల్లికి వందనం మహిళలకు ఉచిత బస్సు అన్నదాత సుఖీభవ వంటి ప్రజా ఉపయోగ పథకాలు చేపట్టిందన్నారు .నాయకులంతా నెల రోజులపాటు ప్రభుత్వం చేసిన ఈ అభివృద్ధిని ఇంటింటికి తిరిగి వివరించి, రేపు రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో నూరు శాతం విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజు ఒక గ్రామ పరిధిలో 30 ఇల్లు తగ్గకుండా ప్రచారం నిర్వహించి మై టిడిపి యాప్లో వివరాలు పొందుపరచాలన్నారు. ఎవరు అలసత్వం వహించకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇసుకపట్ల వెంకటేశ్వరరావు ,వెంకటరమణ బండారు ఏసు, గౌంగుమళ్ల భద్ర రావు, ఆనంద్ ,జయంతి రావు ,సువర్ణ జ్యోతి, అప్పారావు సత్తాల ప్రసాద్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

## గొల్లప్రోలు కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దివిజ సంపతి.



గొల్లప్రోలు, జూలై 23,(ప్రభాతవార్త) గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ గా దివిజ సంపతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న పి శ్రీనివాసులు బదిలీ కావడంతో ఆయన స్థానంలో దివిజా సంపతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన దివిజ సంపతిని కమిషనర్ పి శ్రీనివాసులు, మేనేజర్ సర్వేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎండి ఆలీషా, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నీలిమ దీప్తి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. జనసేన నాయకులు తదితరులు నూతన కమిషనర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


## వెలిశెట్టి శ్రీనివాసరావు, వెలిశెట్టి బుజ్జి కి పితృవియోగం పరామర్శించిన జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్:



జగ్గంపేట జూలై 23 (ప్రభాతవార్త) జగ్గంపేట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెలిశెట్టి శ్రీనివాస రావు తండ్రి వెలిశెట్టి అప్పారావు(87) గురువారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలిసిన వెంటనే కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కృష్ణాపురం చేరుకుని అప్పారావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. వారి కుమారులు శ్రీనివాసరావు, మాజీ లైన్స్ క్లబ్ అధ్యక్షులు వెలిశెట్టి బుజ్జి, [illegible] తదితరులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు, పీలా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా నియమాలు పాటించాలి

**కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ - రెండు లారీలు సీజ్**



శంఖవరం జూలై 23 ప్రభాతవార్త టిప్పర్ల యాజమాన్యులు భద్రత నియమాలు పాటించాలని కత్తిపూడి మోటార్ వెహికల్ యూనిట్ కార్యాలయం ఎం వి ఐ బి శ్రీనివాస్ పేర్కొన్నారు మండలంలోని కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు శంఖవరం మండలంలో పరిమితికి మించి లాటరైట్ మట్టి రవాణా చేయుచున్న టిప్పర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు బుధవారం రౌతులపూడి మండలం లో తనిఖీలు చేపట్టి డ్రైవింగ్ లైసెన్స్ లు టార్పాలిన్ కట్టని 12 లారీలు పై కేసులు నమోదు చేసి 60 వేలు ఫైన్ విధించామని, గురువారం శంఖవరం మండలంలో తనిఖీలు చేపట్టి, రెండు టిప్పర్ లారీలపై కేసులు నమోదు చేసి 66,000/-రూపాయలు జరినామా వేసి సీజ్ చేసినట్టు తెలిపారు. ఓవర్ స్పీడు, అధిక లోడు మరియు భద్రతా నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించడం జరిగింది. ఇప్పటివరకు అధిక బరువు భద్రత నియమాలు ఉల్లంఘించిన 24 లారీలపై సుమారు 3 లక్షలు ఫైన్ వేసామన్నారు. నిరంతరం తనిఖీలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం, జులై 24, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం పాణింగపల్లి గ్రామానికి సంబంధించి విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం కలుగునని విద్యుత్ శాఖ అధికారులు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు తెలియజేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని, కనుక వినియోగదారులు అందరూ సహ కరించవలసిందిగా ఆయన కోరారు. ఈ తనిఖీల లో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ప్రత్తి పంటకు భీమా చేయించుకోవాలి



శంఖవరం జులై 23 ప్రభాతవార్త ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎల్నినో ప్రభావం కొనసాగుతున్నందున ప్రత్తి సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు తప్పనిసరిగా ప్రత్తి పంటకు వాతావరణ ఆధారిత బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. శంఖవరం మండలంలోని మండపం, శంఖవరం, జి కొత్తపల్లి గ్రామాల్లో రైతులతో కలసి ప్రత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఓ గాంధీ మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంట భీమా పథకంలో భాగంగా ప్రత్తి పంటకు బ్యాంకులో రుణం లేని రైతులు ఎకరాకు 2000 చొప్పున ప్రీమియం సొమ్మును కామన్ సర్వీస్ సెంటర్లలో చెల్లించి రసీదు పొందవచ్చని, లోను ఉన్న రైతులు బ్యాంకులో ప్రీమియం చెల్లించవచ్చని వివరించారు. ఈ నెల 24 వరకు ప్రత్తి పంటకు భీమా ప్రీమియం చెల్లింపులకు గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, వ్యవసాయ ఉద్యాన సహాయకులు మణికంత, జగదీశ్, క్రాంతి, శ్యామ్ సుందర్, రైతులు పాల్గొన్నారు.

## ముద్రగడ మృతి అన్ని వర్గాలకూ తీరని లోటు: గొంప శివకుమార్


**కాపు ఉద్యమనేత సమాధి వద్ద బీసీవై పార్టీ నాయకుల నివాళులు**

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



ప్రత్తిపాడు, జూలై 23, (ప్రభాతవార్త) దివంగత మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మృతి తీరని లోటని, ఆయన మరణం అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర నష్టమని బీసీవై పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ గొంప శివకుమార్ పేర్కొన్నారు. ?ఈ సందర్భంగా బీసీవై పార్టీ ప్రతినిధులతో కలిసి గొంప శివకుమార్, ముద్రగడ పద్మనాభం సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ... ముద్రగడ ప్రజల సంక్షేమం కోసం, కాపు సామాజిక వర్గ హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలు చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతాయని కొనియాడారు. ప్రజాసమస్యలపై ఆయన చూపిన పోరాట పటిమ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవర శ్రీను, కోన గంగాధర్, సానబోయిన ఆదిబాబు, సానబోయిన కుశరాజు, అప్పలరాజులతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## టిప్పర్ ప్రమాద బాధిత కుటుంబాలకు తె దే పా పది లక్షల ఆర్థిక సాయం



కాకినాడ రూరల్, జూలై 23 (ప్రభాతవార్త): టిప్పర్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన చీడిగ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కార్మికులు కాదా చిట్టెమ్మ, మట్టపర్తి అరుణ కుమారి కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున, చెక్కులను గురువారం కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిప్పర్ ప్రమాదం సంఘటనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉండటంతో ఆ వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ,కేవలం రూ.100 టీడీపీ సభ్యత్వం ద్వారా ప్రమాదంలో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక భరోసా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రత్నగిరిపై 'వరుణ యాగానికి' సన్నాహాలు


**ఈఓ నల్లం సూర్యచక్రధరరావు**




శంఖవరం( అన్నవరం,) , జులై - 23. ప్రభాతవార్త భారతదేశంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, దేశ రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో త్వరలో 'వరుణ యాగం' తలపెట్టనున్నట్లు అన్నవరం దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు పేర్కొన్నారు.?గురువారం దేవస్థానంలో వైదిక కమిటీ సభ్యులు,ప్రధాన అర్చకులు,పండితులతో ఈఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యాగ నిర్వహణ, ముహూర్తం, వైదిక క్రతువుల రూపురేఖలపై సుదీర్ఘంగా చర్చించారు. ?ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా రైతాంగం సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, మంచి వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని స్వామివారిని ప్రార్థిస్తూ ఈ యాగం చేపడుతున్నట్లు ఈఓ తెలిపారు.వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా మరియు అత్యంత వైభవంగా వరుణ యాగాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.యాగానికి ?ముహూర్తం, సంబంధించిన తేదీలు, కాలపట్టికను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని ఈఓ పేర్కొన్నారు.?ఈ సమావేశంలో దేవస్థాన ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, వైదిక కమిటీ సభ్యులు గంగ బాబు,గొల్లపల్లి, శివరామకృష్ణ,వేదుల సూర్యనారాయణ మూర్తి, చామర్తి కన్నబాబు మరియు పట్టాభిరామమూర్తి పాల్గొన్నారు.

# రోడ్లపైనే పార్కింగ్.. ప్రజలకు నిత్య నరకం

- లోడింగ్, అన్‌లోడింగ్ అంతా రహదారులపైనే
- ప్రయాణికుల ఇబ్బందులు పట్టని వైనం
- సా మిల్లుల యాజమాన్యాల ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



పిఠాపురం, జూలై 23 ( ప్రభాతవార్త ) పిఠాపురం పట్టణంలో కొన్ని సా మిల్లుల వద్ద రహదారులనే పార్కింగ్ స్థలాలుగా, లోడింగ్--అన్‌లోడింగ్ కేంద్రాలుగా మార్చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ లారీలు గంటల తరబడి రోడ్లపైనే నిలిపివేసి దుంగలు, కలప సామగ్రిని ఎక్కించడం, దించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు నిత్యం ప్రమాదాల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో కూడా లారీలను రహదారిపైనే నిలిపి లోడింగ్, అన్‌లోడింగ్ పనులు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ పూర్తిగా స్తంభించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు, ఆటోలు, పాఠశాల బస్సులు, అత్యవసర సేవల వాహనాలు సైతం ఇబ్బందులు పడుతున్నాయి. కొన్నిచోట్ల రహదారి సగభాగం పూర్తిగా ఆక్రమించబడడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదకరంగా దాటాల్సి వస్తోంది. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో సా మిల్లుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారులపై వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ చర్యలు లేకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ప్రజలు చెబుతున్నారు. రోడ్లపై నిలిపిన లారీల కారణంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, వర్షపు నీటితో కలిసి ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సా మిల్లుల వద్ద ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, రహదారులపై లోడింగ్--అన్‌లోడింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై జరిమానాలు విధించి, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.





తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఆషాఢ మాసం సారె సమర్పణ





పిఠాపురం, జూలై23 ,(ప్రభాత వార్త ) శ్రీ పాదగయ దేవస్థానంలో కొలువై ఉన్న 10వ శక్తి పీఠం శ్రీ పురుహూతికా అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా పిఠాపురం మండలం విరవ గ్రామం నుండి 300 మంది మహిళలు కాలి నడకన బయలుదేరి అమ్మవారికి ఆషాఢ మాసం సారె సమర్పించారు.వీరికి దేవస్థానం రాజగోపురం నుండి ఆహ్వానం పలుకుతూ సారె సమర్పణ అనంతరం వారికి అన్న ప్రసాద వితరణ, ఇతర ఏర్పాట్లు దేవస్థానం అధికారులు నిర్వహించారు.


## జాతీయ పవర్ లిఫ్టింగ్ లో సిల్వర్ మెడల్ విజేత అప్పన్న కు అభినందనలు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై23,ప్రభాతవార్త. ఈనెల 18 తేదీ నుండి 21 తేదీ వరకు మహారాష్ట్ర ఔరంగాబాద్ లో జరిగిన మాస్టర్స్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడలను ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం కానిస్టేబుల్, నేషనల్ పవర్ లిఫ్టర్ బి. అప్పన్న కైవసం చేసుకున్నారు. 120 కేజీల విభాగంలో 550 కేజీల బరువు ఎత్తి జాతీయ స్థాయిలో సిల్వర్ మెడలను గెలుసుకున్న అప్పన్న ను హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ లో ఘనం గా అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎనుముల కృష్ణ పద్మరాజు మాట్లాడుతూ యువ క్రీడాకారులకు ఎంతో క్రమశిక్షణతో క్రీడల పట్ల మక్కువతో వయసుతో సంబంధం లేకుండా 50 సంవత్సరాల వయసులో కూడా 550 కేజీల బరువు నెత్తి రెండుసార్లు జాతీయ పతక విజేతైన అప్పన్న క్రీడా ప్రతిభ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.అనంతరం జాతీయ పతక విజేత అప్పన్న ను క్రీడాభిమానులందరూ ఘనంగా సత్కరించి , అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం.వి. సముద్రం, ముక్తాబత్తుల వెంకట రమణ, తిక్క మురళి, అల్లాడి వెంకటరమణ, మేకల కిషోర్,వాకా గోపి, డి. మణికంఠ వర్మ, ఎనమదుల బుజ్జి, యనమదుల పల్లంరాజు, కట్ట బుజ్జి, తరట్ల రాజేష్, వాసంశెట్టి శ్రీనివాస్, పాస్టర్ బెనర్జీ,హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వర రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.


## అమీనాబాదులో రెండు డెంగీ కేసులు నమోదు

**జిల్లా వైద్యాధికారిణి అనిత పరిశీలన**




యు.కొత్తపల్లి, జూలై 23(ప్రభాతవార్త) : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం అమీనాబాదు గ్రామంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి అనిత పర్యటించారు. గ్రామంలో రెండు డెంగ్యూ జ్వర కేసులు నమోదు కావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డెంగ్యూ కేసులు నమోదైన ఇంటి పరిసరాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామం నుండి వారం రోజుల క్రితం ఒకరు జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆరోగ్య కేంద్రానికి రావడంతో సూచనలను బట్టి ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్వేత కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేసారు. అక్కడ వైద్య పరిక్షల్లో డెంగ్యూ పాజిటివ్ రావడంతో అప్రమత్తమయ్యారు. గురువారం గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచి, ప్రజలను అప్రమత్తం చేశారు. వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. ఆమె వెంట జిల్లా మలేరియా అధికారి ప్రభాకర్ ఉన్నారు.

## వాదాలకుంటలో ఘనంగా జగన్నాథ రథయాత్ర



గోపాలపురం, జూలై 23 (ప్రభాతవార్త): గోపాలపురం మండలం వాదాలకుంటలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఇస్కాన్ భగవద్గీత పాఠశాలకు చెందిన లెర్న్ గీతా -- లివ్ గీతా బృందం కోఆర్డినేటర్ కృష్ణప్రియ దేవిదాస్ (కళ్యాణి ప్రసాద్ వెలగ) ఆధ్వర్యంలో ఈ రథయాత్రను నిర్వహించారు. అనంతకోటి బ్రహ్మాండ నాయకుడు, పతితపావనుడైన శ్రీ జగన్నాథుడు, బలదేవుడు, సుభద్రాదేవి, సుదర్శనుని ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించిన రథంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. రథయాత్రకు ముందు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారికి మహామంగళహారతి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, శ్రీ జగన్నాథుని రథయాత్రను దర్శించడం, రథాన్ని లాగడం, దివ్యరథాన్ని స్పృశించడం ద్వారా భక్తులకు విశేష పుణ్యఫలాలు లభిస్తాయని శాస్త్రాలు పేర్కొంటున్నాయని చెప్పారు. భక్తి, శ్రద్ధలతో స్వామివారిని సేవించిన వారికి సకల శుభాలు కలుగుతాయని, పూరి జగన్నాథుని మహిమను ప్రతి ఒక్కరూ తెలుసుకుని ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎప్పుడూ లేని విధంగా వాదాలకుంటలో ఈ స్థాయిలో శ్రీ జగన్నాథ రథయాత్ర నిర్వహించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. గ్రామంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కన్నులపండువగా సాగిన రథయాత్రను తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం విజయవంతానికి గ్రామస్థులు, సేవకులు, భక్తులు విశేషంగా సహకరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూలై 23 (ప్రభాతవార్త )ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, పేద ప్రజల ఆర్థిక స్థితిగతులను మరింత మెరుగుపర్చడంతో పాటూ ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన సుమారు 2.5 లక్షల రూపాయలు చెక్కులను గురువారం శాసనసభ్యులు క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు కొండబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్యానికి దూరం కాకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తమకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించిన సీఎం చంద్రబాబుకి, ఎమ్మెల్యే కొండబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లాడి గంగాధర్, బూడి ప్రకాష్, అంగాడి దుర్గారావు, తెప్పల రామలింగేశ్వరరావు, సయ్యద్ అలీ, రిక్క సంజీవ్, తాడిచర్ల వెంకటేశ్వరరావ, తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps